# క్రాంతి

సి.పి.ఐ. (మావోయిస్టు) ఎ.పి., ఎన్.టి., ఎ.ఒ.బి. కమిటీల అధికార పత్రిక

సంపుటి: 33   సంచిక: 5   సెప్టెంబర్ - అక్టోబర్ 2009   వెల: ఐదు రూపాయలు


లోపలి పేజీల్లో...


పార్టీ 5వ వార్షికోత్సవం ........ 8
చైనా విప్లవానికి 60 ఏళ్లు ........ 18
అధిక ధరలు ........ 20
అధ్యయన పద్ధతుల్ని సంస్కరించుకొందాం .... మధ్యపేజీలో
లాల్‌గఢ్ పోరాటం ........ 27
అమరులకు వినమ్ర నివాళి ........ 33
'ఆపరేషన్ వికాస్' ........ 37
ప్రతిఘటనా-పోరాటాలూ- ........ 39


## బహుముఖ ప్రజ్ఞాశాలీ, పీడిత ప్రజల ప్రియతమ పుత్రుడు

## శత్రు బహుముఖ దాడికి ధీటైన సమాధానంగా నిలిచిన యోధుడు

## ఆదర్శ గెరిల్లా సైన్యానికి నిఖార్సయిన నమూన మన ఇంటెలిజెన్స్ డైరెక్టర్

# కామ్రేడ్ పటేల్ సుధాకర్ రెడ్డి అమర్ రహే!

2009 మే 24 భారత విప్లవోద్యమ చరిత్రలో ఒకానొక అతి విషాదకర దినంగా నిలిచిపోయింది. శత్రు ఆనుపానులను శోధించి విప్లవ విజయంలో కీలకపాత్ర వహించే, విప్లవోద్యమ నిఘా విభాగపు (ఇంటలిజెన్స్) మొట్ట మొదటి డైరెక్టర్ కామ్రేడ్ పటేల్ సుధాకర్ రెడ్డిని ఇదే విభాగంలో పని చేసే కామ్రేడ్ వెంకటయ్యతోపాటు కోల్పోయిన దుఃఖదాయక దినమది.



బూటకపు ఎన్‌కౌంటర్లతో కుఖ్యాతిగాంచిన ఆంధ్రప్రదేశ్ పోలీసులు 2009 మే 24న మరో ఎన్‌కౌంటర్ కట్టుకథను వినిపించారు. వరంగల్ జిల్లా ఏటూరునాగారం మండలం లవ్వాల అడవుల్లో పోలీసులకూ నక్సలైట్లకు జరిగిన ఎన్‌కౌంటర్‌లో పటేల్ సుధాకర్ రెడ్డి, వెంకటయ్యలు మరణించారన్నది ఆ కట్టుకథ సారాంశం.

అయితే లవ్వాల అడవులకు వెళ్లిన నిజనిర్ధారణ కమిటీ అక్కడ ఎన్‌కౌంటర్ జరిగిన ఆనవాళ్లు లేవని తేల్చింది. హైకోర్టు ఆదేశంతో వరంగల్ ఎం.జి.ఎం. ఆసుపత్రిలో చేసిన రీపోస్ట్‌మార్టమ్ కూడా తూతూ మంత్రమే అయ్యింది. బహిరంగ చర్చకు వచ్చి ఎన్‌కౌంటర్ అని నిరూపించుకోవాలని చేసిన సవాల్‌కు ప్రభుత్వం, పోలీసుల నుండి ఏ సమాధానమూ లేదు.

నిజానికి మహారాష్ట్రలోని నాసిక్‌లో మే 23న ఈ ఇద్దరు కామ్రేడ్స్‌ను నరహంతక ఎ.పి. ఎస్.ఐ.బి. పట్టుకొని వాయు మార్గంలో వరంగల్‌కు తీసుకువచ్చి తీవ్ర చిత్రహింసలకు గురిచేసి, మే 24న ఉదయం పదిన్నరకు లవ్వాల అడవుల్లో కాల్చి చంపారు. అమరత్వం నాటికి కామ్రేడ్ సుధాకర్ రెడ్డి కేంద్ర కమిటీలో సభ్యుడిగా వుండి విప్లవోద్యమ నిఘా విభాగంకు డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. కామ్రేడ్ వెంకటయ్య జిల్లా కమిటీ సభ్యుడి స్థాయిలో ఇదే విభాగంలో చురుగ్గా పని చేస్తున్నాడు. విప్లవోద్యమానికి ఆరోప్రాణంగా చెప్పుకునే నిఘా విభాగంలో కీలకమైన బాధ్యతలను నిర్వహిస్తున్న వీరిరువురినీ కోల్పోవడం తీవ్రమైన నష్టం. ఈ అమరులకు వినమ్రంగా జోహార్లు

అర్పిస్తూ వారి ఆశయ సాధనలో దృఢంగా నడుస్తూ, ఈ నష్టాన్ని పూడ్చుకోవడానికి తీవ్రంగా కృషి చేద్దాం.

## పాలమూరు పోరు పరిమళం

దాదాపు మూడు దశాబ్దాలపాటు విప్లవోద్యమంలో వివిధ స్థాయిల్లో అవిశ్రాంతంగా బాధ్యతలు నిర్వహిస్తూ తనదైన ముద్రను వేసుకున్న కామ్రేడ్ పటేల్ సుధాకర్ రెడ్డి; రామన్న, శ్రీకాంత్, సూర్యం, వికాస్ పేర్లతో పార్టీ శ్రేణులకూ, విప్లవ ప్రజానీకానికి సుపరిచితుడు. దక్షిణ తెలంగాణాలోని మహబూబ్‌నగర్ జిల్లా కుర్తిరావుల చెరువు ఆయన స్వగ్రామం. ధనిక రైతు కుటుంబంలో 50వ దశకం చివర్లో జన్మించాడు. చిన్నతనం నుంచి ఆదర్శ భావాలుగల సుధాకర్ రెడ్డిపై 1978లో జరిగిన జగిత్యాల జైత్రయాత్ర తదనంతరం ఊపందుకున్న కరీంనగర్, ఆదిలాబాద్ రైతాంగ పోరాటాల ప్రభావం గాఢంగా పడింది. ఈ ప్రభావంతో పాలమూరులో ఉద్యమం ప్రారంభమైన తొలి దశలో కామ్రేడ్ సుధాకర్ రెడ్డి విప్లవోద్యంలోకి అడుగుపెట్టాడు. పాలకవర్గాల దోపిడీకి తీవ్రంగా గురయి, కరువుకు మారుపేరుగా వున్న పాలమూరు పీడిత ప్రజల విముక్తికి 1980వ దశకంలో నడుం బిగించిన నేతల్లో కామ్రేడ్ సుధాకర్ ఒకరు. పురిటిలోనే కొంతమంది వెన్ను చూపి దిగజారినా తను దృఢంగా, నిటారుగా నిలబడి నమ్మిన ఆశయాలనూ, ఆదర్శాలనూ చివరి శ్వాస వరకు కొనసాగించాడు.

కరీంనగర్, ఆదిలాబాద్ రైతాంగ పోరాటాల ప్రేరణతో 1980లో రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు విప్లవోద్యమ పోరాట పథంలో కదిలారు. ఆనాడు వున్న విప్లవ విద్యార్థి కేంద్రాల్లో గద్వాల పట్టణం ముఖ్యమైనది. ఆనాడు ఎంతోమంది విద్యార్థులను విప్లవోద్యమానికి అందించింది. 1980లో గద్వాలలో డిగ్రీ కళాశాలలో చదువుతూ కామ్రేడ్ పటేల్ సుధాకర్ రాడికల్ విద్యార్థి సంఘంలో చేరాడు. హైదరాబాద్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి 1983లో విప్లవోద్యమంలో పూర్తికాలం కార్యకర్తగా మారి, పాలమూరు విప్లవోద్యమంలో అమరుడు కామ్రేడ్ సుదర్శన్ రెడ్డి (కిరణ్)తో పాటు పని చేశాడు. విద్యార్థులతో, ప్రజలతో, యువకులతో మమేకమౌతూ గద్వాల పట్టణంలో విప్లవోద్యమాన్ని బలోపేతం చేశాడు. తన కృషి ఫలితంగా సమాజంలోని ప్రతి సమస్యకు గద్వాల స్పందించింది. బంద్‌లతో సహా అనేక పోరాట రూపాలు విరివిగా విజయవంతం అయ్యాయి.

1984 చివరలో జరిగిన రాష్ట్ర రాజకీయ తరగతుల్లో కామ్రేడ్ సుధాకర్ రెడ్డి పాల్గొన్నాడు. అప్పటికే ఉద్యమాన్ని ఉత్తర తెలంగాణాలో గెరిల్లా జోన్ స్థాయిని పరిపూర్తి చేసుకొనే విధంగా, దండకారణ్యంను విముక్తి ప్రాంతంగా మలిచే విధంగా ఉద్యమ కృషి ప్రారంభమయింది. ఈ అవకాశాన్ని పరిపూర్తి చేసే విధంగా ఏటూరునాగారం అటవీ ప్రాంతానికి (అప్పటికి ఈ ప్రాంతం దండకారణ్యంలో భాగంగా వుంది) కా. సుధాకర్ రెడ్డిని కమాండర్‌గా పంపాలని ఎ.పి.రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. 1985లో కమాండర్‌గా బాధ్యతలు స్వీకరించి 1986 వరకు అక్కడ పని చేశాడు. అప్పటికి అక్కడ ఒకవైపు శత్రువుతో, మరోవైపు మితవాద జనశక్తి గ్రూపుతో తలమునకలవుతూ ప్రజల్లో వేళ్లూనుకోవాల్సిన స్థితి. అప్పటికే ఎన్.టి.ఆర్. ఫాసిస్టు ప్రభుత్వం ఉద్యమాన్ని నిర్మూలించడంకొరకు అప్రకటిత యుద్ధాన్ని ప్రారంభించి ఎన్‌కౌంటర్ హత్యాకాండను సృష్టిస్తున్న కాలం. ఒకవైపు శత్రువుతో పోరాడుతూ, మరోవైపు జనశక్తి గ్రూపుతో సిద్ధాంత, రాజకీయ పోరాటం జరుపుతూ ప్రజా పునాదిని నిర్మించడం కోసం తీవ్రంగా కృషి చేసి అనతికాలంలోనే అక్కడి ప్రజలకు ప్రేమాస్పదుడయ్యాడు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉద్యమం అభివృద్ధి చెందిన నేపథ్యంలో ఎన్.టి. ఉద్యమం రీజనల్ కమిటీగా ఏర్పడింది. ఏటూరునాగారం, మహదేవ్‌పూర్ అటవీ ప్రాంతం 1986లో ఎన్.టి.లో భాగమైంది. ఆ సమయంలో కామ్రేడ్ సుధాకర్ రెడ్డి ఉద్యమ అవసరాల రీత్యా గడ్చిరోలి జిల్లాకు బదిలీ అయ్యాడు. అక్కడ ఆయన రామన్న పేరుతో ఏటపల్లి ప్రాంతంలో కమాండర్‌గా బాధ్యతలు చేపట్టాడు. ఆనాటికి అక్కడ విప్లవోద్యమం బలపడలేదు. కా. రామన్న ఆదివాసీ మాడియా భాషను పట్టుదలతో నేర్చుకుని ప్రజలలో విప్లవ రాజకీయ చైతన్యాన్ని పెంచడానికి మంచి కృషి చేశాడు. విప్లవ సంఘాలు బలపడకుండా గ్రామంలోని పెద్ద మనుషులు చేపట్టే చర్యలను అర్థం చేసుకున్న రామన్న వారితో సౌమ్యంగానే వ్యవహరిస్తూ యువతపై కేంద్రీకరించి వారిని సంఘటితం చేసి కంసంసూర్ ప్రాంతంలో ఒక బలమైన విప్లవోద్యమానికి పునాదులు వేశాడు. కోయందూర్, ఒట్టెగట్ట, కోందవాహి, గడ్డేరు, కుదిరి, కొటిమి, గోడ్సూర్, కొత్తకొండ, జప్పి, బోరియా మొదలైన గ్రామాల్లో ప్రజలు ఈనాటికీ ఆయన కృషిని గుర్తు చేసుకుంటారు. ఒక్క ఆదివాసీ రైతాంగాన్నే కాకుండా విద్యార్థి, ఉద్యోగులను విప్లవోద్యమంలో భాగం చేయడానికి శక్తివంచనలేకుండా కృషి చేశాడు. ప్రారంభం నుండి గడ్చిరోలిలో పోలీస్ నిర్బంధం తీవ్రంగా వుండేది. దళాల మీద పోలీసు దాడులు తరచూ జరిగేవి. ఆ దాడుల్లో కా. సుధాకర్ రెడ్డి దృఢంగా ప్రతిఘటిస్తూ మిగతా సభ్యులతో ప్రతిఘటింపజేస్తూ సమర్థవంతమైన మిలటరీ కమాండర్‌గా ఎదిగాడు. ఒకసారి పోలీసు దాడికి గురైనప్పుడు తానొక్కడే ప్రతిఘటించి పోలీసులను పరుగులు పెట్టించాడు.

## గెరిల్లాల చేతుల్లో ఎక్కుపెట్టిన తుపాకీ

ఎన్.టి. డీకే ఉద్యమాన్ని వున్నత స్థాయికి తీసుకువెళ్లడంలో భాగంగా, యుద్ధాన్ని తీవ్రతరం చేయడానికీ, పెరుగుతున్న సైన్యాన్నీ నూతన ఆయుధాలను అందించడానికి ఆయుధాల కొనుగోలును నిర్మాణాత్మకంగా చేసే పని ఒక అవసరంగా ఉద్యమం ముందుకు వచ్చింది. ఆయుధాలూ, మందుగుండు కొనుగోలును చూసే బాధ్యతను కా. సుధాకర్ రెడ్డికి సీసీ అప్పగించింది. 1989లో పార్టీ అప్పగించిన ఈ బాధ్యతను మనస్ఫూర్తిగా స్వీకరించాడు. బెంగుళూరు మహానగరంను కేంద్రంగా చేసుకుని, శత్రువు గుండెల్లో గుడారం వేసుకుని పెద్ద యంత్రాంగాన్ని సమకూర్చి వందలాది ఆయుధాలను ఎ.పి., ఎన్.టి., డీకే ఉద్యమాలకు చేర్చాడు. ఆరోజు గెరిల్లా సైన్యానికి ఆయుధాలు అందించి సాయుధం చేయడంలో తన పాత్ర ముఖ్యమైనది. ఆయుధాల సప్లయ్‌లను సమర్థవంతంగా నిర్వహించడంకొరకు వివిధ భాషలు నేర్చుకున్నాడు. శత్రువును కూడా లోతుగా అధ్యయనం చేశాడు. ఈ క్రమంలో ఆయుధాల సరఫరాలో కాంట్రాక్టర్ అందించిన సమాచారంతో 1992 ఏప్రిల్‌లో ఎ.పి.ఎస్.ఐ.బి. కిరాతక ముఠా కా. సుధాకర్ రెడ్డిని అరెస్టుచేసి తీవ్ర చిత్రహింసలకు గురిచేసింది. అయినప్పటికీ ఆయన దృఢంగా నిలబడి పార్టీ రహస్యాలనూ, నాయకత్వాన్ని రక్షించాడు. ఈ అరెస్టుల సందర్భంగా దొరికిన తుపాకులను, ఆనాటి ఫాసిస్టు జనార్ధన్ రెడ్డి ప్రభుత్వం ప్రదర్శించి మునుపటి పీపుల్స్‌వార్ పార్టీపై నిషేధాన్ని విధించి, ఉద్యమంపై తీవ్ర నిర్బంధాన్ని కొనసాగించాడు.

## శత్రు శిబిరంలో ఎగిసిన పోరు కెరటం

1992–97 మధ్య కాలంలో ప్రధానంగా సికింద్రాబాద్ సెంట్రల్ జైలులో నిర్బంధ జీవితాన్ని గడిపాడు. ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమ ప్రాంతాల్లో తీవ్ర నిర్బంధాన్ని కొనసాగిస్తూ ఎన్‌కౌంటర్ హత్యలకు పాల్పడ్డమేకాక మరోవైపు జైలులో రాజకీయ ఖైదీలపై తీవ్ర అణచివేత చర్యల్ని కొనసాగించింది. దీనికి వ్యతిరేకంగా అన్ని జైళ్లనూ సమన్వయం చేశారు. జైళ్లు పోరాట కేంద్రాలయ్యాయి. ప్రజాసంఘాల సంఘీభావంతో నడిచిన ఉద్యమం రాష్ట్ర రాజకీయాలను బలంగా ప్రభావితం చేసింది. విప్లవోద్యమానికి ఎంతో మంది మిత్రుల్ని సమకూర్చింది. అంతర్జాతీయంగా మంచి స్పందనను తెచ్చింది. 94 చివరి నుండి 95 మధ్య వరకు జరిగిన రాజకీయ ఖైదీల చారిత్రాత్మక పోరాటంలో కా. సుధాకర్‌రెడ్డి ఒక ముఖ్య భూమిక వహించాడు. ఈ చారిత్రాత్మక పోరాట విజయంతో సాధారణ, రాజకీయ ఖైదీలు ఎన్నో డిమాండ్లను సాధించుకున్నారు. 14 సంవత్సరాలుగా జైలు జీవితం గడిపిన జీవిత ఖైదీలు వందలాది మంది విడుదలైనారు. మొత్తం ప్రజలపై, ఉద్యమంపై ఈ పోరాట విజయం మంచి ప్రభావం చూపింది. జైళ్లలోని కామ్రేడ్స్‌ను రాజకీయంగా సుశిక్షితుల్ని చేయడంలో, వాళ్లను నిర్బంధంలో దృఢంగా నిలబెట్టడంలో తను తీవ్రంగా కృషి చేశాడు. శత్రువును జైలులో వుండి కూడా తీవ్రంగా అధ్యయనం చేశాడు. పార్టీని రక్షించడం కోసం పార్టీకి ఇంటలిజెన్సీ విభాగం వుండాలని బలంగా అభిప్రాయపడి ప్రతిపాదించాడు. ఇలాంటి అభిప్రాయాలే పార్టీలో తర్వాత కాలంలో ఇంటలిజెన్సీ విభాగం ఏర్పడడానికి దోహదం చేసింది.

## ఆంధ్రప్రదేశ్ విప్లవోద్యమ నేత

1997లో జైలు నుంచి విడుదలైన నాటికి ఆంధ్ర విప్లవోద్యమంపై ఎల్.ఐ.సి. వ్యూహంలో భాగంగా దోపిడీ పాలకవర్గాలు తీవ్ర అణచివేతకు పాల్పడుతుండినాయి. ఇన్‌ఫార్మర్లు, కోవర్టులు, సంస్కరణలతో ముప్పేట దాడితోపాటు కిరాతక గ్రేహౌండ్స్ బలగాలను ఉపయోగించి విప్లవోద్యమానికి ప్రజల్ని దూరం చేయడంతోపాటు దళాలనూ, నాయకత్వాన్ని మట్టుపెడుతున్న కాలమది. ఈ స్థితిలో పార్టీ కా. సుధాకర్ రెడ్డిని రీజనల్ కమిటీ స్థాయికి ప్రమోట్ చేసి, దక్షిణ తెలంగాణకు పంపింది. అక్కడి పరిస్థితులు త్వరగా అర్థం చేసుకుంటూ నల్గొండ, మహబూబ్‌నగర్ ఉద్యమాలను గైడ్ చేశాడు. 1999 నుండి 2001 వరకు దక్షిణ తెలంగాణ ప్రాంతీయ కమిటీ కార్యదర్శిగా వుండి ఉద్యమ రక్షణ కొరకు శత్రువును అధ్యయనం చేస్తూ ప్రతి ఎత్తుగడలను అందించాడు. అన్ని జిల్లాల్లో వ్యూహాత్మకంగా, అనుకూలంగా ఉన్న ప్రాంతాలను పునాదిగా చేసుకొని పని చేయడం; తీవ్ర శత్రు దాడి మధ్య మెదక్ జిల్లా ఆర్గనైజేషన్‌ను రిట్రీట్ చేసి నాయకత్వాన్నీ, బలగాలను కాపాడుకోవడం; కోవర్టులకు వ్యతిరేకంగా నూతన పద్ధతులను రూపొందించడం ఈ ఎత్తుగడలలో ముఖ్యమైనవి. ప్రజా ఉద్యమాలను నూతన తరహాలో నిర్మించడం, నల్గొండలో జలసాధన ఉద్యమం, మహబూబ్‌నగర్‌లో కరువు వ్యతిరేక పోరాటం, దక్షిణ తెలంగాణా వ్యాప్తంగా తెలంగాణ ఉద్యమాన్ని కింది నుంచి నిర్మించడంలో తన కృషీ, సేవలు ముఖ్యమైనవి. ఈ ఉద్యమాలు ఆనాడు ప్రజా పునాదిని పెంచడమేగాక పార్టీని మరింత బలోపేతం చేశాయి.

ఉద్యమం ఎదుర్కొంటున్న సమస్యలను కింది కమిటీల నుండి పై కమిటీల వరకు లోతుగా చర్చించడం, పార్టీ కమిటీల ఫంక్షనింగ్, కమిటీల పటిష్టతకొరకు కృషి చేసేవాడు. మహబూబ్‌నగర్, గుంటూరు, రాయలసీమలలో కమిటీలపరంగా, ఉద్యమపరంగా ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేసి పరిష్కరించడంలో మంచి కృషి చేశాడు. మునుపటి పీపుల్స్‌వార్ కాంగ్రెస్‌కు ముందూ 1999లో, తర్వాత 2002లో ఎ.పి.లో జరిగిన రెక్టిఫికేషన్‌లో వుద్యమ,

కమిటీ లోపాలను సరిదిద్దే విధంగా తన కృషి ఉంది. 2000లో జరిగిన దక్షిణ తెలంగాణ కాన్ఫరెన్స్‌లో, 2000 డిసెంబర్‌లో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహాసభలో, 2003 ప్రారంభంలో జరిగిన రాష్ట్ర ప్లీనంలో ఉద్యమ సమస్యలనూ, కమిటీ సమస్యల్నీ లోతుగా చర్చించి రాజకీయ నిర్మాణ సమీక్షలను సంపద్వంతం చేయడంలో తన పాత్ర వుంది. దక్షిణ తెలంగాణ ఉద్యమాన్ని గెరిల్లా జోన్ స్థాయికి అభివృద్ధి చేసి ఆమోదింప చేయడంలో 2003 ప్లీనంలో వచ్చిన తప్పుడు ధోరణులపై పోరాటం చేయడంలో తన పాత్ర ముఖ్యమైనది.

పట్టణోద్యమంలో తన కృషీ, అనుభవం ఎంతో విలువైనవి. 98 నాటికి శత్రు దాడిలో ఎ.పి.ఎస్.ఐ.బి. కిరాతక హత్యాకాండలో జంట నగరాల కమిటీ తీవ్రంగా దెబ్బతిన్నది. ఆ స్థితిలో నగర కమిటీ బాధ్యతలు తీసుకొని రహస్య పట్టణ ఉద్యమాన్ని నిర్మించడం కొరకు కృషి చేశాడు. అక్కడి క్యాడర్, ప్రజాసంఘాల అభిమానాన్ని చూరగొన్నాడు. బహిరంగ, రహస్య సంఘాలనూ, యూనిట్లను సమన్వయం చేస్తూ, నూతన పద్ధతుల్లో కమిటీలను నిర్మించి వాటిని పని చేయిస్తూ మంచి అనుభవాన్ని అందించాడు. 2002లో మొదటిసారి అర్బన్ పర్స్పెక్టివ్ రూపొందించే డ్రాఫ్టింగ్ కమిటీలో ఆయన వున్నాడు. సిటీ ఉద్యమ అనుభవం ఇతర ఉద్యమాల అనుభవం నుండి తను గ్రహించిన విషయాలను చర్చించి అర్బన్ పర్స్పెక్టివ్‌కు ఎన్నో మార్పులు చేర్పులు సమకూర్చి దాన్ని మెరుగుపరిచాడు.

## స్టేట్ మిలటరీ కమీషన్ బాధ్యుడు

కా. సుధాకర్ రెడ్డి 2001లో ఎ.పి.లో మొట్ట మొదటగా ఏర్పడిన ఎస్.ఎం.సి.కి. తొలి ఇన్‌ఛార్జ్‌గా బాధ్యతలు చేపట్టి 2003 మార్చి వరకు నిర్వహించాడు. 2000 డిసెంబర్‌లో పి.ఎల్.జి.ఎ. ఆవిర్భావంతో దానికి అనుగుణంగా ఎ.పి.లో మిలటరీ రంగాన్ని అభివృద్ధిచేసే ముఖ్యమైన కర్తవ్యాన్ని భుజానికెత్తుకొని తన శక్తివంచన లేకుండా అహర్నిశలూ శ్రమించాడు. అప్పటికే ఆయనకున్న అపారమైన విప్లవ జీవితానుభవం నుండి నేర్చుకున్న విషయాలకు రాజకీయ, మిలటరీ, సైద్ధాంతిక విషయాలను జోడించి ఎస్.ఎం.సి.కీ, ఎస్.సి.కి అనేక విషయాలలో తోడ్పాటును అందించాడు. ఎ.పి.ఎస్.సి. మిలటరీపరంగా సరైన నిర్ణయాలు తీసుకునేలా అనేక విషయాల్లో తన అభిప్రాయాలూ, సూచనలు దోహదపడ్డాయి. రెండు సంవత్సరాల కాలంలో కమాండ్స్, ప్లటూన్స్, దళాల ఫంక్షనింగ్ సమస్యలను పరిష్కరించడానికీ, ఇంటలిజెన్స్, కమ్యూనికేషన్స్ విషయాలలో గైడ్ లైన్స్ ఇవ్వడానికీ, మిలటరీ చర్యల్లో జరుగుతున్న లోటుపాట్లు, శత్రువుకు సంబంధించిన సమాచార సేకరణ, యాక్షన్ టీములు ఇలా అనేక ఇతర విషయాలపై ఉద్యమ అవసరాలకు అనుగుణంగానూ, పి.ఎల్.జి.ఎ. మిలటరీపరంగా ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించడానికి గైడ్ లైన్స్‌ను అందించడం కోసం పదికి పైగా సర్క్యులర్స్, లేఖలు రూపొందించి విడుదల చేయడంలో కా. సుధాకర్ పాత్ర ప్రధానమైనది. ఇవి పి.ఎల్.జి.ఎ.లో మెరుగైన పని పద్ధతులనూ, మిలటరీ క్రమశిక్షణనూ, అవగాహనను పెంచడానికి ఉపయోగపడ్డాయి. అవసరమైన మిలటరీ సాహిత్యాన్ని సేకరించి అన్ని కమిటీలకూ, మిలటరీ నిర్మాణాలకు అందించాడు. మిలటరీ సిద్ధాంత అధ్యయన ప్రాధాన్యతను గుర్తించిన కా. సుధాకర్ రెడ్డి గెరిల్లా ఎయిర్ డిఫెన్స్ వంటి సాహిత్యాన్ని అనువదింపజేసి క్యాడర్‌కు అందించాడు.

అమరుడు కామ్రేడ్ సత్యం (రామ్మోహన్)తో కలిసి కా. సుధాకర్ రెడ్డి నిర్వహించిన మిలటరీ క్యాంపులు ప్లటూన్ల, పి.ఎల్.జి.ఎ. బలగాల మిలటరీ నైపుణ్యాన్ని పెంచాయి. 2002లో అమరులు కామ్రేడ్స్ సత్యం, రమణారెడ్డిలతో కలిసి నిర్వహించిన అర్బన్ గెరిల్లా మిలటరీ క్యాంపు ఒక ప్రత్యేకత కలిగినది. అటవీ, గ్రామీణ ప్రాంతాల్లోనే కాకుండా పట్టణాల్లో శత్రువుపై యుద్ధాన్ని చేయడానికి 'పట్టణ గెరిల్లా యుద్ధతంత్రం'పై శిక్షణను ఇవ్వాల్సిన అవసరాన్ని గుర్తించి దానికి క్యాడర్‌ను సంసిద్ధం చేయడానికి ఉద్దేశించిన ఈ క్యాంపులో కా. సుధాకర్ రెడ్డి పాత్ర ప్రముఖమైనది. విద్యార్థుల్లో ఉత్సాహాన్ని కలిగించేలా సృజనాత్మకతతో నిర్వహించడం కా. సుధాకర్ ప్రత్యేకత. ఈ మిలటరీ క్యాంపుల ద్వారా అన్ని జిల్లాల్లో యాక్షన్ టీములను నిర్మించి శత్రువుపై గెరిల్లా చర్యలను నిరంతరం కొనసాగించాలనే డైరెక్షన్ అందించాడు.

ఆనాటికి దక్షిణ తెలంగాణ, నల్లమల, గుంటూరు, రాయలసీమల్లో తరతమ తేడాలతో పోరాటాలు జరుగుతున్నాయి. శత్రు బలగాల దాడులూ, మన గెరిల్లా చర్యలూ, ప్రజా పోరాటాలు పెరుగుతున్నాయి. గ్రేహౌండ్స్ తదితర ప్రత్యేక బలగాల నాయకత్వంలో జరిగిన దాడుల్లో ఉద్యమానికి అనేక నష్టాలు జరిగాయి. గెరిల్లా బలగాలు శత్రువుతో వీరోచితంగా పోరాడినప్పటికి వాటికి చాలా ప్రాథమిక మిలటరీ జ్ఞానమే వుండింది. దానిని పెంచి, అభివృద్ధి చేయడానికి ఆయన నిరంతరం శ్రమించాడు.

నల్లమల భౌగోళిక ప్రాంతాన్నీ, కృష్ణా నది పరీవాహక ప్రాంతాన్ని ఉపయోగించుకుని శత్రు బలగాలతో గెరిల్లా యుద్ధం ఎలా చేయాలో అక్కడి ప్రత్యేక పరిస్థితుల్ని దృష్టిలో పెట్టుకొని అనేక ఎత్తుగడలను సూచించాడు.

రాష్ట్ర ఆయుధ తయారీ విభాగపు బాధ్యతలు నిర్వహించి, మనం తయారుచేసే ఆయుధాల్లోని లోపాలను సరిదిద్ది అభివృద్ధి

చేయడంలోనూ, కొత్తవాటిని తయారు చేయడానికి కృషి చేయడంలోను ఆయన పాత్ర మరువలేనిది. ఎ.పి.లో మైదాన ప్రాంతాల్లో జరిగిన నష్టాలను దృష్టిలో వుంచుకొని పాత పద్ధతులను వదిలి కొత్త పద్ధతుల్లో ప్రజల్ని ఆర్గనైజ్ చెయ్యాలనీ, అందుకు తగిన ప్రత్యేక ఎత్తుగడలను రూపొందించాలని ప్రతిపాదించి 'మైదాన ప్రాంతాల్లో పని' సర్క్యులర్‌ను రూపొందించడంలో ముఖ్యమైన పాత్ర పోషించాడు.

రాష్ట్రంలో ఇంటలిజెన్స్ నిర్మాణాలను ఏర్పర్చాలనీ, అందుకు గైడ్‌లైన్స్‌ను రూపొందించి దాని అమలుకు తీవ్రమైన కృషి చేశాడు. చాలా ప్రాథమిక స్థాయిలో అయినా దాన్ని ప్రారంభించడానికి కా. సుధాకర్ రెడ్డి తోడ్పాటూ, కృషి, ప్రేరణ ముఖ్యమైనవి. తను గైడ్ చేసిన రెయిడ్‌లలో యాదగిరి గుట్ట, శ్రీశైలం, సున్నిపెంట దాడులు ముఖ్యమైనవి. ఈ దాడులు పి.ఎల్.జి.ఎ. బలగాల్లో ఆనాడు ఎంతో ఆత్మవిశ్వాసాన్ని నింపాయి.

ఎస్.ఎం.సి. ఇన్‌ఛార్జ్‌గా తాను బాధ్యతలు నిర్వహించిన అతి కొద్ది కాలంలోనే అనేక రాజకీయ, మిలటరీ విషయాలపై ఒక స్పష్టమైన అవగాహనను పార్టీ కమిటీలకూ, పి.ఎల్.జి.ఎ. బలగాలకు అందించడంలో విశేషమైన కృషి చేశాడు. మిలటరీ సిద్ధాంత అధ్యయనం, గెరిల్లా ఎత్తుగడలను దృఢంగా అమలు చేయడం, బలమైన శత్రువును చిన్న గెరిల్లా బలగాలు ఎదుర్కోగలవనే ఆత్మవిశ్వాసాన్ని పార్టీ శ్రేణులకు ఇవ్వడం, తప్పుడు ధోరణులకు వ్యతిరేకంగా చురుగ్గా పోరాడటంలోనూ, అపజయాలూ, ఒడిదుడుకులు కఠిన సమయాల్లోను దృఢంగా, అచెంచల విశ్వాసంతో వుండే కా. సుధాకర్ రెడ్డి సహజమైన లక్షణాల నుండి అందరమూ నేర్చుకోవాల్సిందే. శత్రువు పెట్టిన చిత్రహింసల వల్ల తీవ్రమైన కాళ్ల నొప్పులతోపాటూ కదలికలు ఇబ్బందిగా వుండేవి. ఈ స్థితిలో కూడా రాష్ట్ర మిలటరీ కమీషన్ ఇన్‌ఛార్జీగా బాధ్యతలు చేపట్టి రాజకీయంగా నేతృత్వం వహించడం అత్యంత స్ఫూర్తిదాయకం.

## కీలక యాక్షన్స్ చేసిన యాక్షన్ టీంకు గైడ్

మన ఉద్యమ చరిత్రలో క్రూరులైన రాజకీయ నాయకులనూ, పోలీసు అధికారులను శిక్షించేందుకు యాక్షన్ టీంలను నిర్మించి వాటిని మెరుగ్గా పని చేయించి ఫలితాలు సాధించడంలో కామ్రేడ్ సుధాకర్ కృషి, అందించిన అనుభవం పార్టీకి ఎంతో ముఖ్యమైనది. 1998లో ఏర్పడిన యాక్షన్ టీమును తనే రాజకీయంగా గైడ్ చేశాడు. ఆ టీమును రాజకీయపరంగా, మిలటరీపరంగా అభివృద్ధి చేసి ఆదర్శ యాక్షన్ టీముగా అందరి ముందు వుంచాడు. ఏదైనా ఒక చర్య చేయాలనుకున్నప్పుడు టార్గెట్‌ను లోతుగా అధ్యయనం చేయడం, తర్వాత ఏర్పాట్లు, తర్ఫీదు, యాక్షన్ చేయడం ఒక పథకం ప్రకారం వుండేది. ఇలాంటి మెరుగైన పథకం వల్లే క్రూరులైన ఉమేష్‌చంద్ర, మాధవరెడ్డి వంటి వాళ్లను అంతమొందించడం, అత్యంత సెక్యూరిటీని కూడా ఛేదించి నరహంతక చంద్రబాబుపై దాడికి పాల్పడడం విజయవంతంగా జరిగాయి. ఈ చర్యలు ఆనాటి స్థితిలో రాజకీయంగా ఎంతో ప్రభావాన్ని వేసి మిలటరీపరంగా ప్రజలకూ, క్యాడర్‌కు ఎంతో నమ్మకాన్ని కలిగించాయి. ఏర్పడ్డ యాక్షన్ టీములో కొందరు కామ్రేడ్స్ అమరులైనా వారిని ఎంతో ఉత్తేజంగా, ఆదర్శంగా తీసుకుని దోపిడీ వర్గాలను అంతమొందించడానికి యాక్షన్ టీములో చేరడానికి ఎంతో మంది సిద్ధపడే విధంగా కామ్రేడ్ సుధాకర్ రెడ్డి ప్రభావాన్ని వేశాడు.

## విప్లవోద్యమ ఇంటలిజెన్స్ నిర్మాత

విప్లవోద్యమం అభివృద్ధి చెందుతున్న క్రమంలో శత్రువు ఎత్తుగడలను అధ్యయనం చేసి వాటిని చిత్తుచేసే ఎత్తుగడలను వుద్యమం రూపొందించుకోవాలంటే ఇంటలిజెన్స్ విభాగం ఏర్పాటు చేయాల్సిన అవసరం ముందుకు వచ్చింది. అందువల్ల భారత విప్లవోద్యమ చరిత్రలో మొట్ట మొదటిసారిగా ఇంటలిజెన్స్ విభాగాన్ని ఏర్పాటు చేయాలని పార్టీ నిర్ణయించింది. ఈ రంగంలో కృషి చేసి దానికి ఒక నిర్మాణ రూపం ఇవ్వగల సమర్థుడిగా భావించి కామ్రేడ్ సుధాకర్ రెడ్డికి 2003లో ఆ బాధ్యతలను పార్టీ అప్పగించింది. ఆనాటికి ఆయన ఎ.పి. ఉద్యమంలో కీలకమైన భూమికను పోషిస్తున్నాడు. తనను అక్కడి నుంచి బదిలీ చేయడం వల్ల ఆ వుద్యమంపై తీవ్ర ప్రభావం పడుతుందని సీసీ భావించినప్పటికీ ఇంటలిజెన్స్ విభాగానికి వున్న ప్రాధాన్యత రీత్యా ఆయనను బదిలీచేయక తప్పలేదు.

లోతైన రాజకీయ, మిలటరీ, సిద్ధాంత అధ్యయనం చేసే కామ్రేడ్ సుధాకర్ ఇంటలిజెన్స్ విభాగపు సన్నాహక బాధ్యతలను సంతోషంగా స్వీకరించాడు. అందుకు అవసరమైన సాహిత్యాన్నీ, సమాచారాన్ని సేకరించాడు. అందుబాటులోకి వచ్చిన అన్ని దేశాల ఇంటలిజెన్స్

**పత్రికపై మీ విమర్శలూ, అభిప్రాయాలూ, సలహాలూ, సూచనలను ఎప్పటికప్పుడు తెలియజేయండి. అది పత్రిక అభివృద్ధికి దోహదపడుతుందని గుర్తించండి!**

ఏజెన్సీల గురించి అధ్యయనం చేశాడు. దీనికి సంబంధించిన ఇతర సాహిత్యాన్నీ అధ్యయనం చేశాడు. ప్రత్యేకించి భారత ఇంటలిజెన్సీ వ్యవస్థ గురించి పరిశీలించాడు. వివిధ దేశాల ఇంటలిజెన్స్ వ్యవస్థల గురించి అందరూ అర్థం చేసుకునేందుకు వీలుగా, అత్యంత సరళంగా 'ఆరోప్రాణం' తయారు చేశాడు. పర్స్పెక్టివ్ పేపర్‌ను రూపొందించి పార్టీ ముందు వుంచాడు. ఏమీలేని స్థితి నుండి ఏ ఇంటలిజెన్సీ వ్యవస్థల నుండి, దేశాల నుండి సహకారం లేకున్నా సీసీ గైడ్ లైన్స్‌ను దృష్టిలో వుంచుకుని, పార్టీ సుదీర్ఘ అనుభవాలనుంచి లభించిన అంశాల నుండి, మన దేశ ప్రత్యేక పరిస్థితులు మన పార్టీ యుద్ధ స్థితిని అవసరాలకు అనుగుణంగా ఆ పర్స్పెక్టివ్‌ను రూపొందించాడు. ఈ విభాగాన్ని ఏర్పాటు చేయడానికి ఆయన చేసిన కృషి చాలా గొప్పది. ఆ సమయంలో ఎన్నో ఇబ్బందులూ, అననుకూల పరిస్థితులూ, తీవ్రమైన అనారోగ్యం, ఎ.పి.ఎస్.ఐ.బి. పోలీసుల తీవ్ర వేట నడుమనే పార్టీ ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేయడంలో సఫలం అయ్యాడు.

ఇంటలిజెన్స్‌కు సంబంధించిన సాహిత్య భాండాగారాన్ని సేకరించి భద్రపర్చాడు. పార్టీకి అధ్యయనం కోసం ఆయా కమిటీల అవసరాలకు అనుగుణంగా సాహిత్యాన్ని అందించాడు. అలాగే ఇంటలిజెన్స్ గురించి అనేకమంది కామ్రేడ్స్‌కు క్లాసులు నిర్వహించి అవగాహనను అందించాడు. వర్తమాన రాజకీయ పరిస్థితిపై, ఇతర అంశాలపై ఆయన పార్టీకి అందించిన రిపోర్టులు ఎంతో ఉపయోగకరమైనవి.

మిలటరీ ఇంటలిజెన్స్ కోసం ఆయన అందించిన గైడ్ లైన్స్, సాహిత్యమూ, అవగాహన, చెప్పిన క్లాసులు ఎంతో అమూల్యమైనవి. ఇలా ఆరు సంవత్సరాలపాటు ఈ రంగంలో అవిశ్రాంత కృషి చేసి విలువైన అనుభవాలను అందించాడు.

## ఆదర్శ నమూనా, అద్భుత ప్రేరణ

నిజాయితీకీ, అంకిత భావానికీ, పీడిత ప్రజల ప్రయోజనాలపట్ల లోతైన నిబద్ధత కలిగి వుండడానికీ, సృజనాత్మకతకూ తనకు అందించిన ఏ కర్తవ్యాన్నయినా నెరవేర్చే దృఢనిశ్చయానికీ, మిలిటెంట్ పోరాటతత్వానికి ఆయన పెట్టింది పేరు. ఎంతటి తీవ్రమైన కష్టాల మధ్యనయినా ఆయన ఎన్నడూ ఎటువంటి ఊగిసలాటనుగానీ, టెన్షన్‌నుగానీ ప్రదర్శించి ఎరుగడు. ఇది తన చుట్టూ వున్న కార్యకర్తల్లో బ్రహ్మాండమైన విశ్వాసాన్ని కలిగించేది. ఉదాహరణకు 2003 మొదట్లో నల్లమల అటవీ ప్రాంతంలో తను పని చేస్తున్నప్పుడు జరిగిన ఒక సంఘటనలో శత్రువు హఠాత్తుగా క్యాంపు దగ్గరకు వచ్చేశాడు. క్యాంపులోని కామ్రేడ్స్ అందరిలో టెన్షన్ వాతావరణం నెలకొంది. కానీ ప్రశాంతంగా కూర్చోని వున్న కా. సుధాకర్‌రెడ్డిని చూడగానే అందరూ సంయమనాన్ని పొంది తర్వాత చర్య కోసం ఎదురుచూశారు. ఆయన వెంటనే డిఫెన్స్ టీమ్ సభ్యులకు సూచనలు పంపాడు. శత్రువు దాడిచేస్తే గట్టిగా ప్రతిఘటించమనీ, అందరూ సురక్షితంగా రిట్రీట్ అయ్యేవరకు కాల్పులు జరుపుతూ వుండమని చెప్పాడు. అందులో అతను ప్రత్యక్షంగా ఉనికిలో వుండడం అనేదే అందరిలో గొప్ప విశ్వాసాన్ని కలిగించింది.

జిల్లా కమిటీ సమావేశాల నుండి ఎ.పి. రాష్ట్ర కమిటీ సమావేశాలదాకా, కేంద్ర కమిటీ సమావేశాల్లోనూ కామ్రేడ్ సుధాకర్ రెడ్డి పాత్ర ఒక కీలకమైనదేగాక చాలాసార్లు నిర్ణయాత్మకంగా వుండింది. ఎందుకంటే ఆయనకు పరిస్థితి మీద స్పష్టమైన పట్టు వుండేది. సమావేశాలకు వచ్చే ముందు సమగ్రంగా హోంవర్క్ చేసుకొని వచ్చేవాడు. పిడివాద ధోరణి వుండేదికాదు. దాంతో పార్టీ, వుద్యమం ఎదుర్కొనే సమస్యలకు ఆయన సృజనాత్మకమైన ఆచరణయోగ్యమైన పరిష్కారాలను కనుగొనేవాడు. కమిటీ సమావేశాల్లో ఆయన వుండడమనేది అనేక క్లిష్ట సమస్యలను పరిష్కరించడంలో బ్రహ్మాండంగా ఉపయోగపడేది. కా. సుధాకర్ రెడ్డి నుంచి మనం ఆదర్శంగా ఆచరించాల్సిన విప్లవకర లక్షణాలు ఎన్నో వున్నాయి. ఆయన హాస్యప్రియత్వం, పార్టీ పంథాలోనీ, విధానాల్లోని తప్పులను విమర్శించడంలోనూ, తనలోనూ ఇతర కామ్రేడ్స్‌లోను వుండే తప్పుల్ని, బలహీనతల్ని విమర్శించడంలోను సూటిదనం, చొరవ, సృజనాత్మకత, ఇతర కమిటీల ఉద్యమాల అనుభవాలనూ, సంఘటనలను అధ్యయనం చేయడంలో శ్రద్ధ, సంభవిస్తున్న పరిణామాలలో వెనుకబడిపోకుండా వుండడంకోసం శత్రు క్యాంపులోనూ, దేశ, అంతర్జాతీయ రంగస్థలంలోనూ జరుగుతున్న మార్పులపట్ల అప్రమత్తత, తాను చేపట్టిన లేదా పార్టీ అప్పగించిన ప్రతి ఒక్క కర్తవ్యాన్ని అమలుచేయడంలో గంభీర దృష్టి ఈ చివరి లక్షణాన్ని 27 సంవత్సరాల క్రితం పార్టీలో చేరిన క్షణం నుండి ఆయన ప్రదర్శిస్తూ వచ్చాడు. అందుకే పై కమిటీ ఎప్పుడూ నిశ్చింతగా ఆయనపై విశ్వాసం వుంచేది.

2001లో జరిగిన మునుపటి పీపుల్స్‌వార్ 9వ కాంగ్రెస్‌లో, 2007లో జరిగిన ఐక్యతా కాంగ్రెస్‌లో ప్రతినిధిగా పాల్గొని రాజకీయంగా మంచి పాత్రను పోషించాడు. 2001లో జరిగిన కాంగ్రెస్‌లో కర్నాటక పార్టీలోని తప్పుడు ధోరణులను నిశితంగా చర్చించి, కూలంకషంగా వివరించి ప్రతినిధులకు మంచి అవగాహన కల్పించాడు. 2007 ఐక్యతా కాంగ్రెస్‌లో ఇంటలిజెన్స్ గురించి అనర్గళంగా చర్చించాడు. ఆంధ్రప్రదేశ్ ఉద్యమ వెనుకంజకు ముఖ్య కారణమైన ఎల్.ఐ.సి. వ్యూహాన్ని మనం ఎదుర్కోవడంలో ఎలా విఫలమయ్యామో, ఎలా ఎదుర్కోవలసి వుండిందో ఈ కాంగ్రెస్‌లో

చాలా లోతైన విశ్లేషణ అందించాడు. ఇదే కాంగ్రెస్‌లో ఆయన కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎన్నికయి ఇంటలిజెన్స్ బాధ్యతలను తిరిగి చేపట్టాడు.

## స్పందన – ప్రతిస్పందనల రచయిత

కామ్రేడ్ సుధాకర్ రెడ్డి విప్లవ కార్యాచరణలో సిద్ధాంతాన్ని ఆచరణకు వర్తింపచేసి ప్రతి పనిలో ఫలితాలు సాధించే విధంగా కృషి వుండేది. అలాగే రాజకీయంగా, మిలటరీపరంగా, సాహిత్యపరంగా రచనలు కూడా చేశాడు. దండకారణ్యంలో వున్న ప్రారంభ రోజుల్లో 'వనవాసి' పేరుతో, ఆతర్వాత 'రవీందర్' పేరుతో, నిర్బంధ శిబిరంలో 'సముద్రం' (రాజకీయ ఖైదీల సామూహిక కలం) పేరుతో, 'కారాగారవాసి' పేరుతో మరికొన్ని ఇతర పేర్లతో కవితలూ, కథలూ, స్పందనలూ, విమర్శలు రాశాడు. ప్రతి రచన సాహిత్య స్పందన సూచిగా ఒక సందేశాత్మకంగా వుండేది. శత్రువు తలపెట్టే ప్రతీఘాతుక దాడిని అధ్యయనం చేస్తూ మిలటరీ రచనలు చేసేవాడు. మరెన్నో వ్యాసాలను అనువదించాడు. జంగ్ పత్రిక ప్రారంభం నుండి ఆ పత్రికకు క్రమం తప్పకుండా రచనలు చేసేవాడు.

## వ్యక్తిగత జీవితం

ఏటూరునాగారంలో పని చేస్తుండగానే ఆయనకు వివాహం జరిగింది. వారికి ఒక బాబు కూడా వున్నాడు. అయితే తన సహచరి రాజకీయంగా బలహీనపడి 98లో ఉద్యమం నుంచి వెళ్లిపోయి శత్రువు ముందు మోకరిల్లింది. బాధాకరమైన ఆ పరిస్థితిని కామ్రేడ్ సుధాకర్ రెడ్డి నిబ్బరంగా ఎదుర్కొన్నాడు. 2000 చివర్లో తను మరొక కామ్రేడ్‌తో జీవితాన్ని పంచుకున్నాడు. తన ప్రేమాస్పద స్వభావంతో అన్ని విధాలా సహకరిస్తూ, ప్రోత్సహిస్తూ తన పనిలో మరింత అభివృద్ధి సాధించేలా, తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేలా ఆమెకు దోహదపడి ఒక మంచి సహచరుడికి నమూనాగా నిలిచాడు.

## కన్నీటి వీడ్కోలు

తమ ప్రియతమ నాయకుడు దేశ విముక్తి కోసం అమూల్యమైన ప్రాణాలర్పించిన కామ్రేడ్ పటేల్ సుధాకర్ రెడ్డి అంతిమయాత్రలో వేలాది ప్రజలు పాల్గొన్నారు. మృతదేహాన్ని వుంచిన శకటం గద్వాల నుండి బయల్దేరి పెద్దపల్లి, అమరబాయి, మల్దకల్, శేషంపల్లి, తాటికుంట మీదుగా కుర్తిరావులచెరువు వెళ్లింది. మే 26 సాయంత్రం 4 గంటలకు అంతిమ యాత్ర మొదలై విప్లవ నినాదాలతో, కన్నీటితో గంటసేపు కొనసాగింది. గ్రామ శివారులోని వాళ్ల స్వంత భూమిలో కామ్రేడ్ పటేల్ సుధాకర్ రెడ్డి మృతదేహాన్ని ఖననం చేశారు.

దాదాపు మూడు దశాబ్దాల విప్లవ సుదీర్ఘ ప్రయాణంలో విద్యార్థి, రైతాంగ నాయకుడిగా, ఆదివాసీ ప్రజల కమాండర్‌గా, దక్షిణ తెలంగాణ రీజనల్ కమిటీ కార్యదర్శిగా, ఆంధ్రప్రదేశ్ విప్లవోద్యమ నాయకుడిగా, కేంద్ర కమిటీ సభ్యుడిగా, నిఘా విభాగపు డైరెక్టరుగా తను నడిచినమేర పీడిత ప్రజల విముక్తికై ఎర్రటి రహదారులు వేశాడు. ఏ రంగాన్ని చేపట్టినా ఆ రంగాన్ని లోతుగా అధ్యయనం చేసి సమర్థవంతంగా నిర్వహించి పార్టీకి అనుభవాల గనిని అందించిన కా. సుధాకర్ ఒక వ్యక్తిగా గాక శక్తిగా ఎదిగాడు.

కామ్రేడ్ సుధాకర్ రెడ్డి అమరత్వం నేటి క్లిష్ట పరిస్థితుల్లో మరింత తీవ్రమైన నష్టం. ఇప్పట్లో పూడ్చుకోలేని లోటు. అయితే సుదీర్ఘ విప్లవ జీవితం ద్వారా తను ఉద్యమానికి అందించిన ఎన్నో విలువైన అనుభవాలు ముఖ్యంగా గత ఆరు సంవత్సరాలుగా ఇంటలిజెన్స్ రంగంలో చేసిన అవిశ్రాంత కృషి, అందించిన అనుభవాలు, గైడ్‌లైన్స్, రహస్య పని పద్ధతులు ఎంతో అమూల్యమైనవి, అచరణయుతమైనవి. అవన్నీ మనముందున్నాయి. వాటిని మరింత దృఢంగా, మరింత శక్తివంతంగా ఆచరిస్తూ, అమలుచేస్తూ బలమైన ఇంటలిజెన్స్‌ను నిర్మించి యుద్ధాన్ని మరింతగా పురోగమింపచేద్దాం. అదే కామ్రేడ్ పటేల్ సుధాకర్‌కు మనమిచ్చే నివాళి. ★

---

***(34వ పేజీ తరువాయి...)***

అనే భేదం లేకుండా అందరితోనూ కలివిడిగా, ఆత్మీయంగా, ప్రేమగా వుండేవాడు. తోటి కామ్రేడ్స్ బాధలను పట్టించుకుని ఓదార్చేవాడు.

ఇలా పలు రంగాల్లో విశేషమైన ప్రతిభను కనబర్చి, ఆ రంగాలకు నాయకత్వం వహించి, ఎన్నో విషయాల్లో ఆధారపడదగిన కామ్రేడ్‌గా పార్టీ విశ్వాసాన్ని చూరగొన్న కామ్రేడ్ ప్రసన్నను కోల్పోవడం ద్వారా పార్టీ మంచి భవిష్యత్ వున్న, అనేక రంగాలను నిర్వహించే సామర్థ్యం కల్గిన యువనేతను కోల్పోయింది.

కామ్రేడ్ ప్రసన్నను కోల్పోవడం పార్టీకి తీవ్రమైన నష్టమే అయినప్పటికీ పలు రంగాల్లో తను అందించిన అనుభవాలు పార్టీ అమ్ములపొదిలో పదిలంగా నిక్షిప్తమయ్యే వున్నాయి.

ఆ అనుభవాలను అధ్యయనం చేద్దాం, ఆచరిద్దాం. కామ్రేడ్ ప్రసన్న లేని లోటును తీర్చడానికి పునరంకితమవుదాం. అదే మనం కామ్రేడ్ ప్రసన్నకు అందించే హృదయపూర్వక నివాళి. ★

సి.పి.ఐ. (మావోయిస్టు) 5వ వార్షికోత్సవం సందర్భంగా...

# నక్సల్బరీ నుండి లాల్‌గఢ్ దాకా చారిత్రక ప్రస్థానం

2009 సెప్టెంబర్ 21కి భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)కు అయిదేళ్లు నిండాయి. బలమైన విప్లవ పార్టీ నాయకత్వం లేకుండా విప్లవ విజయం అసాధ్యం. కనుక, దేశంలో అప్పటిదాకా రెండు స్రవంతులుగా సాగుతున్న సి.పి.ఐ.(ఎం-ఎల్.)(పీపుల్స్‌వార్), ఎం.సి.సి.ఐ.లు విలీనమై మావోయిస్టు పార్టీగా ఆవిర్భవించడం అనేది భారత విప్లవోద్యమ చరిత్రలో అత్యంత ప్రాధాన్యత గల పరిణామం. ఈ ప్రాధాన్యతను గుర్తించిన విప్లవ ప్రజానీకం నూతనోత్తేజంతో జేజేలు పలుకుతూ మావోయిస్టు పార్టీని స్వాగతించారు. అదే సమయంలో దోపిడీ పాలకవర్గాలు ఈ పరిణామాన్ని తమ ఉనికికి మరింత ముప్పుగా సరిగ్గానే గుర్తించాయి. అందుకే అవి తమకు ముప్పుగా వున్న అంశాన్ని దేశ భద్రతకు ముప్పుగా వక్రీకరిస్తున్నాయి.



కామ్రేడ్ చారుమజుందార్ కామ్రేడ్ కన్హయ్ ఛటర్జీ

సి.పి.ఐ. (మావోయిస్టు) వ్యవస్థాపకులు

ఈ అయిదేళ్ల వార్షికోత్సవం సందర్భంగా భారత విప్లవోద్యమ చరిత్రలోని కీలక మలుపులను తడుముతూ, ఆంధ్రప్రదేశ్ విప్లవోద్యమ చరిత్రను చెప్పుకుందాం.

## నక్సల్బరీ- భారత దేశ విప్లవోద్యమ చుక్కాని

బ్రిటీష్ సామ్రాజ్యవాదులు దేశం విడిచి వెళ్లిన కొద్ది కాలానికే స్వాతంత్ర్య భ్రమలు తొలగిపోయి అధికారంలో వున్న పాలకవర్గాల దళారీ స్వభావం ప్రజలకు స్పష్టంగా అర్థమయింది. బ్రిటీష్ సామ్రాజ్యవాదం ప్రత్యక్ష అధికారం నుండి వైదొలగగానే అమెరికా తదితర సామ్రాజ్యవాద దేశాల జోక్యం మొదలైంది. వాటి కనుసన్నల్లో దళారీ పెట్టుబడిదారీ వర్గానికి ప్రయోజనాలు చేకూర్చే పలు భారీ పరిశ్రమల, ప్రాజెక్టుల నిర్మాణం ప్రజల సొమ్ముతో ప్రారంభమైంది. సోవియట్ రష్యా కూడా సోషలిజం ముసుగును చించుకుని ప్రపంచ ఆధిపత్యం కోసం పోటీకి దిగింది. అందులో భాగంగా భారత్‌ను తనకు అనుకూలంగా మార్చుకోవడం కోసం 1964లో ఆరు వందల కోట్ల రూపాయల సహాయాన్ని ప్రకటించి ప్రభుత్వ విధానాల్లో జోక్యం చేసుకోవడం ప్రారంభించింది. రష్యా 'సహాయాన్ని' ఆసరాగా చేసుకొని నెహ్రూ సోషలిజం కబుర్లు చెబుతూ ప్రజలను మాయ చేయాలని చూశాడు. ఇలా ఒకవైపు సామ్రాజ్యవాదులా, దళారీ నిరంకుశ పెట్టుబడిదారుల దోపిడీ అధికం కాసాగింది. మరోవైపు దేశంలో అప్పటికే కరడుగట్టి వున్న భూస్వామ్య వ్యవస్థ చెక్కు చెదరకుండా తన దోపిడీని యధేచ్ఛగా కొనసాగింది. ఈ మూడు దోపిడీ వర్గాల పీడనలో ఉక్కిరి బిక్కిరయిన ప్రజలకు స్వాతంత్ర్యపు మేడిపండు స్వభావం స్పష్టంగా అర్థమయింది. వాళ్లలో నిజమైన స్వాతంత్ర్యాన్ని సాధించాలనే ఆశయం రగిలింది. అయితే ఆ స్వాతంత్ర్యేచ్ఛను సరైన మార్గంలో మళ్లించగలిగిన కార్మికవర్గ పార్టీ లేని పరిస్థితి.

కార్మికవర్గ పార్టీగా వుండవలసిన సి.పి.ఐ. 1952 నాటికే తెలంగాణ సాయుధ పోరాటాన్ని విరమించి, భారత విప్లవోద్యమ చరిత్రకు తీరని ద్రోహం చేసి, రివిజనిస్టుగా మారిపోయింది. సి.పి.ఐ. రివిజనిజాన్ని వ్యతిరేకించే శక్తులతో 1964లో ఏర్పడిన సి.పి.ఐ.(ఎం.) కూడా సి.పి.ఐ. దారిలోనే నడిచింది. అయితే విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని కొందరు కామ్రేడ్స్ ఈ పార్టీలో తీవ్రమైన అంతర్గత పోరాటం చేశారు. ఆనాడు మావో నాయకత్వంలో సోవియట్ రివిజనిజానికి వ్యతిరేకంగా జరిగిన గ్రేట్ డిబేట్, చైనాలో జరిగిన సాంస్కృతిక విప్లవం ఈ కామ్రేడ్స్‌కు రివిజనిజంపై పోరాడడానికీ, విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకెళ్లడానికి కావాల్సిన సైద్ధాంతిక ప్రాతిపదికనూ, స్పష్టతను సమకూర్చాయి.

ఈ పరిణామాలన్నింటి నేపథ్యంలో, పశ్చిమ బెంగాల్‌లోని సి.పి.ఐ.(ఎం.) సిలిగురి జిల్లా కమిటీ కార్యదర్శిగా వున్న కామ్రేడ్ చారుమజుందార్ రివిజనిజంపై రాజీలేని సైద్ధాంతిక పోరాటం చేస్తూనే, మరోవైపు అక్కడి రైతాంగంలో బలమైన విప్లవోద్యమాన్ని నిర్మించాడు. 1965-67లలో ఆయన రివిజనిజాన్ని చావుదెబ్బ తీస్తూ, రహస్య పార్టీ నిర్మాణాన్నీ, సాయుధ పోరాట ఆవశ్యకతను నొక్కి చెపుతూ, జాతుల పోరాటాల ప్రాధాన్యతను వివరిస్తూ రాసిన ఎనిమిది డాక్యుమెంట్లు ప్రజల్లో విప్లవోద్యమం పట్ల స్పష్టతను కలిగించాయి.

ఇలా ఒక స్పష్టమైన సైద్ధాంతిక వెలుగులో భారత విప్లవానికి అవసరమైన సరైన వ్యూహాన్నీ, పంథాను నిర్దేశించుకొని 1967 మార్చిలో నక్సల్బరీ ప్రాంతంలో సాయుధ రైతాంగ విప్లవం ప్రారంభమైంది. భారతదేశంలో దీర్ఘకాలిక పంథాలో ఉద్యమం ప్రారంభమైందని చైనా కమ్యూనిస్టు పార్టీ గుర్తించి భారతదేశంపై 'వసంతకాల మేఘ గర్జన'గా దీనిని అభివర్ణించింది. దోపిడీ వర్గాలు తమ పునాదులు కదులుతున్నాయని గుర్తించి వణికిపోయాయి. ఆనాడు రాష్ట్రంలో అధికారంలో వున్న వామపక్షాల ఫ్రంట్ సర్కారూ, కేంద్రంలో వున్న ఇందిరా గాంధీ సర్కారు కలిసి కట్టుగా తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించాయి. మే 23న ప్రసాద్ జోతే గ్రామంలో పోలీసులు పాశవికంగా జరిపిన కాల్పుల్లో తొమ్మిది మంది అమరులయ్యారు. వీరిలో ఏడుగురు మహిళలు, ఇద్దరు పిల్లలు. ఇలా క్రూర దమనకాండను ప్రయోగించి నక్సల్బరీ పోరును అణచివేశాయి. అయితే నక్సల్బరీ మార్గాన్ని మాత్రం అడ్డుకోలేకపోయాయి.

దేశ విముక్తికి నక్సల్బరీ పంథాయే ఏకైక మార్గం అని దృఢంగా నొక్కి చెప్తూ బీహార్‌లోని ముషాహరి; ఉత్తరప్రదేశ్‌లోని లఖింపూర్ ఖేరీ; పశ్చిమ బెంగాల్‌లోని దేబ్రా, గోపీ వల్లభ్‌పూర్, బీర్‌భూమ్; పంజాబ్‌లోని భటింధా; ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళంలలో రైతాంగ పోరాటాలు ఉధృతంగా జరిగాయి. కలకత్తా నగరంలో కార్మికులూ, విద్యార్థులూ, యువజనులూ, మేధావులూ పోరుబాటలో కదం తొక్కారు.

## నక్సల్బరీ బాటలో నడిచిన సిక్కోలు

1960ల తొలినాళ్ల నుండి శ్రీకాకుళం జిల్లాలో కామ్రేడ్స్ సత్యం, కైలాసం, కృష్ణమూర్తిల నాయకత్వంలో పోరాటం మొదలైంది. ఆదివాసీ ప్రజానీకాన్నీ, పేద రైతాంగాన్ని దారుణమైన అణచివేతకు గురిచేస్తున్న భూస్వాములూ, షావుకార్లూ, ఫారెస్టు అధికారుల దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతం చేసి, సంఘటితం చేయడంలో ఈ కామ్రేడ్స్ విశేషమైన కృషి చేశారు. నక్సల్బరీ బద్దలవడంతో శ్రీకాకుళ పోరుకు సరైన మార్గం లభించింది. ఆ మార్గంలో ప్రయాణించి మూడేళ్లు వీరోచితంగా అనన్య త్యాగాలతో సాగిన ఈ పోరాటం సైతం పాలకవర్గాల పాశవిక అణచివేతకు గురైంది.

## సి.పి.ఐ.(ఎం-ఎల్) ఏర్పాటు–దేశంలో తొలి విప్లవ పార్టీ ఆవిర్భావం

నక్సల్బరీ పోరాటం తర్వాత దేశంలో కార్మికవర్గ విప్లవ పార్టీని ఏర్పాటు చేయడానికి చారుమజుందార్ తదితర కామ్రేడ్స్ ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ ప్రయత్నంలో భాగంగా 1967 నవంబర్‌లో సి.పి.ఐ.(ఎం.)లోనే అఖిల భారత విప్లవకారుల సమన్వయ కమిటీ (ఎ.ఐ.సి.సి.ఆర్.) ఏర్పడింది. 1968 మేలో దీని పేరును అఖిల భారత కమ్యూనిస్టు విప్లవకారుల సమన్వయ కమిటీ (ఎ.ఐ.సి.సి.సి.ఆర్.)గా మార్చారు. సి.పి.ఐ.(ఎం.) నుండి బయటికి వచ్చి విడి విడి బృందాలుగా పని చేస్తున్న విప్లవకారులను ఎ.ఐ.సి.సి.సి.ఆర్.లో చేరమనీ, తమ గ్రూపులను రద్దు చేసుకోమని పిలుపునిచ్చారు. ఈ పిలుపు మేరకు పలువురు విప్లవకారులు ఎ.ఐ.సి.సి.సి.ఆర్.లో భాగమయ్యారు. బెంగాల్‌లో పని చేస్తుండిన చింతా గ్రూప్ (తర్వాత ఇదే ఎం.సి.సి.ఐ.గా ఏర్పడింది) మాత్రం ఎ.ఐ.సి.సి.సి.ఆర్.కు బయటే తన విప్లవాచరణను కొనసాగించింది.

అప్పటికి తరిమెల నాగిరెడ్డి నాయకత్వంలో వున్న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కమిటీ కూడా ఎ.ఐ.సి.సి.సి.ఆర్.లో చేరింది. కానీ అది అవలంభించిన మితవాద, అవకాశవాదం కారణంగా 1969 ఫిబ్రవరిలో రాష్ట్ర కమిటీతో ఎ.ఐ.సి.సి.సి.ఆర్. తన సంబంధాలను తెంచుకుంది. అదే సమయంలో శ్రీకాకుళం జిల్లా నాయకులతో తన సంబంధాలను కొనసాగించింది. 1969 ఏప్రిల్ 22న భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు–లెనినిస్టు) ఏర్పడింది. ఈ ఆవిర్భావాన్ని వ్యూహాత్మక ప్రాధాన్యత కలిగిన చారిత్రక మలుపుగా, దేశ భవిష్యత్‌కు ఒక గొప్ప ప్రారంభంగా చెప్పుకోవాలి. నూతన పార్టీ దోపిడీ వర్గాలకూ, పీడిత వర్గాలకూ నడుమ స్పష్టమైన విభజన రేఖ గీసింది. రివిజనిజాన్ని నగ్నంగా బయట పెట్టి, దాన్ని ప్రజా శత్రువుగా నిలబెట్టింది. భూమి సమస్యను ప్రధాన సమస్యగా అన్ని సెక్షన్లు గుర్తించేంతగా ముందుకు తెచ్చింది. పార్లమెంటరీ బూటకత్వాన్ని బహిర్గతం చేస్తూ ఎన్నికల బహిష్కరణను పోరాట రూపంగా ముందుకు తెచ్చింది. వ్యూహాత్మకంగా భౌగోళిక అనుకూలత, కీలక ప్రాంతాలు కల్గిన భారత దేశంలో విప్లవ పార్టీ ఆవిర్భావం దోపిడీ పాలక వర్గాలను వణికిస్తే, దేశ విప్లవ ప్రజానీకానికే గాక చైనా తదితర ప్రపంచ దేశాల్లో విప్లవ పార్టీలనూ, విప్లవ ప్రజానీకాన్ని ఉత్సాహపర్చింది. నేపాల్ వంటి దక్షిణాసియా దేశాలకు మార్గదర్శకం అయింది. తీవ్ర నిర్బంధం నడుమనే 1970 మే 15న ఎనిమిదవ కాంగ్రెస్ జరిగి కామ్రేడ్ చారుమజుందార్ నాయకత్వంలో 21 మందితో కేంద్ర కమిటీ ఏర్పడింది. శ్రీకాకుళ ఉద్యమ నాయకులు కామ్రేడ్స్ సత్యం, కైలాసంలు కేంద్ర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

## ఎత్తుగడల లోపం – ఉద్యమం వెనుకడుగు

నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాటాల్లో రూపొందించుకున్న వ్యూహం సరైనదే అయినప్పటికీ ఎత్తుగడలు రూపొందించుకోవడంలో స్వీయాత్మకత పని చేసింది. తెలంగాణ పోరాట సమయంలో కింది

శ్రేణి నాయకులూ, కార్యకర్తలూ, ప్రజలూ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లదల్చారు. కానీ పోరాట సామర్థ్యాన్నీ, త్యాగనిరతినీ కోల్పోయిన నాయకత్వం పోరాటాన్ని విరమించాలనే నిర్ణయం తీసుకొని ప్రజలకు వెన్నుపోటు పొడిచింది. కానీ నక్సల్బరీ, శ్రీకాకుళ నాయకత్వంలో పోరాట సామర్థ్యం, త్యాగనిరతి మెండుగా వున్నప్పటికీ సరైన ఎత్తుగడలు తీసుకోవడంలో విఫలం చెందారు. గెరిల్లా బలగాలను తర్ఫీదు చేసి, మిలటరీ అవగాహన పెంపొందించడానికి కేంద్రీకరించే సమయం లేకుండానే శత్రు దాడి పెద్ద ఎత్తున విరుచుకుపడింది. 1970లో జరిగిన కాంగ్రెస్ తర్వాత శత్రు దాడి మరింత ఉధృతమైంది. తీవ్రమైన నష్టాలు జరిగాయి. దూరదృష్టితో కాంగ్రెస్ ఎత్తుగడలు రూపొందించివుంటే పోరాట, నిర్మాణ రూపాలు అభివృద్ధి చెంది నష్టాలు తగ్గేవి. బూటకపు ఎన్‌కౌంటర్లూ, అరెస్టుల మూలంగా నాయకత్వం ఎక్కువగా నష్టపోవడంతో సంబంధాలన్నీ దెబ్బతిని సమన్వయం కొరవడింది. దానితో మిలటరీపరంగా సంఘటితం కాని శక్తులు చరిత్రలో మరోసారి ఓటమికి గురయ్యాయి. ఆఖరికి 1972 జూలై 28న కామ్రేడ్ చారుమజుందార్ అమరత్వంతో కేంద్రం పని చేయని స్థితీ, రాష్ట్రాల మధ్య సమన్వయం దెబ్బ తిన్న స్థితి ఏర్పడింది. 1975 జూన్‌లో ఇందిరా ప్రభుత్వం ఎమర్జెన్సీ ప్రకటించి విప్లవోద్యమంపై విరుచుకుపడింది. ప్రగతిశీల, ప్రతిపక్ష కార్యకర్తలందరినీ అరెస్టు చేసి దేశాన్ని జైలుగా మార్చింది.

ఒకవైపు ఉద్యమ అణచివేతకు నిర్బంధాన్ని తీవ్రతరం చేస్తూ, మరోవైపు విప్లవోద్యమం నుండి ప్రజలను పక్కదారి పట్టించడానికి ప్రభుత్వం సంస్కరణలను చేపట్టింది. తెలంగాణా సాయుధ పోరాటం తర్వాత వినోభాబావే భూదానోద్యమాన్ని నడిపినట్టుగానే నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాట నేపథ్యంలో ఆదివాసీ ప్రజల ప్రయోజనాల కోసం అంటూ 1/70 చట్టం చేసింది. కానీ దాని అమలుకు ఎన్నడూ చిత్తశుద్ధిని ప్రదర్శించ లేదు. అలాగే ప్రజల్ని మోసం చేయడానికి దేశవ్యాప్తంగా భూ సంస్కరణల చట్టాన్ని తెచ్చింది. అలా నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాటాలు ముందుకు తెచ్చిన భూమి సమస్యను తామే పరిష్కరించగలమన్నట్టుగా ప్రభుత్వాలు పోజు కొట్టాయి.

ఉద్యమం వెనుకంజలో వున్నప్పుడు బలహీనతలు బయటపడటం సహజం. సత్యనారాయణసింగ్ తదితర మితవాద, అవకాశవాదులు బయల్దేరి పార్టీకి, ప్రజలకు ద్రోహం చేశారు. వీరి ద్రోహం మూలంగా పార్టీ మరింత బలహీనపడింది.

## పునరుజ్జీవన ప్రక్రియ

1973 నుండి పార్టీలోని సెక్టేరియన్ పెడధోరణిని సరిదిద్దడానికి కృషి ప్రారంభమైంది. పెడధోరణులను సరిదిద్దుకోవడానికి కామ్రేడ్ చారుమజుందార్ అమరత్వానికి ముందే చైనా కమ్యూనిస్టు పార్టీ సలహాలు ఇచ్చింది. గెరిల్లా పోరాటం ప్రజా పునాదిపై ఆధారపడి వుండాలని నొక్కి చెప్పింది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో కొండపల్లి సీతారామయ్య తదితర మిగిలిన కొద్ది మంది నాయకత్వం ప్రజా పునాదిని పెంచుకొని, ఉద్యమాన్ని తిరిగి సంఘటితం చేసే క్రమంలో తప్పొప్పులను సమీక్షిస్తూ 1974లో ఆత్మవిమర్శనా రిపోర్టును తయారు చేశారు. ఈ క్రమంలోనే 1976-77లలో జరిగిన తెలంగాణ ప్రాంతీయ మహాసభ ఉద్యమానికి ఒక మలుపువంటిది. ఈ మహాసభలో ఆత్మవిమర్శనా రిపోర్టు ఆమోదించబడింది. ఆ తర్వాతి కాలంలో ఇది కేంద్ర కమిటీ అధికారిక డాక్యుమెంట్ అయింది. 1977లో ఎమర్జెన్సీ ఎత్తివేయబడటంతో ఈ పరిస్థితిని విస్తృతంగా ఉపయోగించుకొని శత్రు దుర్భేద్యమైన రహస్య పార్టీని నిర్మించి ప్రజా పునాదిని పెంచుకొని సాయుధ పోరాటం ఉధృతం చేయాలనే లక్ష్యంతో 1977 ఆగస్టులో నాటి ఆంధ్ర రాష్ట్ర కమిటీ సాయుధ పోరాట తాత్కాలిక విరమణ తీర్మానం చేసింది (ఆగస్టు తీర్మానంగా ప్రసిద్ధి చెందిన ఈ తీర్మానం చాలా చర్చనీయాంశం అయింది. దీన్ని వాస్తవ విరమణగా కొందరు భావించారు. 1995లో జరిగిన ప్రత్యేక మహాసభలో ఈ తీర్మానాన్ని చర్చించి 'ఈ పిలుపు సరైంది కాదనీ, సాయుధ పోరాట విరమణ పదాలు లేకుండానే తీర్మానాన్ని అమలుజరిపి అందులో రూపొందించిన ఎత్తుగడల వెలుగులోనే మనం కృషి చేసి వుండేవారం' అని తీర్మానించింది). ఆగస్టు తీర్మానం వెలుగులో ఆర్గనైజర్లు విశేషమైన కృషి చేసి ఉద్యమాన్ని బలోపేతం చేసి కరీంనగర్, ఆదిలాబాద్ పోరాటాలకు రంగం సిద్ధం చేశారు.

ప్రజా ఉద్యమాలు అవసరం లేదనే పార్టీ సెక్టేరియన్ ధోరణి నుండి బయటపడి ఆంధ్రప్రదేశ్‌లో 1970 నుండి ప్రజా ఉద్యమాలు విస్తృతంగా ఏర్పడ్డాయి. ఇలా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని బలోపేతం చేస్తూ దేశవ్యాప్తంగా వున్న విప్లవకారులనూ, బృందాలను పునఃసంఘటితం చేయడంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ విశేషమైన కృషి చేసింది.

## పోరాటాల వెల్లువ - పీపుల్స్‌వార్ ఏర్పాటు

1978 నాటికి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలలో రైతాంగ పోరాటాలు బద్దలయ్యాయి. జగిత్యాల జైత్రయాత్ర భూస్వామ్య వ్యవస్థ పునాదులను వణికించింది. భూస్వాములు పల్లెలను వదిలి పట్నాల బాట పట్టారు. లేకుంటే ప్రజలకు లొంగి అణిగిమణిగి వుండసాగారు.భూస్వామ్య వ్యతిరేక పోరాటం క్రమంగా రాజ్యవ్యతిరేక పోరాటంగా బలపడింది. ఈ పరిణామాలు దేశవ్యాప్తంగా విప్లవ ప్రజానీకాన్ని ఉత్తేజపర్చాయి. ఆత్మవిమర్శనా రిపోర్టులో రూపొందించుకున్న పంథా సరైనదని నిరూపితమైంది. నక్సల్బరీ, శ్రీకాకుళాల వెనుకదుగు తర్వాత ఎం-ఎల్. పార్టీకి ప్రజాపునాది లేదనే వాదనలు పటాపంచలయినాయి. అదేవిధంగా ఆగస్టు

తీర్మానాన్ని వాస్తవ పోరాట విరమణగా వాదించిన వారికి ఆచరణాత్మక సమాధానం చెప్పినట్టయింది.

అనతికాలంలోనే ఈ ఉద్యమం రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని విస్తరింప చేస్తూనే, నాటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ కామ్రేడ్స్ పార్టీని పునర్నిర్మించే కృషిని తీవ్రంగా కొనసాగించారు. తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర పార్టీలతో చర్చలు జరిపి 1980లో సి.పి.ఐ.(ఎం–ఎల్)(పీపుల్స్‌వార్)ను ఏర్పాటు చేశారు. కేంద్ర కమిటీ కూడా ఏర్పడింది.

ఉత్తర తెలంగాణ ఉద్యమాన్ని విస్తరింప చేయడానికీ, బలోపేతం చేయడానికీ, గెరిల్లా జోన్ పర్‌స్పెక్టివ్‌ను పార్టీ సిద్ధం చేసింది. అలాగే దీన్ని రక్షించుకోవడానికి దండకారణ్యాన్ని వెనుకతట్టు ప్రాంతంగా మార్చుకోవాలనే దీర్ఘకాలిక దృక్పథంతో 1980లో అక్కడికి కొన్ని బలగాలను పంపింది.

రాష్ట్రమంతటా విశేషించి తెలంగాణా జిల్లాల్లో పోరాటాలు వెల్లువెత్తాయి. రాడికల్ విద్యార్థి, యువజన వుద్యమాలు ఈ దశకమంతా ప్రభంజనంలా సాగాయి. మహిళలు ఈ పోరాటాల్లో విస్తృతంగా కదిలారు. కార్మిక రంగంలో నూతన విప్లవ స్రవంతి మొదలయింది. మేధావులూ, రచయితలూ, కళాకారులు తమ మేధస్సూ, కలమూ, గళము ప్రజలపక్షమేనని చాటారు. భూమి సమస్యతోపాటు కూలీ రేట్లు, పాలేర్ల జీతాలూ, కౌలు రేట్లు, వడ్డీ రేట్లు మొదలైన సమస్యలపై పార్టీ నాయకత్వంలో ప్రజలు విస్తృతంగా కదిలారు. అంతదాకా దొరల గడీల్లో పెత్తందారుల కనుసన్నల్లో జరిగిన పంచాయితీలు పేద ప్రజల ముంగిట్లోకి వచ్చాయి. వర్గ సమాజ చరిత్రలో మొదటిసారి న్యాయం పేద ప్రజల పక్షం వహించింది. ప్రజా పోరాటాల్లో భాగంగా భూస్వాముల సాంఘిక బహిష్కరణ వంటి శక్తివంతమైన పోరాట రూపాలు రంగం మీదికి వచ్చాయి. రైతు కూలీ సమస్యలపైనే కాక అనేక సాంఘిక, సాంస్కృతిక సమస్యలపై ప్రజలు వుద్యమించారు. పట్టణాల్లో రౌడీయిజానికీ, గూండాయిజానికి వ్యతిరేకంగా మిలిటెంట్ పోరాటాలు జరిగాయి. కరువు, అతివృష్టి వంటి సమస్యలకు వ్యతిరేకంగా ప్రజలు కదిలారు. కారంచేడు, చుండూరులలో దళితులపై జరిగిన హేయమైన దాడులకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా మిలిటెంట్ వుద్యమాలు సాగాయి. ఈ ఉద్యమాలు రాష్ట్రంలో దళిత ఉద్యమానికి ప్రేరణ అయ్యాయి. మహిళలపై సాగుతున్న అత్యాచారాలూ, వరకట్న హింసా, గృహ హింసల పరిష్కారానికి విప్లవోద్యమం విశేషంగా కృషి చేసింది. ఈ కృషి మహిళా ఉద్యమాలకు ప్రేరణ అయింది.

ఈ విధంగా అన్ని సెక్షన్ల ప్రజలు విస్తృతంగా కదలడంతో ప్రభుత్వం పార్టీపై, ప్రజలపై నిర్బంధాన్ని పెంచింది. అరెస్టులూ, చిత్రహింసలూ, జైలు శిక్షలకుతోడు బూటకపు ఎన్‌కౌంటర్లను ప్రారంభించింది. ఈ రాజ్యహింసను సవాల్ చేస్తూ రాష్ట్రంలో పౌరహక్కుల ఉద్యమం బలపడింది. ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకు పలువురు పౌరహక్కుల నేతలు రాజ్యం చేతిలో ప్రాణాలను సైతం కోల్పోయారు.

ఇలా రాష్ట్రంలో ప్రజా పునాదిని విశాలం చేసుకుంటూ ప్రజలను విస్తృతంగా పోరాటోన్ముఖులను చేసిన పీపుల్స్‌వార్ పార్టీ దండకారణ్యంలోనూ వేళ్లూనుకుంది. ఇలా రోజు రోజుకూ శక్తివంతమవుతూ దక్షిణ, మధ్య భారతం ( ఆంధ్ర ప్రదేశ్, తమిళనాడు, కర్నాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్రల)లోనే నిర్మాణాలు కలిగి వున్నప్పటికీ, దేశవ్యాప్తంగా బలమైన ప్రభావాన్ని వేయగలిగింది.

## విప్లవోద్యమంపై అప్రకటిత యుద్ధం

1985 తర్వాత విప్లవోద్యమంపై అప్రకటిత యుద్ధం మొదలైంది. ప్రజలపై విప్లవోద్యమ ప్రభావ శక్తిని గుర్తించిన ఎన్.టి.ఆర్. 'నక్సలైట్లే దేశభక్తులు' వంటి పలు నినాదాల ద్వారా ప్రజాస్వామ్యపు పోజుకొట్టి, ప్రజలను ఆకర్షించి అధికారంలోకి వచ్చాడు. ఆ తర్వాత విప్లవోద్యమంపై అప్రకటిత యుద్ధాన్ని తలపెట్టాడు. సరిహద్దుల్లో వుండాల్సిన బి.ఎస్.ఎఫ్. తెలంగాణా పల్లెల్లో కవాతు చేసింది. సి.ఆర్.పి.ఎఫ్. దాడులు నిత్యకృత్యమయ్యాయి. నక్సల్స్ అణచివేతకోసమే ఎస్.టి.ఎఫ్. వంటి ప్రత్యేక సుశిక్షిత పోలీసు బలగాలు తయారయ్యాయి. ఆ తర్వాత కాలంలో గ్రేహౌండ్స్ బలగాలు తయారయ్యాయి. వీటికితోడు అరెస్టులూ, చిత్రహింసలూ విపరీతంగా పెరిగాయి. విప్లవకారులను మాయం చేయడం ప్రారంభమైంది.

ఏడుగురికి మించని సంఖ్యతో, తక్కువ స్థాయి మిలటరీ సామర్థ్యంతో, దేశీయ ఆయుధాలను కలిగిన గెరిల్లా దళాలు సుశిక్షితమైన అత్యాధునిక ఆయుధాలతో, భారీ సంఖ్యతో వచ్చే అర్ధ సైనిక బలగాలతో వీరోచితంగా తలపడుతూ అనేక నష్టాల మధ్యనే ప్రజాయుద్ధాన్ని పురోగమింప చేశాయి. నిర్బంధం ప్రతిఘటనను పెంచింది. రహస్య పని విధానం మెరుగయింది, ప్రజా పునాది బలపడింది, రిక్రూట్‌మెంట్ పెరిగింది, దళాలు విస్తరించాయి. ఎన్‌కౌంటర్లకు సమాధానంగా గెరిల్లా దాడులూ, ఆంబుష్‌లు పెరిగాయి. ఆలంపల్లి, దారగడ్డలలో విజయవంతమైన మొదటి ఆంబుష్‌లు రాజ్యం గుండెల్లో ప్రకంపనలు సృష్టించాయి. అరెస్టులకూ, విప్లవ కారులను మాయం చేయడానికి వ్యతిరేకంగా, రాజకీయ పోరాటాలతోపాటు కిడ్నాప్ అనే నూతన పోరాట రూపం ముందుకు వచ్చింది. రాజ్య నిర్బంధానికి ముఖ్యంగా బూటకపు

ఎన్‌కౌంటర్లకు నిరసనగా ప్రభుత్వ ఆస్తుల విధ్వంసాన్ని ప్రజలు ముఖ్యమైన పోరాట రూపంగా ఎంచుకున్నారు.

పార్టీ ఎదుర్కుంటున్న ఈ గడ్డు పరిస్థితిని ఓడించడానికి నాయకత్వం మరింత దృఢంగా, క్రియాశీలకంగా వ్యవహరించి సమస్త పార్టీ శ్రేణులను అందుకు సంసిద్ధం చేయవలసి వున్న సమయంలో ఆనాడు కేంద్ర నాయకుడుగా వున్న సత్యమూర్తి పార్టీలో సంక్షోభం లేవదీశాడు. మిగతా నాయకత్వం యుద్ధంలో తలమునకలవుతూనే ఈ సంక్షోభం నుంచి పార్టీని బయటపడవేసి పార్టీ శ్రేణుల్లో, ప్రజల్లో విశ్వాసాన్ని ఇనుమడింపచేశారు.

ఇలా తీవ్ర నిర్బంధాన్ని తిప్పికొడుతూనే సంక్షోభం నుంచి బయటపడి 1980 నాటికి ఉత్తర తెలంగాణా (ఎన్.టి.), దండకారణ్యం(డికె) ప్రాంతాలు గెరిల్లా జోన్ ప్రాథమిక దశలోకి ప్రవేశించి ఉన్నత దశలోకి సన్నాహాలు ప్రారంభించాయి.

## వెసులుబాటు కాలం– వెన్నంటే వచ్చిన రెండవ అప్రకటిత యుద్ధం

1990లో రాష్ట్రంలో ఎన్నికలు వచ్చాయి. అప్పటికి తీవ్ర నిర్బంధాన్ని తిప్పికొడుతూ ప్రజాయుద్ధం పురోగమించి రాష్ట్రంలో ఒక ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదగడంతో నాటి కాంగ్రెస్ పార్టీ నక్సలైట్లకు అనుకూలంగా మాట్లాడుతూ ఎన్నికల బరిలోకి దిగింది. విప్లవోద్యమం పట్ల నియంతలా వ్యవహరించిన ఎన్.టి.ఆర్.ను ప్రజలు గద్దె దించారు. అధికారంలోకి వచ్చిన చెన్నారెడ్డి కొద్ది కాలంపాటు వెసులుబాటును కల్పించాడు. ఆ సమయంలో ప్రజా ఉద్యమాలు ఉవ్వెత్తున ఎగిశాయి. భూస్వామ్య వ్యతిరేక పోరాటాల్లో వేల ఎకరాల భూమి పేద రైతాంగం స్వాధీనమయింది. ఆట, పాట, మాట, సభలు, సమావేశాలతో ప్రజా చైతన్యం వెల్లివిరిసింది. వేలు, లక్షల సంఖ్యలో విస్తృతంగా జరిగిన ప్రజా సమీకరణాలు ప్రజల ఆకాంక్షల్ని ఎత్తిపట్టాయి. ఈ సందర్భంలో వరంగల్‌లో జరిగిన రైతుకూలీ సంఘం మహాసభలు చారిత్రాత్మకమైనవి, పార్టీకి గల ప్రజాపునాదికి అద్దంపట్టినవి.

ఈ ప్రజా ప్రభంజనాన్ని చూసి వణికిపోయిన చెన్నారెడ్డి ప్రభుత్వం 1990 చివరికల్లా నిర్బంధం తీవ్రతరం చేసింది. అయితే గతం నుండి సంతరించుకున్న అనుభవంతో, రెండవ అప్రకటిత యుద్ధంగా చెప్పుకునే ఈ నిర్బంధాన్ని పార్టీ తిప్పికొట్టింది. నిర్బంధాన్ని తిప్పికొట్టడంలో యావత్ పార్టీ తలమునకలయి వుండగా నాటి కేంద్ర కమిటీ కార్యదర్శిగా వున్న కొండపల్లి సీతారామయ్య, మరికొందరూ కల్సి పార్టీలో సంక్షోభాన్ని లేవదీశారు. పార్టీని చీల్చాలని కుట్రపన్నారు. యావత్ పార్టీ ఏకతాటిపై నిలబడి ఈ కుట్రను భగ్నం చేసింది.

పార్టీ ఈ సంక్షోభం నుంచి బయటపడిన వెంటనే ఆనాడు రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా వున్న కామ్రేడ్ పులి అంజన్నను ప్రభుత్వం బూటకపు ఎన్‌కౌంటర్‌లో పాశవికంగా హత్య చేసి, రాష్ట్ర వుద్యమానికీ, యావత్ దేశ ఉద్యమానికి తీవ్రంగా నష్టం కలిగించింది. నక్సల్బరీ, శ్రీకాకుళ ఉద్యమాలు దెబ్బతిని ఉద్యమం పునరుజ్జీవనం పొందిన తర్వాత శత్రువు కలగజేసిన మొదటి పెద్ద నష్టం ఇది.

అయితే ప్రజాయుద్ధం తనకు నాయకత్వం వహించవల్సిన శక్తులను తానే సృష్టించుకుంటుందనే చారిత్రక నగ్న సత్యాన్ని రుజువు చేస్తూ నూతన నాయకత్వం ఉద్యమాన్ని ముందుకు నడిపించింది.

గ్రామీణ ప్రాంతాల్లో సాయుధ బలగాలతో తలపడుతూనే 90వ దశకంలో భావజాల రంగంలో దూసుకు వచ్చిన వివిధ మార్క్సిస్టేతర ధోరణులతో ఈ దశకమంతా పార్టీ పోరాడింది. ముఖ్యంగా మార్క్సిజంలో ఖాళీలు వున్నాయంటు బాలగోపాల్ తదితరులు లేవనెత్తిన గందరగోళాన్ని తిప్పికొట్టింది. ఇదే బాలగోపాల్ 'నక్సల్బరీ చీకటి కోణాలు' పేరిట ప్రజాయుద్ధంలోని ఎగుడు దిగుడులను వక్రీకరించడానికి చేసిన ప్రయత్నాన్ని కూడా పార్టీ తిప్పికొట్టింది. అలాగే ఈ దశకంలో వచ్చిన కుల, స్త్రీవాద వుద్యమాల్లోని పాజిటివ్ అంశాలను గుర్తిస్తూనే వీటి బలహీనతలనూ, పరిమితులనూ, వర్గరహిత దృక్పథాన్నీ వ్యతిరేకించింది. పోస్ట్‌మాడర్నిస్టు ధోరణులను తిప్పికొట్టింది. అదే సమయంలో కుల, స్త్రీవాద ఉద్యమాల నేపథ్యంలో, ఈ సమస్యల పరిష్కారానికి వర్గ పోరాటమే ఏకైక మార్గమని చెప్తూ కుల, మహిళా సమస్యల పట్ల విప్లవ దృక్పథాన్ని రూపొందించింది. ఈ దశకంలో మహిళా వుద్యమం విస్తరించింది.

జైళ్లలోని విప్లవకారులు 1994లో చేసిన చారిత్రాత్మక జైలు పోరాటాలు రాష్ట్రాన్ని కుదిపివేశాయి. చీకటి గుయ్యారాల్లో మగ్గిపోతున్న ఖైదీల దుర్భర పరిస్థితులు సభ్య సమాజంలో తీవ్ర చర్చనీయాంశం అయ్యాయి. ఖైదీల ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ కొరకు ప్రజలూ, ప్రజాస్వామికవాదులు విశేషంగా కదిలి రాజకీయ ఖైదీల పోరాటానికి దృఢమైన సంఘీభావం ప్రకటించి విజయ సాధనలో కీలకపాత్ర వహించారు.

## అఖిలభారత ప్రత్యేక మహాసభ – పీపుల్స్‌వార్ వుద్యమ మదింపు

1995 నాటికి ఉద్యమం గుణాత్మకంగా అభివృద్ధి చెందింది. తీవ్ర నిర్బంధాన్నీ, సంక్షోభాలనూ కామ్రేడ్ పులి అంజన్న సహా

ఎందరో విలువైన కామ్రేడ్స్‌ను కోల్పోతూనే ఉత్తర తెలంగాణ వుద్యమం గెరిల్లా జోన్ కర్తవ్యాలను ముందుకు తీసుకుపోయింది.

ఈ నేపథ్యంలో జరిగిన 14వ రాష్ట్ర మహాసభలో ఉత్తర తెలంగాణా ఉద్యమాన్ని రాష్ట్రం నుండి వేరుచేసి దాన్ని ప్రత్యేక జోన్‌గా ప్రకటించింది. ఇదే సమయంలో డీకే ఉద్యమం కూడా విశేషంగా అభివృద్ధి చెందింది.

1995లో జరిగిన అఖిల భారత ప్రత్యేక మహాసభ పీపుల్స్‌వార్ ఉద్యమ ప్రవంతిని కూలంకషంగా చర్చించి మదింపు చేసిన కీలకమైన ఘట్టం. మూడు ప్రపంచాల సిద్ధాంతపు లోతుల్ని గ్రహించి దాన్నుంచి బయటపడ్డానికి తోడ్పడటంతోపాటు ఉద్యమాన్ని విస్తృత స్థాయిలో లోలోతుల్లోకి వెళ్లి విశ్లేషించి సంశ్లేషించింది. ఉత్తర తెలంగాణ, దండకారణ్యాలను గెరిల్లా జోన్‌లుగా అభివృద్ధి చేయాలనే కర్తవ్యాలను కూడా ఈ మహాసభ చేపట్టింది.

1997లో స్కోప్ (రాజ్యూరాజు– సబ్ కమిటీ ఆన్ పొలిటికల్ ఎడ్యుకేషన్) ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా పార్టీ శ్రేణులకు సైద్ధాంతిక, రాజకీయ తరగతులను నిర్వహించడం వల్ల పార్టీ సైద్ధాంతిక–రాజకీయ స్థాయి అభివృద్ధి చెందింది.

ఈ కాలంలో చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రపంచ బ్యాంకుకు ప్రయోగశాలగా మారింది. నూతన ఆర్థిక విధానాల విష ఫలితాలు పీడిత ప్రజానీకంపై దారుణంగాపడ్డాయి. ముఖ్యంగా భాగంగానూ పోలీసు స్టేషన్‌లపై దాడులూ, మందుపాతరలతో ఆంబుష్‌లు చేయడం; క్రూరమైన పోలీసు ఆఫీసర్లను శిక్షించడంలో అభివృద్ధి సాధించాయి.

1998 ఆగస్టులో అప్పటిదాకా విడి విడి ప్రవంతులుగా సాగుతున్న సి.పి.ఐ.(ఎం–ఎల్) (పీపుల్స్‌వార్), సి.పి.ఐ.(ఎం–ఎల్)(పార్టీ యూనిటీ)లు విలీనమై నూతన పార్టీగా ఏర్పడడం విప్లవోద్యమం సాధించిన ఒక పెద్ద విజయం. ఉత్తర భారత దేశంలో ఉద్యమం పురోగమించడానికి ఈ విజయం దోహదపడింది.

విప్లవోద్యమానికి ఆటంకంగా వున్న అన్యవర్గ ధోరణులను వదిలించుకోవడానికి 1999లో ఆంధ్రప్రదేశ్ విప్లవోద్యమం దిద్దుబాటు చేపట్టింది. తమలోని అన్యవర్గ ధోరణులు పై నుండీ కింది వరకూ అన్ని కమిటీలూ, దళాలు గుర్తించి ప్రజల ముందు నిలబడి ఆత్మవిమర్శ చేసుకున్నతీరు వాటి నుండి బయటపడ్డానికి ప్రజల మద్దతును కోరినతీరు పార్టీ శ్రేణులనూ, విప్లవ ప్రజానీకాన్ని విశేషంగా ఉత్తేజపర్చి పార్టీని ప్రజలకు మరింత చేరువ చేసింది.

## 'కొయ్యూరు' విషాదం – పి.ఎల్.జి.ఎ. ఆవిర్భావం

1999 డిసెంబర్ 2, పార్టీ చరిత్రలో అత్యంత విషాదకరమైన దినం. చంద్రబాబు పాశవిక ప్రభుత్వం అంతకుముందే ద్రోహపూరితమైన కోవర్టు ఎత్తుగడలకు పాల్పడి పార్టీకి కొన్ని నష్టాలను కలగజేసింది. ఈ నీచమైన ఎత్తుగడలను మరింతగా




కార్మికులు వేల సంఖ్యలో వీధినపడ్డారు. విజన్ 2020 పేరుతో రాష్ట్ర వినాశనానికి పథక రచన జరిగింది. ప్రభుత్వం సంక్షేమం పాత్ర నుండి పూర్తిగా వైదొలగి రైతాంగం, పేద ప్రజలమీద ఆర్థిక భారాన్ని అధికం చేసింది.

ఈ విధానాలకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ విస్తృతమైన ప్రజా ఉద్యమాన్ని నిర్మించి చంద్రబాబు ముందుకు తీసుకుపోదల్చిన ప్రపంచ బ్యాంకు ఎజెండాను ఎండగట్టింది. ఇదే సమయంలో గెరిల్లా దళాలు పోలీసు దాడులనూ, బూటకపు ఎన్‌కౌంటర్లనూ ఎదుర్కోవడంలో భాగంగానూ; ఆయుధ సంపత్తిని పెంచుకోవడంలో కొనసాగించి, కేంద్ర కమిటీ సభ్యులయిన కామ్రేడ్స్ శ్యాం, మహేష్, మురళిలను హత్య చేసింది. ముగ్గురు కేంద్ర కమిటీ సభ్యులను ఒకేసారి కోల్పోయిన ఈ ఘటన నక్సల్బరీ, శ్రీకాకుళాలు దెబ్బతిన్న తర్వాత విప్లవోద్యమానికి సంభవించిన అతిపెద్ద నష్టం. పార్టీ జవజీవాల్ని దెబ్బతీసిన ఈ ఘటన విప్లవోద్యమంపై తీవ్రమైన ప్రభావాన్ని వేసింది. ముఖ్యంగా ఈ ముగ్గురు కామ్రేడ్స్ ఆంధ్రప్రదేశ్ విప్లవోద్యమానికి ప్రత్యక్షంగా నేతృత్వం వహిస్తున్నవారు కనుక రాష్ట్ర ఉద్యమంపై ఈ ప్రభావం మరింత లోతుగా, విస్తృతంగా పడింది.

ప్రభుత్వం పాల్పడిన ఈ నీచమైన హత్యాకాండను దేశవ్యాప్తంగానే కాక, విప్లవ పోరాటాలు కొనసాగుతున్న పలు ఇతర దేశాల్లోనూ విప్లవ సంస్థలూ, ప్రజలు, ప్రగతిశీల కాముకులు తీవ్రంగా నిరసించారు. దేశవ్యాప్తంగా విప్లవ ప్రజానీకం పార్టీ శ్రేణులు ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసి తమ కసిని ప్రదర్శించారు. దీనికి కొనసాగింపుగా 2000 మార్చి 8న ఈ కోవర్టు ఆపరేషన్‌లో చురుకైన పాత్ర పోషించిన నాటి రాష్ట్ర హోంమంత్రి మాధవ రెడ్డిని యాక్షన్ టీం మట్టుపెట్టింది.

కామ్రేడ్స్ శ్యాం, మహేష్, మురళిల అమరత్వానికి నివాళిగా, సమస్త అమరుల ఆశయసాధన లక్ష్యంగా 2000 డిసెంబర్ 2న ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం (పి.ఎల్.జి.ఎ.) ఏర్పడింది. భారతదేశంలో మొట్టమొదటిసారి పీడిత ప్రజల పక్షాన పోరాడే సైన్యం ఏర్పడింది. విప్లవోద్యమానికి తీవ్రమైన నష్టాన్ని కలిగించి పాలకవర్గాలు సంబరాలు చేసుకున్న డిసెంబర్ 2వ తేదీ పాలకవర్గాలు మృత్యు భయంతో వణికిపోయే రోజుగా చరిత్రలో నిలిచిపోయింది.

## 9వ కాంగ్రెస్–గెరిల్లా జోన్‌ల పురోగమనం

2000 సంవత్సరం ఆఖరులో జరిగిన ఆంధ్రప్రదేశ్ (ఎ.పి.) రాష్ట్ర మహాసభలో తూర్పుగోదావరి, విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం, మల్కన్‌గిరి జిల్లాలను ఆంధ్రా–ఒడిస్సా ప్రత్యేక బార్డర్ (ఎ.ఒ.బి.) జోన్‌గా ఏర్పాటు చేయాలనే నిర్ణయం జరిగింది. అనేక నష్టాల మధ్యనే ఉద్యమం సాధించిన విజయమిది.

2001 ప్రారంభంలో జరిగిన 9వ కాంగ్రెస్ గెరిల్లా జోన్‌ల గురించి విస్తృతంగా చర్చించింది. గెరిల్లా బేస్‌లను ఏర్పాటు చేసి విస్తరింపచేయాలనీ, ప్రజారాజ్యాధికార నిర్మాణాలను చేపట్టాలనీ, ప్రజాగెరిల్లా సైన్యాన్ని విస్తృతపర్చాలని చెప్పింది. డీకే, ఎన్.టి., ఎ.ఒ.బి.లకు విముక్తి ప్రాంత లక్ష్యాలను ప్రకటించింది.

కాంగ్రెస్ పిలుపును విజయవంతం చేయడానికి కృషి జరిగింది. గెరిల్లా బేస్ ఏరియాలను నిర్ణయించుకుని వాటిని అభివృద్ధి చేయడంలో ఒకమేరకు కృషి జరిగింది. డి.కె.లో బీజప్రాయంలో ప్రజారాజ్యాధికార సంస్థలు ఏర్పడ్డాయి. పి.ఎల్.జి.ఎ.ను బలోపేతం చేయడంలో భాగంగా ఎ.పి., ఎ.ఒ.బి., డి.కె.ల్లో ప్లటూన్లు ఏర్పడ్డాయి. అలిపిరిలో చంద్రబాబుపై చేసిన ఆంబుష్, కోరాపుట్ మల్టీ రెయిడ్ పి.ఎల్.జి.ఎ. చేసిన అత్యంత ప్రాధాన్యతతో కూడుకున్న దాడులు. చంద్రబాబుపై చేసిన దాడి రాష్ట్ర రాజకీయ రంగంపై తీవ్రమైన ప్రభావాన్ని వేసింది. దీనికి ప్రతీకారంగా ప్రభుత్వం ఉన్మాద స్థాయిలో పార్టీపై, ప్రజాసంఘాలపై విరుచుకుపడింది. అంతేకాదు తన మీద జరిగిన దాడిని సానుభూతిగా మార్చుకోవడానికి చంద్రబాబు ముందస్తు ఎన్నికలను తీసుకువచ్చాడు. అయితే ఆయనపై సానుభూతి కురవకపోగా వెల్లువెత్తిన ప్రజా ఆగ్రహం, అసహ్యంలో చంద్రబాబు అధికారం కుప్పకూలింది.

నక్సలైట్లతో చర్చలను ప్రధాన ఎజెండాగా చేస్తూ అధికారంలోకి వచ్చిన వై.ఎస్.ఆర్. ప్రజలు, ప్రజాస్వామికవాదుల ఆకాంక్షల మేరకు చర్చలకు సిద్ధపడక తప్పలేదు.

చర్చల సమయంలో వచ్చిన ప్రజావెల్లువ విప్లవోద్యమం పట్ల ప్రజలకున్న ప్రగాఢ ఆకాంక్షలను వ్యక్తం చేసింది. దోపిడీ ప్రభుత్వాల పట్ల విసిగిపోయిన ప్రజలు ప్రత్యామ్నాయ రాజకీయాలను ఎంతగా కోరుకుంటున్నారో స్పష్టమైంది. ఈ సందర్భంగా భూమి, స్వావలంబన, ప్రజాస్వామిక హక్కులు ప్రజల్లో తీవ్రంగా చర్చనీయాంశమయ్యాయి.

## సి.పి.ఐ.(మావోయిస్టు) ఆవిర్భావం

కామ్రేడ్ కన్హయ్ చటర్జీ నేతృత్వంలో ఆవిర్భవించిన ఎం.సి.సి.ఐ. ఉత్తర భారతదేశంలో బలమైన విప్లవ ప్రవంతిగా కొనసాగుతూ వుండింది. 2004 సెప్టెంబర్ 21న ఎం.సి.సి.ఐ., పీపుల్స్‌వార్‌లు విలీనమై సి.పి.ఐ.(మావోయిస్టు)గా ఏర్పడడం భారత విప్లవోద్యమ చరిత్రలో కీలకమైన మలుపు. దీనితో దేశంలోని నిజమైన విప్లవకారుల చిరకాల స్వప్నం నెరవేరినట్టయింది. దేశ విదేశీ ప్రజానీకంలో గొప్ప వుత్సాహాన్ని రేకెత్తించింది. దేశవ్యాప్తంగా నిర్మాణపరంగా, రాజకీయంగా, మిలటరీ పరంగా పార్టీ బలపడి ప్రజల్లో విప్లవోద్యమం పట్ల విశ్వాసాన్ని పెంచింది.

విప్లవ ప్రజానీకాన్ని విశేషంగా ఉత్సాహపరిచిన ఈ ఘటన పాలకవర్గాలను బెంబేలెత్తించింది. అందుకే మావోయిస్టు పార్టీ ఏర్పాటు దేశ అంతర్గత భద్రతకు ప్రధాన ముప్పుగా మన్మోహన్ సర్కార్ ప్రకటించి దేశవ్యాప్త సమన్వయంతో నిర్బంధాన్ని తీవ్రతరం చేసింది. ఈ నిర్బంధంలో క్రమంగా ఆంధ్రప్రదేశ్ ఉద్యమం దెబ్బతిన్నది. ఎన్.టి. ఉద్యమం కూడా దెబ్బతిన్నది. ఎ.ఒ.బి. ఉద్యమం ఈ స్థాయిలో కాకపోయినా బలహీనపడింది. గతం నుంచి పాలకవర్గాల ఎల్.ఐ.సి. వ్యూహంలో భాగంగా శత్రువు అమలు చేస్తూ వస్తున్న ఎత్తుగడలను అర్థం చేసుకొని వాటిని ఓడించడానికి అవసరమైన ఎత్తుగడలను రూపొందించుకోకపోవడంలోని వైఫల్యమే ఈ నష్టాలకు కారణం. చర్చల సమయాన్ని పాలకవర్గాలు తీవ్ర దమనకాండకు సన్నాహక కాలంగా ఉపయోగించుకుంటాయనీ, చర్చలు ముగిశాక నిర్బంధం విరుచుకుపడుతుందనీ పార్టీ సరిగానే అంచనా వేసినప్పటికీ ఆ నిర్బంధాన్ని ఎదుర్కోగలిగే ఎత్తుగడలను రూపొందించుకోవడంలో పూర్తిగా వైఫల్యం చెందింది. ఈ తప్పిదం మూలంగా చర్చల కాలంలో వచ్చిన పాజిటివ్ వాతావరణాన్ని ఆ తర్వాత కాలంలో

వినియోగించుకోలేకపోయింది. విరుచుకుపడిన నిర్బంధంలో చర్చల కాలంలో పెరిగిన రిక్రూట్‌మెంట్‌ను చాలామేరకు కోల్పోయింది. నల్లదండు ముఠాలూ, కోబ్రాల పేరుతో ప్రజాసంఘాల మీద దాడులు పెరిగాయి. ఈ నిర్బంధాన్ని ఎదుర్కోవడానికి పార్టీ చేసిన ప్రతిఘటనా దాడుల్లో చోటుచేసుకున్న కొన్ని తప్పిదాలు ప్రతికూల వాతావరణాన్ని మరింతగా పెంచాయి. ముఖ్యంగా వేంపెంట ఘటనలో ఉద్యమానికి లక్ష్యంగా వున్న వారిని మాట్లాడుదామని పిలిపించి, అప్పటి దాకా పి.ఎల్.జి.ఎ. అనుసరిస్తోన్న దానికి భిన్నంగా ఒక్కొక్కరిని పక్కకు పిలిచి చంపడం అనేది ప్రజల్లో, ప్రజాస్వామికవాదుల్లో తీవ్రమైన వ్యతిరేకతను పెంచింది. పార్టీ నైతికతను దెబ్బ తీసింది. ఈ పరిస్థితిలో వుద్యమాన్ని నిలబెట్టడానికి పార్టీ చేసిన ప్రయత్నాలేవీ సఫలం కాలేదు. 2006 జూలైలో గ్రేహౌండ్స్ బలగాలు చేసిన మూకుమ్మడి దాడిలో మరికొందరు కామ్రేడ్స్ సహా రాష్ట్ర కమిటీ కార్యదర్శి కామ్రేడ్ మాధవ్ అమరుడు కావడంతో ఎ.పి. ఉద్యమ పరిస్థితి దెబ్బతిన్నది. ఎ.పి.తో పోల్చితే ఎన్.టి పరిస్థితి కొంతమెరుగ్గా వున్నప్పటికి అక్కడా తీవ్రంగానే నష్టాలు జరిగి ఉద్యమం వెనుకబడిపోయింది. ఎ.ఒ.బి.లో భౌతిక నష్టాలు తక్కువే జరిగినప్పటికి ఉద్యమ వేగం తగ్గిపోయింది.

డీకేలోనూ ఈ సమయంలో నిర్బంధం తీవ్రమైంది. కేంద్ర ప్రభుత్వ సంపూర్ణ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం 2005 జూన్‌లో సల్వాజుడుం ఫాసిస్టు దమనకాండను ప్రారంభించి వందల సంఖ్యలో గ్రామాలను తగులబెట్టింది. వందల సంఖ్యలో విప్లవ ప్రజానీకాన్నీ, సంఘ నాయకత్వాన్ని ఊచకోత కోసింది. వందలాది మహిళలపై అత్యాచారాలకు పాల్పడింది. గ్రామాల్లో ఏర్పడిన రాజ్యాధికార సంస్థలను చిన్నాభిన్నం చేసింది. వేలాది మంది ప్రజలను బలవంతంగా ఎత్తుకపోయి నిర్బంధ శిబిరాల్లో బంధించింది. అయితే ఈ నిర్బంధాన్ని తిప్పికొట్టడానికి పార్టీ తీసుకున్న సరైన ఎత్తుగడల వల్ల పి.ఎల్.జి.ఎ., ప్రజలూ చేసిన వీరోచిత ప్రతిఘటన వల్ల సల్వాజుడుం వెనుకడుగు వేసింది. బీహార్-ఝార్ఖండ్‌లలోనూ సేంద్ర పేరుతో నిర్బంధం తీవ్రమైంది. అక్కడి పార్టీ, పి.ఎల్.జి.ఎ., ప్రజలు వీరోచితంగా పోరాడుతూ ఆ దమనకాండను అడ్డుకున్నారు. ఈ కాలంలో జహానాబాద్ జైలు పైనా, గిరిడీ పోలీసు క్యాంపు పైనా పి.ఎల్.జి.ఎ. చేసిన దాడులు దేశవ్యాప్తంగా ఉత్సాహాన్నిచ్చాయి.ఈ విధంగా ప్రతిఘటనలో పి.ఎల్.జి.ఎ. బలోపేతమై డీకే, బీహార్-ఝార్ఖండ్‌లలో పలు కంపనీలు ఏర్పడ్డాయి.

## ఐక్యతా కాంగ్రెస్-విముక్తి ప్రాంతాలకు పిలుపు

2007 ప్రారంభంలో జరిగిన 9వ కాంగ్రెస్ -ఐక్యతా కాంగ్రెస్ భారత విప్లవోద్యమ చరిత్రలో కీలక మలుపు. దాదాపు నాలుగు దశాబ్దాలుగా రెండు స్రవంతులుగా సాగిన ఉద్యమాన్ని ఈ కాంగ్రెస్ మదింపు చేసి ఏకశిలా సదృశ్యమైన పార్టీగా మల్చడంలో తోడ్పడింది. వ్యూహాత్మక శత్రువును అర్థం చేసుకోవడంలో వున్న భిన్నత్వాన్ని సరిచేసింది. డీకే, బీహార్-ఝార్ఖండ్‌లను విముక్తి ప్రాంతాలుగా మలచాలనే, గెరిల్లా యుద్ధాన్ని మొబైల్ యుద్ధంగా అభివృద్ధి చేయాలనే కేంద్ర కర్తవ్యాన్ని పార్టీ శ్రేణుల ముందు వుంచింది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వంతో చర్చలకు వెళ్లడం సరైంది కాదని సమీక్షించింది. ఎ.పి.లో జరిగిన నష్టాలను లోతుగా సమీక్షించి అక్కడ ఉద్యమాన్ని నిలబెట్టడానికి కొన్ని నిర్ణయాలను చేసింది.

అయితే కాంగ్రెస్ మార్గదర్శకత్వంలో ఎ.పి. ఉద్యమాన్ని నిలబెట్టడానికి చేసిన ప్రయత్నాలేవీ సఫలం కాలేదు. ఉద్యమం మరింత నష్టాలకు గురికావడంతో అక్కడి శక్తులన్నింటినీ కేంద్రకమిటీ ఇతర ప్రాంతాలకు రిట్రీట్ చేసింది. చాలా పరిమితమైన శక్తులను అక్కడ వుంచి స్పెషల్ కమిటీని ఏర్పాటు చేసి ఉద్యమ పునరుద్ధరణకు ప్రయత్నాలు చేసింది. 2008 అక్టోబర్‌లో స్పెషల్ కమిటీ కార్యదర్శి, మరొక కమిటీ సభ్యుడితోపాటు అక్కడి ఉద్యమంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న నలుగురు జిల్లా కమిటీ స్థాయి కామ్రేడ్స్ అమరులు కావడంతో ఎ.పి. ఉద్యమం తీవ్రంగా దెబ్బతిన్నది.

ఎ.ఒ.బి.లో ఉద్యమ వేగం తగ్గినప్పటికీ మల్కన్‌గిరి, కోరాపుట్ డివిజన్లలో ఉద్యమం పురోగతిలో వుంది. అదే సమయంలో తీవ్ర నిర్బంధం నడుమనే బాక్సైట్ ఉద్యమం మన్యం కొండలను రగిలిస్తూ దళారీ పెట్టుబడి దారులకూ, సామ్రాజ్యవాదులకూ, వాళ్లకు పాదసేవ చేస్తున్న పాలక వర్గాలకు కంటగింపుగా వుంది. అందుకే పాలకవర్గాలు ఇక్కడి నిర్బంధాన్ని మరింత తీవ్రం చేయడానికి అన్ని రకాల ప్రయత్నాలూ చేస్తోన్నాయి. విశాఖ జిల్లా వాకపల్లిలో మహిళలపై గ్రేహౌండ్స్ బలగాలు చేసిన అత్యాచారాలు ఇక్కడి రాజ్యహింసకు ప్రతీకగా చెప్పుకోవచ్చు. ఇంతటి నిర్బంధాన్ని ధిక్కరిస్తూ ఈ అత్యాచారాలకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ఉద్యమం ఉధృతంగా సాగింది.

ఇదే సమయంలో కాంగ్రెస్ నిర్దేశించిన విముక్తి ప్రాంత కర్తవ్యాన్ని సాధించే లక్ష్యంతో ఎత్తుగడలను రూపొందించుకొని డీకే, బీహార్-ఝార్ఖండ్ ఉద్యమాలు పురోగమిస్తున్నాయి. తీవ్రమైన నిర్బంధాన్ని తట్టుకుంటూనే ఈ ఉద్యమాలు విస్తరిస్తోన్నాయి. ప్రజారాజ్యాధికార అంగాలు విస్తరిస్తున్నాయి. అయితే డీకే ఉద్యమాన్ని అణచడానికి సల్వాజుడుం వంటి పాశవిక అణచివేతను ప్రయోగించిన పాలకవర్గాలు ప్రస్తుతం మాడ్ డివిజన్‌ను కేంద్రంగా చేసుకొని అణచివేత దాడులను ఉధృతం చేయాలని పథకాలు రచిస్తున్నాయి.

➡

# ఈ సంవత్సర కాలంలో పార్టీ సాధించిన విజయాలు

మన విజయాలను ఆరు అంశాలుగా చెప్పుకోవచ్చు.

మొదటిది– ప్రజావిముక్తి సైన్యం నిర్మాణం, విముక్తి ప్రాంతాల ఏర్పాటు లక్ష్యంగా జరుగుతున్న కృషిలో భాగంగా శత్రు దాడుల్ని ప్రతిఘటిస్తూ చెప్పుకోదగిన విజయాలను సాధించి పరిమాణంలో ఒక గెంతుగా పరిగణించే అభివృద్ధిని సాధించాం. నయాగఢ్ దాడి, బలిమెల రిజర్వాయర్‌లో 38 మంది గ్రేహౌండ్స్ బలగాలను మట్టుబెట్టడం తర్వాత ఈ సంవత్సరం ఎత్తుగడల ప్రతిఘటనలో కనీసం 15 పెద్ద యాక్షన్‌లను, డజన్ల కొద్దీ చిన్న యాక్షన్‌లను చేశాం. మన పి.ఎల్.జి.ఎ., విప్లవ ప్రజలు కలిసి పోలీసులు, కమాండోలు, కేంద్ర బలగాలకు చెందినవారిని 300 మందికిపై మట్టుపెట్టారు. దానికన్నా అధిక సంఖ్యలో గాయపరిచారు. ప్రజాయుద్ధ పురోగమనంలో ఇదో ప్రధానాంశం.

ఒక్క బీహార్–ఝార్ఖండ్‌లలోనే మూడు నెలల కాలంలో 50 మందిని మట్టుబెట్టాం. ఆరు నెలల్లోనే డీకేలో 170 మందిని మట్టుబెట్టాం. శత్రు బలగాల మనస్థైర్యం దెబ్బతింది. జూన్ 15న చిదంబరం "నక్సలైట్లను తక్కువ అంచనా వేసాము" అని ప్రకటించుకున్నాడు. ఉద్యమ ప్రాంతాల అధికారులు, పోలీసులు ఉద్యోగాలు వదులుకోవడానికి సిద్ధపడ్డారు. రాణిబోధిలి, వుర్పల్‌మెట్ట, బలిమెల తర్వాత మదన్‌వేడ ఘటన పాలకవర్గాల్లోనూ, పోలీసు బలగాల్లోనూ వణుకు పుట్టించింది. కామ్రేడ్ అశుతోష్ అరెస్టు, కామ్రేడ్ వికాస్ బూటకపు ఎన్‌కౌంటర్‌లకు వ్యతిరేకంగా, లాల్‌గఢ్ పోరాటానికి మద్దతుగా రాజకీయ ఖైదీల విడుదలను డిమాండ్ చేస్తూ చేసిన అనేక బంద్‌లు, భారీస్థాయిలో నిరసన కార్యక్రమాలు విజయవంతమయ్యాయి.

రెండవది– విదేశాలకు చెందిన పారిశ్రామిక ప్రాజెక్టులకు (ఎస్.ఇ.జడ్.లకు) రైతాంగపు పంట భూముల్ని బలవంతంగా లాక్కోవడానికి వ్యతిరేకంగా సాగిన నందిగ్రాం సాయుధ తిరుగుబాటు చారిత్రక విజయం సాధించింది. సాయుధ ప్రజావెల్లువతో అలా రాజ్యాన్నీ, పోలీసు బలగాల్ని టార్గెట్ చేస్తూ ఉద్యమించడం సరైన రాజకీయ చర్య అని లాల్‌గఢ్ పోరాటం మరోసారి రుజువుచేసింది. పోలీసుల్ని సాంఘీక బహిష్కరణ, ఘెరావ్ చేయడంతోపాటు పోలీసు దాడుల్ని భౌతికంగా ఎదుర్కోవడం ద్వారా తరిమికొట్టడం, రోడ్లు బ్లాక్ చేయడంలాంటి వివిధ రకాల పోరాట రూపాలతో వేలాది మంది విప్లవ ప్రజలు సాయుధంగా పాల్గొని నూతన ప్రజా ప్రతిఘటనా రూపాలను తీసుకువచ్చి గతంలో జరిగిన సంతాల్ తిరుగుబాట్లనూ, తెభాగా పోరాటాన్ని గుర్తుకు తెచ్చారు. సి.పి.ఎం. ప్రభుత్వ సోషల్ ఫాసిస్టు స్వభావాన్ని బహిర్గతం చేశారు. గత 30 ఏళ్లలో సి.పి.ఎం. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని బహిర్గతం చేస్తూ– ప్రజల పరస్పర సహకారం, సమిష్టి శ్రమ ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు, రోడ్ల నిర్మాణం, నీటి పారుదల పథకాలు, ఆరోగ్య కేంద్రాలు, ఆదివాసీ పిల్లల చదువు లాంటి కార్యక్రమాలు చేపట్టి ప్రజల ప్రత్యామ్నాయ గ్రామ కమిటీ ఏర్పరచి ఆర్థిక, రాజకీయ నిర్మాణాన్ని నమూనా రూపంలో అందించడానికి కృషి మొదలుపెట్టారు.

మూడవది– ప్రజల చురుకైన మద్దతుతో పి.ఎల్.జి.ఎ. బలగాలు మంచి పథకంతో సాహసోపేతంగా దాడి చేసి, బీహార్‌లోని లఖిసరాయి జిల్లా కేంద్రం నుండి పట్టపగలు మన పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు కామ్రేడ్ సునిర్మల్‌ను పోలీసు నిర్బంధం నుండి విడిపించారు. కేంద్ర హోంమంత్రి చిదంబరాన్నీ, దోపిడీవర్గాల్ని ఈ ఘటన కలవరపరిస్తే విప్లవ ప్రజల్లో, పార్టీ శ్రేణుల్లో విశ్వాసాన్ని నింపింది.

నాల్గవది– 15వ లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మావోయిస్టు ఉద్యమ ప్రాంతాలలో పెద్ద సంఖ్యలో అన్ని రకాల బలగాల్ని మూడు వారాలపాటు మోహరించినా డీకే, బీహార్, ఝార్ఖండ్‌లలోని అనేక ప్రాంతాల్లో, పశ్చిమ బెంగాల్‌లో లాల్‌గఢ్ మొత్తంగాను, ఇతర జిల్లాలలో కొన్ని ప్రాంతాలలోను, ఒడిస్సాలోని అనేక జిల్లాల్లో రాజకీయ పార్టీల ఊసేలేదు. ప్రజలు స్వచ్ఛందంగానే ఎన్నికలను బహిష్కరించారు. ప్రతీ ఏటా జరిగే 15 వందల కోట్ల ఖరీదైన ప్రజాస్వామ్య ప్రక్రియ అనే ఎన్నికల తంతు అభాసుపాలైతే, మిగిలినచోట్ల బహిర్గతమైపోయింది.

ఐదవది– ఒడిస్సాలోని కందమాల్ మత ఘర్షణలను సృష్టిస్తూ దళిత, ఆదివాసీ ప్రజల్లో, ప్రాంతాల్లో హత్యా రాజకీయాలతో

అల్లకల్లోలం సృష్టిస్తున్న ఆర్.ఎస్.ఎస్. నేత లక్ష్మణానంద సరస్వతిని పి.ఎల్.జి.ఎ. ఖతం చేయడం మైనారిటీలలో, దళితులలో మంచి ప్రభావాన్ని వేసింది. ఆర్.ఎస్.ఎస్. పథకం ప్రకారం చేసిన హింసాకాండనూ, ప్రభుత్వ మద్దతును విస్తృతంగా బహిర్గతపరిచాం.

ఆరవది– బడా బూర్జువా వర్గానికి ఒక కోటి ఎకరాలు భూమిని కట్టబెట్టే అనేక ప్రాజెక్టులకు వ్యతిరేకంగా నిర్వాసిత సమస్యను తీసుకుని ప్రగతిశీల శక్తులతో, విశాల ఐక్యసంఘటనలతో మన పార్టీ ప్రభావంలో బలమైన ఉద్యమాలు నడుస్తున్నాయి. నందిగ్రామ్, సింగూర్, లాల్‌గఢ్, విశాఖ మన్యం, ఒడిస్సాలో పోస్కోకు వ్యతిరేకంగా, ఛత్తీస్‌గఢ్‌లో లోహండిగూడలోని టాటా ప్లాంటుకు వ్యతిరేకంగా, ఉత్తరప్రదేశ్‌లో గంగా ప్రాజెక్టుకు వ్యతిరేకంగా, ఝార్ఖండ్‌లో భారీ మైనింగ్‌కు వ్యతిరేకంగా ఇలానే అనేకచోట్ల మిలిటెంట్ ఉద్యమాలు నడిచాయి. ఇవన్నీ మన ఉద్యమ పురోగమనం సాధించిన విజయాలు.

గత ఏడాది కాలంలో దేశంలోని మావోయిస్టు ఉద్యమ పురోగమనంతో మనం విప్లవ ప్రజానీకంలో విస్తృత స్థాయిలో విశ్వాసాన్ని కల్పించాం. మన దేశం చాలా విశాలమైనది. అనేక పట్టణాలు, మైదాన ప్రాంతాలున్నాయి. ఇక్కడ మన ప్రభావం ప్రస్తుతం తక్కువగా వుంది. పార్టీ కేంద్ర కర్తవ్య నిర్వహణలో భాగంగా దేశవ్యాప్తంగా సాయుధ పోరాటాన్ని అభివృద్ధి చేయడంపై కేంద్రీకరిస్తూనే, అనేక నూతన ప్రాంతాలకు విస్తరించాలని ఈ పార్టీ ఆవిర్భావ దినం సందర్భంగా గుర్తుంచుకుందాం.

వర్గ పోరాటాల్లో ముందుంటూ వాటికి నాయకత్వాన్ని అందిస్తూ, మన పార్టీ ఉజ్వలమైన వారసత్వాన్ని ముందుకు తీసుకుపోదాం. త్యాగాలకు నూతన నమూనాలను అందిద్దాం. నూతన సవాళ్లనూ, బాధ్యతలను భుజాలనెత్తుకోవడానికి ప్రతి ఒక్కరం సన్నద్ధమవుదాం. మన బాట ఎంతో కష్టభూయిష్టమైనదనడంలో సందేహం లేదు. మనం గెలిచి తీరుతాం. అంతిమ విజయం ప్రజలదే.

➡

## లాల్‌గఢ్ ప్రతిఘటన

పశ్చిమ బెంగాల్‌లో వీరోచితంగా జరిగిన నందిగ్రామ్, సింగూర్ పోరాటాలు పార్టీ రాజకీయ ప్రభావాన్ని విస్తృతంగా చాటాయి. సామ్రాజ్యవాద దోపిడీలో భాగంగా దేశవ్యాప్తంగా విస్తరిస్తున్న సెజ్‌లూ, భారీ ప్రాజెక్టులూ, బహుళజాతి కంపెనీల వల్ల నిర్వాసితులవుతున్న ప్రజలకు ఈ పోరాటాలు మార్గదర్శకంగా నిలిచాయి. ఈ వారసత్వాన్ని కొనసాగిస్తూ లాల్‌గఢ్ పోరాటం మరింత ఉన్నత స్థాయిలో సాగింది.

పశ్చిమ మేదినీపూర్ జిల్లాలోని లాల్‌గఢ్ ప్రాంతంలో జిందాల్ కంపెనీ సెజ్‌ను ఏర్పాటు చేయడం కోసం అయిదు వేల ఎకరాల భూమిని సేకరించింది. దీనివల్ల నిర్వాసితులవుతున్న ఆదివాసీ ప్రజానీకం పోరాటం మొదలుపెట్టారు. క్రమంగా ఈ పోరాటం పశ్చిమ మేదినీపూర్, పురూలియా, బంకూరా జిల్లాలకు వ్యాపించి ఒక చారిత్రాత్మక తిరుగుబాటుగా మారింది. సెజ్‌కూ, నిర్వాసిత సమస్యకూ వ్యతిరేకంగా మొదలైన ఈ పోరాటం స్వయంపాలన డిమాండ్‌గా ముందుకు వచ్చింది.

సింగూర్, నందిగ్రాం పోరాటాలపై ప్రయోగించినట్టే ఈ పోరాటంపై అక్కడి సోషల్ ఫాసిస్టు సి.పి.ఐ.(ఎం.) ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించింది. కేంద్ర ప్రభుత్వ మద్దతుతో అర్ధసైనిక, రాష్ట్ర పోలీసు బలగాలనూ, శాటిలైట్ సమాచార వ్యవస్థను, అత్యాధునిక ఆయుధాలను, మైన్ ప్రూఫ్ వాహనాలను వుపయోగించుకొని పెద్ద ఎత్తున దాడులకు దిగి వారం రోజులపాటు యుద్ధ వాతావరణాన్ని సృష్టించింది. న్యాయపోరాటం చేస్తోన్న సంతాలీ ఆదివాసీలను వేల సంఖ్యలో నిర్బంధ శిబిరాలకు తరలించింది. ఎక్కడ విప్లవోద్యమాలు బలంగా ముందుకు వచ్చినా పాలకవర్గాలు ఇటువంటి పాశవిక అణచివేతకే పాల్పడుతున్నాయి. అయితే ఎంత దమనకాండను ప్రయోగించినా అవి ఉద్యమాలను తాత్కాలికంగా మాత్రమే అణచిపెట్టగలవని చరిత్ర రుజువు చేస్తూనే వుంది.

ఇంత నిర్బంధంలోనూ పి.ఎల్.జి.ఎ. సాధించిన ఎన్నో విజయాలు ఎత్తిపట్టతగినవి. కాంగ్రెస్ విజయవంతం కాగానే గెరిల్లా యుద్ధాన్ని మొబైల్ యుద్ధంగా అభివృద్ధి చేయాలనే లక్ష్య సాధనలో డికెలోని రాణీబోధిలి పోలీస్ క్యాంపుపై పి.ఎల్.జి.ఎ. చేసిన దాడి ప్రతిఘటనా చరిత్రలో మైలురాయి వంటిది. ఇదే ఒరవడిని కొనసాగిస్తూ డికెలో ఉర్పల్‌మెట్ట, తాడిమేంద్ర, మర్కగావ్, మదన్‌వాడ తదితర మరెన్నో దాడులు; బీహార్ ఝార్ఖండ్‌లలో ఝా ఝా రైల్వే స్టేషన్ పైనా, రాంచీ టాటానగర్ జాతీయ రహదారిపై ఐ.సి.ఐ.సి.ఐ. వాహనంపైనా చేసిన దాడులు; ఎ.పి.లో తీవ్ర నిర్బంధంలోనూ జనార్ధన్ రెడ్డిపై చేసిన ఆంబూష్; ఎ.ఒ.బి.లో తమకు ఎదురులేరని విర్రవీగిన గ్రేహౌండ్స్ బలగాలను చావుదెబ్బతీసిన బలిమెల ఘటనా, ఒడిస్సా పోలీసులను మట్టికరిపించిన తెల్లరాయి ఘటనా; వివిధ రాష్ట్రాల గెరిల్లా బలగాల సమన్వయంతో విజయవంతం చేసిన

***(43వ పేజీ తరువాయి...)***

### చైనా విప్లవ విజయానికి అరవై ఏళ్లు

# అక్టోబర్ సోషలిస్టు విప్లవ వార్షికోత్సవాన్ని జరుపుకుందాం!

*భారత విప్లవోద్యమ విజయానికి ప్రజా విముక్తి సైన్యాన్నీ, విముక్తి ప్రాంతాలను అభివృద్ధి చేద్దాం!!*

1949 అక్టోబర్ 1న మావో–సే–టుంగ్ చైనా ప్రజా రిపబ్లిక్ ఆవిర్భావం సందర్భంగా "47 కోట్ల 50 లక్షల' చైనా ప్రజలు ఠీవిగా నిలబడ్డారు. మన దేశ భవిష్యత్ అత్యంత ఉజ్వలంగా వుంది" అని ప్రకటించారు. చైనా ప్రజల రాజకీయ సంప్రదింపుల సమావేశం విడుదల చేసిన ప్రకటనను వివరించారు. బీజింగ్‌ను చైనా ప్రజా రిపబ్లిక్‌కు రాజధానిగా నిర్ధారించారు. 'ఎరుపు భూమికపై ఐదు నక్షత్రాలు హత్తిన పతాకాన్ని' జాతీయ పతాకంగా, 'వాలంటీర్ల పురోగమన గీతాన్ని' జాతీయ గీతంగా గుర్తించారు. ఇప్పుడు చైనా ప్రజలకు స్వంత కేంద్ర ప్రభుత్వం వుంది. వుమ్మడి కార్యక్రమానికి అనుగుణంగా ప్రజాస్వామిక నియంతృత్వాన్ని అమలు చేస్తుంది. అది ప్రజల ప్రయోజనాలను సంరక్షించి, విప్లవ ప్రతీఘాతకుల కుట్రలన్నింటిని కాలరాచివేస్తుందన్నారు.



96 లక్షల చదరపు కిలోమీటర్ల భూభాగం కలిగి, ప్రపంచ మానవాళిలో నాలుగో వంతుగా వున్న చైనా ప్రజలు సాధించిన ఈ విజయం మానవజాతి చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడింది. గొప్ప ధైర్యసాహసాలతో శ్రమించి పనిచేసే చైనా జాతి ప్రజలు ప్రజావిమోచనా యుద్ధం, ప్రజా విప్లవం ద్వారా దేశీయ, విదేశీయ పీడకులకు వ్యతిరేకంగా పోరాడి గెలిచారు. తమ స్వంత నాగరికతనూ, సంక్షేమాన్ని పెంచి పోషించుకోవడానికీ, అదే సమయంలో ప్రపంచ శాంతినీ, స్వేచ్ఛను పెంపొందించడానికి అప్రమత్తత ఏమాత్రం సడలకుండా కృషి చేశారు. చైనా ప్రజలకు అపారమైన అనుభవం వుంది. సాదా సీదా జీవనం, కఠోరమైన శ్రమ, సాహస పోరాటాలతో కూడిన శైలికి అంటిపెట్టుకుని వున్నారని, ఐక్యంగా నిలిచి వున్నారని, జనతా ప్రజాస్వామిక నియంతృత్వానికి దృఢంగా కట్టుబడి వున్నారని, విదేశీ మిత్రులతో ఐక్యమై వున్నారని అన్ని రంగాల్లో అతి వేగంగా విజయం సాధించారని చైనా విప్లవ విజయగాథ చెబుతుంది. ప్రజావీరులకు శాశ్వత యశస్సు చేకూరింది అని చైనా అక్టోబర్ విప్లవ దినాన కామ్రేడ్ మావో శ్లాఘించారు.

రెండు వేల సంవత్సరాల భూస్వామ్యం, వందల సంవత్సరాల వలస దోపిడీ పీడనలకు వ్యతిరేకంగ చైనా ప్రజలు పోరాడారు. చారిత్రాత్మక (12 వేల 500 కి.మీ) లాంగ్ మార్చ్ లాంటి సాహసకృత్యాలతో దారి పొడుగునా విప్లవ బీజాలు నాటారు. యేనాన్ పర్వత ప్రాంతంలో విప్లవ కేంద్రం చేసిన కృషి చైనా విప్లవ విజయానికే కాదు ప్రపంచ విప్లవ పురోగమనానికి మార్గదర్శిగా నిలిచింది. సామ్రాజ్యవాదానికీ, భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా జరిగిన శక్తివంతమైన ప్రజాస్వామిక విప్లవోద్యమం చైనాలో కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావానికి దోహదం చేసింది. యుద్ధ ప్రభువుల పాలనను కూలదోసి చైనా రిపబ్లిక్‌ను ఏర్పర్చడానికి సన్‌యెట్‌సేన్ చేసిన ప్రయత్నాలూ, 1918 మే 4 వుద్యమంలో విద్యార్థులు రగిలించిన దేశవ్యాప్త తిరుగుబాటు ప్రజాస్వామిక చైతన్యాన్ని పెంపొందించాయి. ఉత్తర దండయాత్ర ఓడిపోవడం, కొమింటాంగ్ చైనా విప్లవానికి ద్రోహం చేయడం, పట్టణాలలో సార్వత్రిక తిరుగుబాటు ఎత్తుగడల (సెక్టేరియన్) దుష్ఫలితాల నుండి తీసిన గుణపాఠాల వెలుగులో కామ్రేడ్ మావో వెనుకబడిన దేశాలలో విప్లవానికి నూతన అవగాహనను పెంపొందించాడు. అదే నూతన ప్రజాస్వామిక విప్లవం. దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథా. అవి మార్క్సిస్టు ఆయుధాగారానికి గొప్ప కానుకలు.

చైనాలో రష్యన్ పంథాను యాంత్రికంగా అన్వయించకూడదని అర్థమయ్యింది. 1917 రష్యన్ అక్టోబర్ విప్లవానికి ముందు జరిగిన భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలన్నీ బూర్జువా ప్రజాతంత్ర విప్లవానికి చెందినవి. 1917 రష్యన్ విప్లవం తర్వాత అవి ప్రపంచ సోషలిస్టు విప్లవంలో భాగం. లెనిన్ చెప్పిన 'రెండంచెల విప్లవం' భావనకు కా. మావో శాస్త్రీయ రూపాన్ని ఇచ్చి 'నూతన ప్రజాస్వామికం' అనే భావనను అభివృద్ధి చేశాడు. మొదటి దశ విప్లవానికి జాతీయ బూర్జువా వర్గం నాయకత్వం వహిస్తే, రెండవ దశ విప్లవానికి కార్మికవర్గమే నాయకత్వం వహించి తీరాలన్నాడు. బూర్జువా వర్గం రెండు శిబిరాలుగా చీలిపోయిందనీ, అందులో దళారీ బూర్జువా వర్గం విప్లవానికి లక్ష్యం (శత్రువు)గా మారితే, జాతీయ బూర్జువా వర్గం విప్లవానికి మిత్రుడని చెప్పాడు. రైతాంగం ప్రధాన శక్తిగా, కార్మికవర్గం చోదకశక్తిగా నాలుగు వర్గాల

ఐక్యతతో విప్లవాన్ని నిర్మించాలని చెప్పాడు. వెనుకబడిన దేశాలలో విప్లవ మార్గాన్ని 'దీర్ఘకాల ప్రజాయుద్ధ' మార్గంగా, గ్రామీణ ప్రాంతాలలో స్థావర ప్రాంతాలను ఏర్పరచి, దశలవారీగా పట్టణాలను చుట్టుముట్టడానికి సంబంధించిన రైతాంగ గెరిల్లా యుద్ధతంత్రాన్నీ, వ్యూహాన్ని అభివృద్ధి చేశాడు. ఆవిధంగానే చైనాలో నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతం అయ్యింది. చైనా విప్లవం విజయవంతం కావడంలో కామ్రేడ్ మావో నాయకత్వ పాత్ర ఎన్నదగినది. చైనా ప్రజలు సామ్రాజ్యవాదం, భూస్వామ్య విధానం, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానాల దుష్ట పాలనను ధ్వంసం చేసి, నూతన ప్రజాస్వామిక రాజకీయ, ఆర్థిక వ్యవస్థలను దాని స్థానంలోకి తెచ్చారు. యుద్ధం వలన ధ్వంసం అయిన ఆర్థిక వ్యవస్థను పునర్ నిర్మించి, గ్రామీణ ప్రాంతాలలో భూసంస్కరణలను అమలు చేస్తూనే, ప్రభుత్వ, ప్రయివేట్ యాజమాన్యాల ఉమ్మడి పరిశ్రమలను పునరుద్దరించడంతో 1953 నాటికి ఆర్థిక వ్యవస్థ పట్టాల మీదకు నడిచింది. వ్యవసాయ సమీష్టికరణ, పరిశ్రమ, వాణిజ్యాలను క్రమంగా ప్రభుత్వ ఆధీనంలోకి తేవడం ద్వారా 1956 నాటికి ఉత్పత్తి సాధనాలు ప్రధానంగా సోషలిస్టు యాజమాన్యంలోకి మారాయి. గ్రామీణ ప్రాంతాలలో కమ్యూన్ల ఏర్పాటు, పరిశ్రమలు కార్మికుల అజమాయిషిలోకి తీసుకురావడం, బూర్జువా హక్కును పరిమితం చేయడంతో 1958 ప్రారంభం నుండి సోషలిస్టు వ్యవస్థను సంఘటితపరిచే క్రమం ప్రారంభమయింది.

ఇది సులభంగా జరగలేదు. ఈ క్రమమంతా తీవ్ర వర్గపోరాటాల ఫలితమే. పాత సమాజ అవశేషాలు, చిన్న స్థాయి సరుకుల వుత్పత్తి విధానం ద్వారా పుట్టుకొచ్చే నూతన బూర్జువా వర్గం, తప్పుడు భావాలు, అలవాట్లు, ఆచారాలు, సంస్కృతులతోపాటు రివిజనిస్టు పెడధోరణులు ఇలా అనేక అంశాలపై వివిధ కోణాల నుండి వర్గ పోరాటం జరిగింది. పునాది-ఉపరితలాల మధ్య వున్న గతితార్కిక సంబంధాన్ని గుర్తించి పునాదిని మార్చడంలో ఉపరితల ప్రాధాన్యతకు అనుగుణంగా వర్గ పోరాటాన్ని నిశితం చేశారు. వ్యవసాయాన్ని పునాదిగా, పరిశ్రమలను ప్రధానాంశంగా ఆర్థిక సూత్రాన్ని రూపొందించారు. సాంకేతిక జ్ఞానాన్ని రైతాంగం వద్దకు తీసుకుపోయారు. సాంస్కృతిక విప్లవాన్ని కార్మికవర్గ నాయకత్వంలో ముందుకు నడిపించారు. వర్గ పోరాటమే కీలకమని గుర్తించి కొనసాగించారు.

వెనుకబడిన ఉత్పత్తి శక్తులకు, పురోగమించిన ఉత్పత్తి సంబంధాలకు మధ్యనే ప్రధానమైన వైరుధ్యం అన్న లీషావ్‌చీ వుత్పత్తి శక్తుల రివిజనిస్టు సిద్ధాంతాన్ని ఓడించి, కమ్యూనిస్టు పార్టీలోనే వున్న బూర్జువా కేంద్రాలపై దృష్టి పెట్టి ప్రజా పంథాలో పోరాడారు. కార్మికవర్గానికి-రైతాంగానికీ, పట్టణాలకు-గ్రామాలకు, మానసిక-శారీరక శ్రమలకు మధ్యనున్న మూడు ప్రముఖ వైరుధ్యాలను పరిష్కరించేందుకు విశేషంగా కృషి చేశారు. బూర్జువా హక్కును పరిమితం చేయడం, విలువ సూత్రాన్ని రద్దు చేయడం లాంటి అంశాల పరిష్కారానికి మార్గం వేశారు. విప్లవాన్ని గుర్తించి ఉత్పత్తిని పెంచడం, రాజకీయాలను ఆధిపత్యంలో వుంచడం, వర్గపోరాటాన్ని నిరంతరం చేపట్టడం, స్వార్థంతో పోరాడడం, రివిజనిజాన్ని తిరస్కరించడం అనే మావో బోధనలు ప్రజల నిత్య కార్యాచరణలో అద్భుతమైన ఫలితాలనిచ్చాయి.

చైనాలోనే కాకుండా అంతర్జాతీయంగా కూడా కమ్యూనిస్టు వుద్యమాన్ని కృశ్చేవ్ నాయకత్వంలోని ఆధునిక రివిజనిజం ముంచెత్తినప్పుడు కా. మావో, చైనా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం దృఢంగా నిలిచి పోరాడారు. గ్రేట్ డిబేట్ పేరుతో జరిగిన చర్చ అంతర్జాతీయంగా మార్క్సిజాన్ని ఎత్తిపట్టి రివిజనిజాన్ని తుత్తునియలు చేసింది. మార్క్సిస్టు సిద్ధాంతాన్ని అభివృద్ధి చేయడంలో చైనా అనుభవం గొప్పది. తత్వశాస్త్రంలో వైరుధ్య సూత్రాన్నీ, జ్ఞాన సిద్ధాంతాన్ని అభివృద్ధి చేసి తత్వశాస్త్రం మాయాజాలంకాదనీ, ప్రజల చేతుల్లో తాత్విక ఆయుధమని నిరూపించారు. సోవియట్ ఆర్థిక వ్యవస్థపై చేసిన విమర్శల ద్వారా సోషలిస్టు అభివృద్ధికి శాస్త్రీయతను కల్పించింది. చైనా విప్లవ పోరాట క్రమంలో పార్టీ నిర్మాణం, పని పద్ధతులు, ఎత్తుగడలు, సైనిక వ్యూహాలు ప్రజల మధ్య విస్తృతంగా చర్చించి విజయసాధనకు ప్రజలను సంసిద్ధపరిచి బలమైన శత్రువుతో పోరాడి గెలిచేందుకు మార్గదర్శకత్వం అందించారు. ప్రపంచానికి మార్గదర్శులయ్యారు.

భారత దేశంలో జరిగే నూతన ప్రజాస్వామిక విప్లవానికి చైనాలో విజయవంతమైన అక్టోబర్ సోషలిస్టు విప్లవం ఎంతో స్ఫూర్తినిచ్చింది. ఆ తర్వాత జరిగిన గొప్ప సాంస్కృతిక విప్లవ ప్రభావంతో నక్సల్బరీ, శ్రీకాకుళ ఉద్యమాలు బద్దలయ్యాయి. మార్క్సిస్టు-లెనినిస్టు పార్టీ ఏర్పడి, దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాను గెరిల్లా యుద్ధ వ్యూహాన్ని చేపట్టి పురోగమిస్తున్నది. ప్రజా గెరిల్లా సైన్యాన్ని ప్రజా విముక్తి సైన్యంగా, గెరిల్లా జోన్‌లను విముక్తి ప్రాంతాలుగా అభివృద్ధిచేసే క్రమంలో భారత విప్లవోద్యమం చైనా అక్టోబర్ సోషలిస్టు విప్లవం నుండి ఎంతో నేర్చుకోవలసి వుంది. అలాగే కామ్రేడ్ మావో మరణానంతరం చైనాలో పెట్టుబడిదారీ విధానం పునరుద్ధరణకుగల కారణాలను శాస్త్రీయంగా అర్థం చేసుకొని అటువంటి ప్రమాదం ఎడల జాగరూకతను కలిగివుంటూ భారత విప్లవాన్నీ, సోషలిస్టు సమాజ నిర్మాణాన్ని చేపట్టవలసి వుంటుంది.

**అక్టోబర్ సోషలిస్టు విప్లవం చిరకాలం వర్థిల్లుతుంది.**

★

92 రూ. కందిపప్పు, 30 రూ. బియ్యం, 60 రూ. చింతపండు, 100 రూ. వంటనూనెలతో

# "మార్కెట్‌లో ధరలు మండిపోతుంటే ప్రభుత్వం ఏం చేస్తుంది? నిద్రపోతుందా?"

ఈ మాటలన్నది సామాన్య ప్రజలు. బడ్జెట్‌పై ప్రజల స్పందన ఇది.

గత సంవత్సరం పంట దిగుబడి పెరిగిందనీ, గోడౌన్స్‌లో సరుకు నిల్వలున్నాయనీ, ద్రవ్యోల్బణం గణనీయంగా తగ్గిపోయిందని ప్రభుత్వం గణాంకాలతో చూపించి 13 నెలల వరకు సమస్య లేదని నమ్మబలికింది. కేంద్ర ప్రభుత్వం దేశ ఆర్థిక అభివృద్ధి రేటును 9 శాతంగా చూపింది. 13 శాతం వున్న ద్రవ్యోల్బణం–1.55కు తగ్గి ప్రతి ద్రవ్యోల్బణం నవోదయినట్లు చెప్పింది. రాష్ట్రంలో వ్యవసాయోత్పత్తులు బాగా అభివృద్ధి చెందాయని, వరుణుడు రాజశేఖర్ రెడ్డి పక్షానే ఉన్నాడని, అపర భగీరథుని జలయజ్ఞం, రైతు ప్రభుత్వం విధానాల కారణంగా వ్యవసాయంలో గణనీయమైన మార్పు వచ్చిందని చెప్పుకున్నారు. 93 శాతం సాధారణ వర్షపాతాన్ని, ప్రభుత్వం దగ్గర ఐదున్నర కోట్ల టన్నుల ఆహార ధాన్యాల నిల్వలను గొప్పగా చెప్పారు. ఇంకా వివరాలు ఇస్తూ అందులో రెండున్నర కోట్ల టన్నుల గోధుమలు, మూడు కోట్ల టన్నుల బియ్యం వున్నాయన్నారు. ఇవిగాక సీజ్ చేసుకున్న ధాన్యం, బియ్యం 1.5 లక్షల టన్నుల గోడౌన్స్‌లో ముర్గిపోతున్నాయనీ, ఇంకా సీజ్ చేసుకున్న కొన్ని వేల మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాలు, వేల కోట్ల రూపాయల విలువైన సరుకులు కోర్టు వివాదాల్లో నలుగుతున్నాయని వివరించారు. ఇవన్నీ నిజాలే. అసలు విషయం మార్కెట్‌లోకి ఇది రాకుండా అడ్డుపడిన అంశాలు ఏమిటి? ధరల నియంత్రణకు ప్రభుత్వం ఎందుకు పూనుకోవడంలేదు?

ఆకలి, దారిద్ర్యం, అనారోగ్యాలతో ప్రజలు చావుబతుకుల మధ్య అల్లాడుతున్నారు. భారతదేశ జనాభా 115 కోట్లు దాటిపోయింది. ఇందులో 60 శాతం దారిద్ర్యరేఖకు దిగువన వున్నారు. వేళ్ల మీద లెక్కపెట్టే కొద్దిమంది కుబేరులయ్యారు. మన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సంక్షేమాన్ని గురించి పట్టించుకొని బి.పి.ఎల్. కార్డులను రెండు కోట్ల మందికి ఇచ్చారు. 3 రూపాయలకు కిలో బియ్యం చొప్పున 25 కిలోలు ఇవ్వడానికి హామీలు ఇచ్చారు. ధరలు పెరగడంతో రేషన్ బంద్‌పెట్టి, రేషన్ కార్డులు ఏరివేశారు. సబ్సిడీలిస్తామన్నారు. ఉన్న సబ్సిడీలకు కోతపెట్టారు. భారత ఆహార సంస్థ (ఎఫ్.సి.ఐ.) కొనుగోళ్లు తగ్గించారు. ఉపాధి పథకాల గురించి చర్చించి నాలుగు కోట్ల మందికి (మిగిలిన వారిని పోటీకి నిలబెట్టి) 100 రోజులు పని కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధంచేసి, ఆ డబ్బులన్నీ అవినీతిలో పగడ్బందీగా తినేసి ప్రచారంలో పేదరికం నిర్మూలించేసినట్లు చెప్పుకున్నారు. ఆహార భద్రత గురించి రాష్ట్రపతి, ఆర్థికాభివృద్ధి 9 శాతంకు తిరిగి చేరాలని ప్రధానమంత్రి చెప్పినట్లుగా కేంద్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు మాంటెక్‌సింగ్ అహ్లువాలియా ప్రకటించాడు. 2009–10 బడ్జెట్‌కు ముందే అది జనాకర్షక బడ్జెట్ అని ప్రపంచ ఆర్థిక సంక్షోభం ప్రభావం ప్రత్యక్షంగా భారతదేశంపై ప్రభావాన్ని చూపి, దేశ ఆర్థికాభివృద్ధి 6.7 శాతానికి తగ్గిపోయినా ప్రత్యేక సంక్లిష్ట, సంక్షుభిత పరిస్థితుల్లో కూడా ఆర్థిక మంత్రి గొప్ప నైపుణ్యంతో "ప్రపంచ బ్యాంకు రూపొందించిన" బడ్జెట్‌ను సిద్ధం చేస్తున్నారని ప్రకటించాడు. అయినాగాని 9 శాతం అభివృద్ధి కోసం రెండేళ్లు ఆగాలన్నాడు. ద్రవ్యోల్బణాన్ని తగ్గించడం కోసం కుస్తీలుపట్టిన రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ సి.రంగరాజన్ మరోచోట మాట్లాడుతూ ధరలు తగ్గించడం రిజర్వ్ బ్యాంకు వల్ల కుదిరే పనికాదని తేల్చి చెప్పాడు. ఐ.ఎం.ఎఫ్‌కి సి.ఇ.ఒ.లుగా పనిచేసిన మన్మోహన్‌సింగ్, చిదంబరం, మాంటెక్సింగ్ అహ్లువాలియాలు, ప్రపంచ బ్యాంకు ఏజెంట్లుగా పనిచేస్తున్న మన పాలకులు తిమ్మిని బొమ్మిచేసి ఎలాగైనా చెప్పగలరు. ప్రపంచమంతా కొనుగోలు సూచికనుబట్టి ద్రవ్యోల్బణాన్ని లెక్కిస్తారు. బహుచిత్రంగా భారతదేశంలో మాత్రం టోకు ధరల సూచికనుబట్టి ద్రవ్యోల్బణాన్ని లెక్కిస్తున్నారు. అందుకే ద్రవ్యోల్బణం ఎంత తగ్గినా ధరలు పెరుగుతూనే వున్నాయి. వాస్తవంలో దారిద్ర్యం కారణంగా ఆకలి, అనారోగ్య మరణాలు తగ్గలేదు. రోజు రోజుకు మరింతగా పెరిగాయి. అంతర్జాతీయ విపణిలో శ్రమను అమ్ముకోవడానికి కడుపుకు కాళ్లుకట్టుకొని వలసపోతూ, ఒళ్లు అమ్ముకుంటున్న వాస్తవ స్థితిని దాచలేక దేశ ప్రగతి సిగ్గుతో కలవలపడుతోంది.

అవినీతి, అసమర్థపాలన, అక్రమ నిల్వలు, స్పెక్యులేషన్ మార్కెట్ విస్తరించి నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతున్నాయి. వీటికితోడు ఆహార ధాన్యాల దిగుమతులపై ఆధారపడడం పెరిగిపోయింది. అంతర్జాతీయ కార్పోరేషన్‌ల గుప్పెట్లో నిత్యావసర వస్తువులతోపాటు కోట్ల ప్రజల జీవితాలు నలిగిపోతున్నాయి. 1991 నూతన ఆర్థిక

సంస్కరణల ఫలితంగా భారతదేశంలో వ్యవసాయ రంగం సంక్షోభంలోపడి రైతు నడ్డి విరిగి దేశంలో మూడున్నర లక్షల మంది రైతాంగం ఆత్మహత్యలు చేసుకున్నారు. సబ్సిడీలు తగ్గడం, సంక్షేమం కుంటుపడడం, ప్రయివేటీకరణ కారణంగా నిరుద్యోగం పెరిగి వుపాధిలేక, వ్యవసాయం గిట్టుబాటుకాక, చేతి వృత్తులు దెబ్బతిని, చిన్న వ్యాపారులు దివాళాతీసి, మధ్యతరగతి బతుకులు త్రిశంకు స్వర్గంగా మారితే ధరలు గుర్రాలెక్కి స్వారీ చేసాయి. ఆకాశంలో చుక్కలతో చెలిమి చేశాయి. తారల్లా మెరవకుండా గుంటూరు మిరపకాయల్లా భగ్గున మండాయి. ఏ వస్తువుకు ఆ వస్తువే ఓ కథగా, కందిపప్పు విషయం ఓ కావ్యంగానే పేపర్ల పతాకశీర్షికల్లో, సంపాదకీయాల్లో, విశ్లేషణా వ్యాసాల్లో ప్రవహించీ ప్రవహించి ఆదివాసీ బాలల హాస్టల్స్‌లో, మధ్యాహ్న భోజన పథకంలో సాంబారు పేరున పప్పులేని పసుపు నీళ్లుగా మారి హృదయాలను ద్రవింపచేస్తోంది. 2/3 వంతు పిల్లలు పోషకాహార లోపంతో వున్నారంటే ఆశ్చర్యపోవాల్సింది ఏముంటుంది.

### ఏం కొనక ఏం తినక బతుకెట్లాసాగేది, మనిషెట్లా బతికేది

2004 నుండి 2009 వరకు పెరిగిన ధరలను నమూనా కోసం చూద్దాం (నిత్యావసరాల్లో కొన్ని)

| | 2004 | 2005 | 2006... | 2009 |
|---|---|---|---|---|
| బియ్యం | 13 | 18 | 21 | 39 |
| చింతపండు | 20 | 40 | 50 | 54 |
| కందిపప్పు | 20 | 29 | 36 | 92 |
| పల్లినూనె | 43 | 46 | 58 | 100 |
| చెక్కెర | 13 | 19 | 22 | 26 |
| మిరపకాయలు | 24 | 40 | 60 | 60 |

పైన చెప్పిన సరుకులన్నీ రెండు నుండి 5 రెట్లు పెరిగాయి. 400 శాతం వరకు పెరిగాయి. కిరోసిన్, వంట గ్యాస్, సబ్బులు, ఉల్లిపాయలు, కూరగాయలు ఇలాంటివన్నీ 200 శాతంకు పైగానే పెరిగాయి. ఎఫ్.సి.ఐ, జి.సి.సి. కొనుగోళ్లను ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు ఆదేశాలమేరకు పరిమితం చేసింది. దళారీ వ్యాపారులు, కార్పోరేట్ సంస్థలు (విదేశీ–కార్గిల్, పిల్స్‌బరి, ఐ.టి.సి., ఆగ్రోటెక్ లాంటివి; స్వదేశీ–బిగ్‌బజార్, స్పెన్సర్, రిలయన్స్, మోర్ లాంటివి) అమ్మకాలు కొనుగోళ్లపై పట్టు కలిగి ఫార్వర్డ్ ట్రేడింగ్ ద్వారా సరుకుల్ని ముందే కొనేసి తమ ఆధీనంలోకి తెచ్చుకున్నాయి. కృత్రిమ కరువు సృష్టించి స్పెక్యులేషన్‌తో ధరలు విపరీతంగా పెంచేసి ప్రజల జీవితావసరాలతో (జీవితాలతో) జూదం ఆడుకుంటూ కుబేరులైపోతున్నారు. మన దేశంలో ఎన్.డి.ఎ., యు.పి.ఎ. ప్రభుత్వాల కాలంలో ఆహార ధాన్యాల ఉత్పత్తిని ఒక పథకం ప్రకారం నిరుత్సాహపరచిన ప్రపంచ బ్యాంకు దిగుమతులను ప్రోత్సహించి ప్రపంచ వాణిజ్య సంస్థ విధానాలకనుగుణంగా మనల్ని ఒక పావును చేసి ఆడిస్తోంది. సామ్రాజ్యవాదుల కనుసన్నల్లో నడిచే రాజకీయ, ఆర్థిక వ్యవస్థలున్నంతకాలం వాటి మధ్యనున్న సంబంధాలు విచ్ఛిన్నం కానంతవరకు ధరలు పెరగడమే కాని తగ్గడం సాధ్యంకాదని స్పష్టం అవుతోంది. దీనికితోడు సామ్రాజ్యవాద దేశాల్లో ఇథనాల్ (బయోడీజిల్) తయారు చేయడానికి కోట్ల టన్నుల ఆహార ధాన్యాలు వాడుతున్నారు. ఆహార ధాన్యాల కొరతకు ఇదో పెద్ద కారణం కాబోతున్నది.

ప్రభుత్వ నిర్లక్ష్యం, దళారీతనంతో ఎస్.ఇ.జడ్.లకు అనుకూలంగా భూములు కేటాయించడం కారణంగా సాగునీరు, విద్యుత్ సరఫరా లాంటి సమస్యలుతోడై వ్యవసాయ భూముల విస్తీర్ణం తగ్గిపోయింది. వ్యాపార పంటలదిక్కు పరుగులు పెట్టి అప్పుల దెబ్బకు, గిట్టుబాటు ధరలేక కుప్పకూలిపోతే ప్రభుత్వం నిర్లక్ష్యంగా చూస్తుండిపోయింది. రాష్ట్రంలో వేరుశనగ 26.04 లక్షల మెట్రిక్ టన్నుల పంటతో దేశంలోనే రెండవదిగా నిలిచింది. పొద్దు తిరుగుడు బాగా పండింది. కానీ గిట్టుబాటు ధరలేక పంట విస్తీర్ణం తగ్గిపోయింది. తాండూరు కందిపప్పుకు మంచి పేరు. క్వింటాలు కందులు 1700–2500 రూపాయలకు రైతులు అమ్ముకున్నారు. వాటినే వ్యాపారులు 6 వేల నుండి 7 వేల రూపాయలకు అమ్ముకుంటున్నారు. అమ్మబోతే అడవి కొనబోతే కొరివి అన్న విధంగానే వుందిది. అలా తాండూరు కందిపప్పు దిగుబడి 3 లక్షల టన్నుల నుండి 1.5 లక్షల టన్నులకు తగ్గింది. కంది ధర గురించి అడిగితే ముఖ్యమంత్రి 3 నెలలు ఆగమన్నాడు. ఈ లోపల విత్తనాలు సరఫరా చేస్తానన్నాడు. విత్తనాలకు సబ్సిడీ 75 శాతం ఇచ్చి మద్దతు ధర 3,500 రూపాయలకు పెంచుతానని 'హాస్యా'లాడుతున్నాడు. గొంతెండిపోతుంటే బావి తవ్వడం లాంటి పని చేస్తుందీ ప్రభుత్వం. మార్కెట్ మాయాజాలం, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రైతులకు ఏదీ గిట్టుబాటుకాక అటు ఇటు పరుగులు తీస్తూ ఒక స్థిరమైన విధానాన్ని అనుసరించలేకపోతున్నారు. అందుకే ఆహార ధాన్యాలు, వంట నూనెలు, పప్పుదినుసులు, పాలు, మాంసం, గుడ్లు, చెక్కెర, కూరగాయలు, మిరపకాయలు, అన్ని రకాల ఉత్పత్తులు బాగా తగ్గిపోయాయి. వ్యవసాయ ఖర్చులు పెరిగాయి, ఉత్పత్తిదారుల్ని మార్కెట్ మోసం చేసింది. సామాన్యుల బతుకులు గాలిలో రెప రెపలాడడం కనబడుతుంది. అధికార కాంగ్రెస్‌కు మనీప్లూ, ప్రతిపక్ష

*(మిగిలాది 41వ పేజీలో...)*

రెక్టిఫికేషన్ క్యాంపెయిన్‌లో భాగంగా అధ్యయనం కోసం - 5

# అధ్యయన పద్ధతుల్ని

**(యేనాన్‌లో కేడర్ల సమావేశంలో కామ్రేడ్ మావో-సే-టుంగ్ ఈ నివేదికను సమర్పించారు. ఈ నివేదికకాక, "పార్టీ పని విధానాన్ని సరిదిద్దండి," "మూస పార్టీ రచనా పద్ధతిని వ్యతిరేకించండి" అన్న రెండు వ్యాసాలూ కూడా సరిదిద్దుడు వుద్యమంపై కామ్రేడ్ మావో-సే-టుంగ్ రాసిన మౌలిక రచనలే. వీటిలో ఆయన పార్టీ పంథాపై పార్టీలో గతంలో వున్న విబేధాలను సైద్ధాంతిక స్థాయిలో క్లుప్తీకరించారు. అంతేకాక, మార్క్సిజం-లెనినిజం పేరుతో పార్టీలో ప్రబలంగా వున్న పెటీబూర్జువా సిద్ధాంతాన్నీ, పద్ధతిని అవి ప్రధానంగా స్వీయాత్మక ఒంటెత్తు ధోరణులుగా వ్యక్తమవడాన్ని, మూస పార్టీ రచనా పద్ధతి రూపంలో వ్యక్తమవడాన్ని కూడా విశ్లేషించారు. మార్క్సిజం-లెనినిజం సైద్ధాంతిక సూత్రాలకు అనుగుణంగా పని విధానాన్ని సరిదిద్దుకునేలా పార్టీ అంతటా మార్క్సిస్టు-లెనినిస్టు శిక్షణను ఉద్యమంగా చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఆ పిలుపు త్వరలోనే పార్టీ లోపలా, బయటా కార్మికవర్గ సిద్ధాంతానికి, పెటీబూర్జువా సిద్ధాంతానికి మధ్య మహత్తర చర్చకు దారితీసింది. అంతేకాక, వివిధ శ్రేణుల కేడర్లు సైద్ధాంతికంగా పెద్ద ముందడుగు వేయడానికి, పార్టీ ముందెన్నడూ సాధించని ఐక్యతను సాధించడానికి అది వీలుకల్పించింది.)**

పార్టీ అంతటా మన అధ్యయన విధానాన్నీ, పద్ధతుల్ని సంస్కరించుకోవాలని నేను ప్రతిపాదిస్తున్నాను. దానికి కారణాలు ఇవి:

**1**

మార్క్సిస్టు-లెనినిస్టు విశ్వజనీన సత్యాన్ని చైనా విప్లవ నిర్దిష్ట ఆచరణతో ఆనాటికానాటికి సమైక్యంచేసిన చరిత్రే చైనా కమ్యూనిస్టు పార్టీ గత ఇరవయ్యేళ్ల చరిత్ర. మన పార్టీ శైశవ దశలో మార్క్సిజం-లెనినిజం గురించి, చైనా విప్లవం గురించి మనకున్న అవగాహన ఎంత తక్కువో, ఎంత మిడిమిడి జ్ఞానమో ఒక్కసారి గుర్తుకు తెచ్చుకుంటే, అది ఇప్పుడెంత లోలోతులకుపోతూ వృద్ధి చెందుతోందో చూడగలం. గత వంద సంవత్సరాలుగా అస్తవ్యస్థమయిన చైనా దేశపు ఉత్తమోత్తమ పుత్రీపుత్రులు దేశంకోసం పోరాడుతూ తమ ప్రాణాలను త్యాగం చేశారు. ఒకరులేని లోటును మరొకరు తీరుస్తూ, వారు తమ దేశాన్నీ, ప్రజల్ని రక్షించే, విముక్తిచేసే మార్గాన్ని అన్వేషించారు. ఇది మనకో సంతోషాన్నీ, విషాదాన్ని కలిగిస్తుంది. కానీ మన జాతిని విముక్తి చేసుకోవడానికి అవసరమైన అత్యుత్తమ ఆయుధమూ, వాస్తవమూ అయిన మార్క్సిజం-లెనినిజాన్ని మొదటి ప్రపంచ యుద్ధానంతరం, రష్యా అక్టోబర్ విప్లవానంతరం మాత్రమే కనుగొన్నాం. ఈ ఆయుధాన్ని ప్రయోగించడంలో చైనా కమ్యూనిస్టు పార్టీ చొరవ తీసుకొంది, ప్రచారం చేసింది, నిర్మాణం చేపట్టింది. చైనా విప్లవ నిర్దిష్ట ఆచరణతో జోడించబడిన తర్వాత, విశ్వజనీన సత్యమైన మార్క్సిజం-లెనినిజం చైనా విప్లవానికి పూర్తిగా కొత్త రూపునిచ్చింది. జపాన్ వ్యతిరేక ప్రతిఘటనా యుద్ధం ప్రారంభమైనప్పటినుండే మన పార్టీ విశ్వజనీన సత్యమైన మార్క్సిజం-లెనినిజాన్ని పునాదిగా చేసుకుని యుద్ధంలో నిర్దిష్ట ఆచరణను అధ్యయనం చేయటంలోను, నేటి చైనాను, ప్రపంచాన్ని అధ్యయనం చేయటంలోనూ మరొక అడుగు ముందుకు వేసింది. చైనా చరిత్రని అధ్యయనం చెయ్యడం కూడా ప్రారంభించింది. ఇవి అన్నీ మంచి లక్షణాలు.

**2**

అయితే ఇప్పటికీ మనలో లోటుపాట్లు వున్నాయి. వాటిలో కొన్ని చాలా పెద్దవి కూడా వున్నాయి. ఈ లోటుపాట్లను సరిదిద్దుకోకుండా మన పనిలో ముందడుగు వేయలేమనీ, విశ్వజనీన సత్యమైన మార్క్సిజం-లెనినిజాన్ని చైనా విప్లవ నిర్దిష్ట ఆచరణతో సమన్వయించడమనే మన మహత్తర కర్తవ్యాన్నిగాని నిర్వహించలేమనీ నా అభిప్రాయం.

ముందుగా ప్రస్తుత పరిస్థితులను అధ్యయనం చేయడం తీసుకొందాం. నేటి జాతీయ, అంతర్జాతీయ పరిస్థితుల్ని అధ్యయనం చేయడంలో కొంత విజయాన్ని సాధించాం. కానీ మనంత పెద్ద రాజకీయ పార్టీ స్థాయికి మనం సేకరించిన సమాచారం అతితక్కువే. అంతేకాక, రాజకీయ, సైనిక, ఆర్థిక, సాంస్కృతిక అంశాలన్నింటిలోనూ మనం చేసిన పరిశోధన క్రమబద్ధమైనదిగాలేదు. సాధారణంగా

# సంస్కరించుకొందాం

మే 1941

– కామ్రేడ్ మావో

చెప్పుకోవాలంటే, ఈ అంశాలపై విషయ సేకరణలోనూ, అధ్యయనంలోనూ మనం గత ఇరవై సంవత్సరాలలోనూ క్రమబద్ధంగా, క్షుణ్ణంగా పని చేయలేదు. భౌతిక వాస్తవాన్ని పరిశోధించడానికీ, అధ్యయనం చేయడానికి అవసరమైన వాతావరణం మనకు లేదు. "పిచ్చుకల్ని పట్టే గుడ్డివాడి"లాగా, "చేపల్ని పట్టే గుడ్డివాడి"లాగా వ్యవహరించడం, లేదా మొరటుగానూ, నిర్లక్ష్యంగానూ వుండటం, వాగాడంబరానికి లోనుకావడం, అతితక్కువ పరిజ్ఞానంతోనే సంతృప్తిపడటం–ఇది తప్పుడు పని విధానం, మార్క్సిజం–లెనినిజం మౌలికాంశాలకు భిన్నమైన పద్ధతి. ఆ పద్ధతి ఇప్పటికి మన పార్టీలో చాలా మంది కామ్రేడ్స్‌లో వుంది. పరిస్థితుల్ని చైతన్యయుతంగా అధ్యయనం చెయ్యాలనీ, వ్యక్తిగత ఇష్టాయిష్టాలతోకాక భౌతిక వాస్తవికతతో ముందుకు సాగాలనీ, మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్‌లు మనకు నేర్పారు. అయితే మన కామ్రేడ్స్ చాలా మంది ఈ సత్యానికి పూర్తిగా భిన్నంగా నడుస్తున్నారు.

రెండవది, చరిత్ర అధ్యయనాన్ని తీసుకోండి. కొంతమంది పార్టీ సభ్యులు, సానుభూతిపరులు ఈ పనిలో ఉన్నప్పటికీ అది ఒక క్రమపద్ధతిలో జరగడంలేదు. గత వంద సంవత్సరాల చరిత్ర కానివ్వండి, పురాతన కాలంనాటి చరిత్ర కానివ్వండి, మొత్తం మీద చైనా చరిత్ర గురించి మన పార్టీ సభ్యులు చాలా మంది ఇంకా అయోమయంలోనే వున్నారు. పురాతన గ్రీసును వుదహరించకుండా మాట్లాడలేని మార్క్సిస్టు–లెనినిస్టు పండితులు చాలా మంది వున్నారు. కానీ తమ పూర్వీకుల గురించి మాత్రం వారు పూర్తిగా మర్చిపోయారు. ప్రస్తుత పరిస్థితుల్నిగాని, గత చరిత్రనుగాని లోతుగా అధ్యయనం చేయడానికి అనుకూలమైన వాతావరణం లేదు.

మూడవది, అంతర్జాతీయ విప్లవానుభవాన్ని, విశ్వజనీన సత్యమైన మార్క్సిజం–లెనినిజాన్ని అధ్యయనం చేయడం తీసుకోండి. చాలా మంది కామ్రేడ్స్ మార్క్సిజం–లెనినిజాన్ని విప్లవాచరణకోసంకాక ఉత్త విజ్ఞాన సముపార్జనకోసం మాత్రమే అధ్యయనం చేస్తున్నట్లుంది. దాని ఫలితంగా వాళ్ళు చదివిన దాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు. వాళ్ళు మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్‌లను పాక్షికంగా వుదహరించగలరే తప్ప, వారి దృక్పథాన్ని, పద్ధతిని ఆసరా చేసుకుని చైనా ప్రస్తుత పరిస్థితులను, చైనా చరిత్రను నిర్దిష్టంగా అధ్యయనం చేయడానికిగానీ, చైనా విప్లవ సమస్యల్ని నిర్దిష్టంగా విశ్లేషించి పరిష్కరించడానికిగాని అన్వయించలేరు. మార్క్సిజం–లెనినిజంపట్ల అటువంటి ధోరణి వుండటం, ముఖ్యంగా మధ్యస్థాయి, ఉన్నతస్థాయి కార్యకర్తలకు చాలా హానికరం.

నేను పైన పేర్కొన్న మూడు అంశాలు – నిర్దిష్ట పరిస్థితుల అధ్యయనాన్ని నిర్లక్ష్యం చేయడం, చరిత్ర అధ్యయనాన్ని నిర్లక్ష్యం చేయడం, మార్క్సిజం–లెనినిజాన్ని అన్వయించడాన్ని నిర్లక్ష్యం చేయడం... ఇవన్నీ మన కార్య విధానంలో పూర్తి చెడు శైలినే సూచిస్తున్నాయి. దీని వ్యాప్తి వల్ల మన కామ్రేడ్స్‌లో చాలా మందికి హాని జరిగింది.

నిజానికి ఈరకమైన పని విధానం వల్ల మన శ్రేణుల్లోని చాలా మంది కామ్రేడ్స్ తప్పుడు తోవలోకి పోయారు. దేశం, ప్రాంతం, రాష్ట్రాలకు ఇంటా బయట నిర్దిష్ట పరిస్థితుల్ని కూలంకషంగా, క్రమబద్ధంగా పరిశోధించడానికి ఇష్టపడనివాళ్ళు తమ మిడిమిడి జ్ఞానం ఆధారంగా ఆజ్ఞలు మాత్రం జారీ చేస్తారు. "నేను అనుకుంటున్నాను కాబట్టి అది అలానే అయివుంటుంది," అనుకునే స్వీయాత్మక పని విధానం మనలో చాలా మంది కామ్రేడ్స్‌లో ఇప్పటికీ లేదూ?

మన చరిత్ర ఏమీ తెలియకపోవటం, లేదా అతికొద్దిగా తెలియటం మూలంగా సిగ్గుపడడానికి బదులు గర్వించేవాళ్ళు కొంతమంది ఉన్నారు. వాస్తవానికి చైనా కమ్యూనిస్టు పార్టీ చరిత్ర, నల్లమందు యుద్ధం నుండీ వంద సంవత్సరాల చైనా చరిత్ర తెలిసినవాళ్ళు బహుకొద్ది మంది మాత్రమే వున్నారు. గత వంద సంవత్సరాల ఆర్థిక, రాజకీయ, సైనిక, సాంస్కృతిక చరిత్రని అధ్యయనం చేయడాన్ని ఎవరూ తీవ్రంగా పట్టించుకోలేదు. తమ దేశం గురించి ఏమీ తెలియని వాళ్ళు విదేశాల పురాతన కథల్ని మాత్రం వల్లె వేస్తారు. కనీసం ఈ విజ్ఞానం అయినా సమగ్రంగా వుండదు. అది కూడా పాత విదేశీ పుస్తకాల నుండి సంగ్రహించిన మిడిమిడి జ్ఞానమే.

విదేశాల నుండి తిరిగి వచ్చిన విద్యార్థులు ఈ జబ్బుతో చాలా దశాబ్దాలుగా బాధపడ్డారు. ఐరోపా, అమెరికా, జపానుల నుండి స్వదేశానికి తిరిగివచ్చిన వాళ్లు విదేశీ చిలుకపలుకులు మాత్రమే పలుకుతారు. వాళ్లు పాడిందే పాడే గ్రామఫోనులుగా మారిపోతారు. కొత్త విషయాలను సృష్టించటం, తెలుసుకోవటం అనే బాధ్యతలను మర్చిపోతారు. ఈ జబ్బు కమ్యూనిస్టు పార్టీలో కూడా ప్రవేశించింది.

మనం మార్క్సిజాన్ని అధ్యయనం చేస్తున్నప్పటికీ, మనవాళ్లు చాలా మంది అనుసరిస్తున్న అధ్యయన పద్ధతి మార్క్సిజానికి పూర్తిగా విరుద్ధమైనది. మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్‌లు మనకు అందించిన సిద్ధాంతం, ఆచరణల మధ్య ఐక్యత అనే ప్రాథమిక సూత్రాన్ని వాళ్లు జవదాటుతున్నారు. ఈ సూత్రాన్ని జవదాటుతూ, దీనికి పూర్తిగా వ్యతిరేకమైన సిద్ధాంతాన్ని, ఆచరణ నుండి విడదీసే స్వంత సూత్రాన్ని వాళ్లు రూపొందించుకుంటున్నారు. పాఠశాలల్లోనూ, ఆచరణలో వున్న కార్యకర్తలకు, తత్వశాస్త్రం బోధించే ఉపాధ్యాయులు చైనా విప్లవ గతితర్కాన్ని అధ్యయనం చేయటంలో విద్యార్థులకు సలహా ఇవ్వడంలేదు. అర్థశాస్త్రం చెప్పే ఉపాధ్యాయులు చైనా ఆర్థిక వ్యవస్థ విశిష్ట లక్షణాలను అధ్యయనం చేయటంలో వారికి సలహా ఇవ్వటంలేదు. రాజనీతి శాస్త్రం బోధించే ఉపాధ్యాయులు వారికి చైనా విప్లవ ఎత్తుగడల్ని అధ్యయనం చేయడానికి అవసరమైన సలహాలివ్వటంలేదు. సైనిక శాస్త్రం చెప్పే అధ్యాపకులు చైనా ప్రత్యేక లక్షణాలకు అన్వయించి వ్యూహాలు, ఎత్తుగడల గురించి అధ్యయనం చేయటంలో సలహాలివ్వటంలేదు. ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నెన్నో, తత్ఫలితంగా వ్యాపిస్తున్న తప్పుడు అభిప్రాయాలు ప్రజలకు బాగా హానికలిగిస్తున్నాయి. ఏనాన్‌లో తాను నేర్చుకున్న దానిని ఫూషన్‌లో ఎలా అన్వయించాలో తెలియని వాళ్లున్నారు. ఆర్థికశాస్త్ర ప్రొఫెసర్లు సరిహద్దు ప్రాంత ద్రవ్యానికి, కొమింటాంగ్ ద్రవ్యానికీ మధ్యగల సంబంధాన్ని వివరించలేదు. కాబట్టి విద్యార్థులు కూడా దాన్ని వివరించలేకపోవటం సహజమే. ఈవిధంగా చాలా మంది విద్యార్థులు కూడా దాన్ని వివరించలేకపోవటం సహజమే. ఈ విధంగా చాలామంది విద్యార్థులలో వికృత మనస్తత్వం సృష్టించబడింది. చైనా సమస్యలపట్ల శ్రద్ధ చూపడానికి, పార్టీ ఆదేశాలను చిత్తశుద్ధితో అమలుచేయటానికి బదులుగా వాళ్లు తమ అధ్యాపకుల దగ్గర నేర్చుకున్న పిడిసూత్రాలే శాశ్వతమైనవనీ, మార్చాల్సిన అవసరం లేదని భావించి, వాటిని ఒంట పట్టించుకుంటారు.

అయితే, ఇప్పుడు నేను చేసిన ప్రస్తావన అంతా మన పార్టీలోని అతి చెడ్డవారిని గురించి. అంతా ఇలా వున్నారని నేనడంలేదు. కానీ ఇలాంటి వాళ్లు కూడా ఇంకా వున్నారు. అంతకంటే ముఖ్యమైన విషయం ఏమిటంటే, వాళ్లు కొద్దిమందే వున్నా, వాళ్ల మూలంగా కలిగే హాని మాత్రం చాలా ఎక్కువే. ఈ విషయాన్ని తేలికగా భావించకూడదు.

### 3

ఈ భావాన్ని మరింత వివరించటంకోసం రెండు భిన్న దృక్పథాలను పోల్చుతాను.

**మొదటిది స్వీయాత్మక ధోరణి.**

ఈ ధోరణిలో వున్నవాడు పరిసరాలను క్రమబద్ధంగాను, క్షుణ్ణంగాను అధ్యయనం చేయలేడు. అతను స్వీయాత్మకమైన వుత్తేజంతో పని చేస్తాడు. ఈనాటి చైనా స్వరూపాన్ని అస్పష్టంగా మాత్రమే చూడగల్గుతాడు. ఈ దృక్పథాన్ని కలిగిన వ్యక్తి చరిత్రను సమగ్రంగా అవగాహన చేసుకోలేడు. అతనికి ప్రాచీన గ్రీకు దేశం గురించి తెలుసుగాని చైనా గురించి తెలీదు. అతను నిన్న మొన్నటి చైనా గురించి అయోమయంగా వుంటాడు. ఈ దృక్పథాన్ని కలిగిన వ్యక్తి మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంతాన్ని అవాస్తవికంగా, లక్ష్యం లేకుండా అధ్యయనం చేస్తాడు. చైనా విప్లవంలోని సైద్ధాంతిక సమస్యల్ని, ఎత్తుగడలకు సంబంధించిన సమస్యల్ని పరిష్కరించేందుకు అవసరమైన దృక్పథాన్ని, పద్ధతిని తెలుసుకోవటంకోసం కాక కేవలం సిద్ధాంత పరిజ్ఞానంకోసమే సిద్ధాంతం అన్న ధోరణిలోనే మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్‌లను అధ్యయనం చేస్తాడు. అతను లక్ష్యానికి గురిచూసి బాణం వేయడానికి బదులు తన ఇష్టం వచ్చినట్లు బాణాలు వదులుతాడు. మనం భౌతిక వాస్తవాలమీద అధారపడాలని, ఆచరణలో మార్గదర్శకంగా ఉపయోగపడే సూత్రాలను వాటినుండి గ్రహించాలని మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్‌లు మనకు ప్రబోధించారు. దానికోసం మనం మార్క్స్ చెప్పినట్లుగా వివరంగా సమాచారాన్నంతటినీ రాబట్టి, దాన్ని శాస్త్రీయ విశ్లేషణకు గురిచేయాలి. మనవాళ్లు చాలా మంది ఇలా చేయకపోగా, సరిగ్గా దీనికి భిన్నంగా ప్రవర్తిస్తారు. వాళ్లు చాలా మంది పరిశోధనలు జరుపుతున్నారు. కానీ ఈనాటి చైనా గురించిగానీ, గతకాలపు చైనా గురించిగానీ అధ్యయనం చేయాలన్న కుతూహలం వాళ్లకులేదు. వాస్తవంతో సంబంధంలేనీ, పనికిరాని 'సిద్ధాంతాల' అధ్యయనంపట్ల మాత్రం ఎక్కువ ఆసక్తి చూపుతారు. ఇంకా చాలా మంది ఆచరణ చేవడుతున్నారు. కానీ వాళ్లు కూడా భౌతిక పరిస్థితుల అధ్యయనంపట్ల ఏమాత్రం శ్రద్ధ చూపరు. ఉత్త వుత్సాహం మీద ఆధారపడి, సిద్ధాంతాలకి బదులు వాళ్ల వాళ్ల వ్యక్తిగత అనుభూతుల్ని ఏర్పరుచుకొంటారు. ఈ రెండు రకాలకు చెందిన వాళ్లు కూడా స్వీయాత్మకతమీద ఆధారపడి భౌతిక వాస్తవాల అస్తిత్వాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. వాళ్లు ఉపన్యాసాలు ఇచ్చేటప్పుడు ఎ, బి, సి, డి, 1,

2, 3, 4 అంటూ వివిధ హెడ్డింగుల కింద అంశాలు చెప్పుకుంటూపోతారు. వ్యాసాలు రాసేటప్పుడు అతిశయోక్తులు వాడుతారు. వాస్తవాల నుండి నిజం గ్రహించాలనే ఉద్దేశ్యం వారికిలేదు. ఏదో విధంగా నమ్మకం కలిగించి ఇతరులచేత మంచి అనిపించుకోవాలనుకుంటారు. వారు సరుకు లేకుండా పైపై మెరుగులు ప్రదర్శిస్తారు. ఏమాత్రం గట్టితనంలేని ఓటితనానికిపోతారు. తాము ఎప్పుడూ ఒప్పులే చేస్తారు, ఈ భూమిపై తమదే మొదటి శ్రేణి అధికారం అనుకుంటూ "రాచరికపు రాయబారుల"లాగా ప్రతి చోటకీ పరిగెడుతుంటారు. మన శ్రేణుల్లోని కొంతమంది కామ్రేడ్‌ల పని విధానం ఇలా వుంది. ఈ రకమైన నడవడిక, ప్రవర్తనల ద్వారా తమకి తాము హాని కలిగించుకుంటారు. ఇతరులకు దీనిని బోధించటంవల్ల వాళ్లకి కూడా హాని కలుగుతుంది. విప్లవాన్ని నడపటంలో దాన్ని ఉపయోగించటం వల్ల విప్లవానికి హాని చేస్తారు. ఒక్క మాటలో చెప్పాలంటే, శాస్త్రీయ విజ్ఞానానికి, మార్క్సిజం-లెనినిజానికి విరుద్ధమైన ఈ స్వీయాత్మక ధోరణి కమ్యూనిస్టు పార్టీకి, శ్రామికవర్గానికి, ప్రజలకి, దేశానికి ప్రబల శత్రువు. పార్టీలోని చెడు అంతా ఈ రూపం ధరిస్తుంది. మనముందున్న శక్తివంతమైన శత్రువుపైన చావుదెబ్బ తీయాలి. స్వీయాత్మక ధోరణిని నాశనం చేయగలిగితేనే మార్క్సిజం-లెనినిజం అనే సత్యం వర్ధిల్లుతుంది. పార్టీ శక్తివంతమవుతుంది. విప్లవం విజయవంతమవుతుంది. శాస్త్రీయ దృక్పథం లేకపోవడం అంటే సిద్ధాంతాన్ని, ఆచరణను మేళవించాలనే మార్క్సిస్టు-లెనినిస్టు ధోరణి లేకపోవటం; అంటే పార్టీ ఉత్తేజంలేదనీ, ఉన్నా తక్కువగా వుందని మనం భావించాలి. ఈ రకమైన వాళ్లని వర్ణించడానికి ఒక గేయం వుంది. అది:

"గోడమీద పిచ్చి మొక్క-దాని తలబరువు, కాడసన్నం, వేరు శూన్యం;

కొండల్లో వెదురు మొలక-దాని నాలుక బహుపదును, చర్మం దళసరి, లోనబోలు."

శాస్త్రీయ దృక్పథంలేని వాళ్లని, మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్‌ల రచనల్లోంచి వాక్యాలను అదే పనిగా ఉటంకించడం మాత్రమే చేయగలవాళ్లని, వాస్తవ పరిజ్ఞానం లేకపోయినా అనవసరమైన ప్రతిష్టనిపొందే వాళ్లని ఈ గేయం చక్కగా వర్ణించదూ? తనలో వున్న ఈ లోపాన్ని సవరించుకోవాలని ఎవరైనా నిజంగా భావిస్తుంటే వాళ్లు ఈ గేయాన్ని బాగా మనసుకు పట్టించుకోవాలి, లేదా మరింత ధైర్యం చూపి దాన్ని తన గది గోడకి అంటించుకోవాలని సలహా. మార్క్సిజం-లెనినిజం ఒక శాస్త్రం. శాస్త్రం అంటే నిజాయితీతో కూడుకున్న నిర్దిష్టమైన విజ్ఞానం. దాంతో ఇష్టం వచ్చినట్లుగా నాటకలాడటానికి వీలులేదు. కాబట్టి ఈ విషయంలో మనం చిత్తశుద్ధి చూపాలి.

### రెండవది, మార్క్సిస్టు-లెనినిస్టు దృక్పథం.

ఈ దృక్పథాన్ని కలిగిన వ్యక్తి మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంతాన్ని, పద్ధతిని, చుట్టూ వున్న పరిస్థితుల అధ్యయనానికి, క్రమబద్ధమైన క్షుణ్ణమైన పరిశోధనకు అన్వయిస్తాడు. అతను ఉత్త ఉత్సాహంతో మాత్రమే పని చేయడు. స్టాలిన్ చెప్పినట్లు, అతడు విప్లవ ఊపుని ఆచరణతో మిళితం చేస్తాడు. ఈ దృక్పథం కలిగిన వ్యక్తి చరిత్ర అసమగ్రంగా చదవడు. పురాతన గ్రీకు దేశం గురించి తెలుసుకోవడంచాలదు. అతను చైనా గురించి తప్పక తెలుసుకోవాలి. విదేశాల విప్లవాల చరిత్రేగాక చైనా విప్లవ చరిత్ర కూడా తెలుసుకోవాలి. ఈ దృక్పథం కలిగిన వ్యక్తి మార్క్సిజం-లెనినిజాన్ని ఒక లక్ష్యంతో అధ్యయనం చేస్తాడు. అంటే, అతను మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంతాన్ని చైనా వాస్తవ విప్లవోద్యమంతో సమన్వయపరుస్తాడు. చైనా విప్లవం ఎదుర్కొంటున్న సైద్ధాంతిక సమస్యల్ని, ఎత్తుగడలకు సంబంధించిన సమస్యల్ని ఈ సిద్ధాంత వెలుగులో పరిష్కరించబూనుకుంటాడు. ఇది లక్ష్యాన్ని గురిచూసి బాణం వేసే దృక్పథం. చైనా విప్లవం 'లక్ష్యం' అయితే, మార్క్సిజం-లెనినిజం 'బాణం' అవుతుంది. చైనా విప్లవం, తూర్పు విప్లవాలు అనే లక్ష్యాలను గురిచూసి కొట్టడం కోసం చైనా కమ్యూనిస్టులు ఈ బాణాన్ని చేపట్టారు. ఈ రకమైన దృక్పథాన్ని అవలంభించటం వల్ల వాస్తవాల నుండి సత్యాన్ని గ్రహించగల్గుతాం. భౌతికంగా వున్న అన్ని వస్తువులు "వాస్తవాలే." వాటి అంతర్గత సంబంధాలను నిర్దేశించే సూత్రాలే "సత్యం." ఈ సత్యాన్ని "గ్రహించడం" అంటే అధ్యయనం చేయడం. మనం దేశం, గ్రామం, జిల్లాల్లోనూ, వాటి బయటవున్న వాస్తవ పరిస్థితుల అధ్యయనంతో మొదలుపెట్టి, ఊహాజనిత సూత్రాలను విడనాడి, ఈ వాస్తవ పరిస్థితుల్లో అంతర్గతంగా వుండే సూత్రాలను మన ఆచరణకు మార్గదర్శకంగా గ్రహించాలి. అంటే, మన చుట్టూ జరుగుతున్న సంఘటనలలోని అంతరంగిక సంబంధాలన్నీ కనుక్కోగలగాలి. ఈ విధంగా చెయ్యాలంటే మనం స్వీయాత్మక ఊహలమీదగాని, తాత్కాలికమైన ఉత్సాహం మీదగాని, జీవంలేని పుస్తకాల మీదగాని ఆధారపడకూడదు భౌతిక వాస్తవాల మీదనే ఆధారపడాలి. వివరాల్ని విపులంగా సేకరించాలి. మార్క్సిజం-లెనినిజం సాధారణ సూత్రాల వెలుగులో ఆ వివరాల నుండి సరియైన అంతిమ నిర్ణయాలకు రాగలిగాలి. ఈ నిర్ణయాలు అతిశయోక్తులూ కావు, ఉత్త అంకెల పట్టీలూకావు. ఇవి శాస్త్రీయమైన నిర్ణయాలు. ఇది వాస్తవాల నుండి సత్యాన్ని గ్రహించే దృక్పథం. అంతేగానీ, ఏదో విధంగా ఇతరులచేత మంచి అనిపించుకునే దృక్పథంకాదు.

ఇది పార్టీ ఉత్తేజం యొక్క వ్యక్తీకరణ. ఇది సిద్ధాంతాన్ని ఆచరణతో సమన్వయపరిచే మార్క్సిస్టు–లెనినిస్టు వైఖరి. ఇది ప్రతి కమ్యూనిస్టు సభ్యుడు కనీసంగానైనా కలిగి వుండాల్సిన దృక్పథం. ఈ దృక్పథాన్ని చేపట్టేవారు "తలబరువు, కాడసన్నం, వేరు శూన్యం"గానూ వుండరు, "పదును నాలిక, దళసరి చర్మం, లోనబోలు"గానూ వుండరు.

**4**

పైన వివరించిన అభిప్రాయాలకు అనుగుణంగా నేను ఈ సూత్రీకరణలు చేయదల్చుకున్నాను.

1. మన చుట్టూ వున్న పరిస్థితుల్ని క్రమబద్ధంగానూ, క్షుణ్ణంగానూ అధ్యయనం చేయాల్సిన కర్తవ్యాన్ని మనం పార్టీ ముందు వుంచాలి. మార్క్సిస్టు–లెనినిస్టు సిద్ధాంతం, పద్ధతుల పునాదిమీద మన శత్రువుల, మిత్రుల, మన ఆర్థిక, ద్రవ్య సంబంధ, రాజకీయ, సైనిక, సాంస్కృతిక, పార్టీ సంబంధమైన కార్యకలాపాల్ని వివరంగా పరిశీలించాలి. వాటిలోని మార్పుల్ని అధ్యయనం చేయాలి. అపుడు వాటిలో నుండి సరియైన, అవసరమైన నిర్ణయాలకు రాగలగాలి. ఈ లక్ష్యంతోటే ఈ అంశాలమీద పరిశోధన, అధ్యయనం చేయటంపై మన కామ్రేడ్స్ దృష్టిని కేంద్రీకరించాలి. పరిస్థితులు తెలుసుకోవడం, సిద్ధాంతం మీద పట్టు సంపాదించడం అనేవి రెండూ కమ్యూనిస్టు పార్టీలో అగ్రగామి స్థాయిలో వున్న సంస్థల ప్రాథమిక కర్తవ్యాలనే విషయాన్ని మన కామ్రేడ్స్ అర్థం చేసుకొనేటట్లు చేయాలి. పరిస్థితులు తెలుసుకోవడం అంటే ప్రపంచాన్ని తెలుసుకోవడం, సిద్ధాంతం మీద పట్టు సంపాదించడం అంటే ప్రపంచాన్ని మార్చడం అనీ అర్థం. పరిశోధన జరపని వాళ్లకు మాట్లాడే హక్కులేదని మన కామ్రేడ్స్ అర్థం చేసుకునేలా చేయాలి. వాగాడంబరం, దృగ్గోచర విషయాలను కేవలం 1, 2, 3, 4 అంటూ వరసక్రమంలో పెట్టడం చాలదని వారికి తెలియజేయాలి. ఉదాహరణకి ప్రచార కార్యక్రమాన్ని తీసుకోండి. మన శత్రువులు, మిత్రులు మనం సాగిస్తున్న ప్రచార కార్యక్రమం గురించిన పరిస్థితి మనకు తెలియకుండా మనం సరియైన ప్రచార సూత్రాలను రూపొందించలేం. ఏ విభాగానికి సంబంధించిన విషయంలోనైనా వాస్తవ పరిస్థితిని ముందు తెలుసుకోవాలి. అప్పుడు మాత్రమే సక్రమంగా పని చేయగలం. పరిశోధనకు, అధ్యయనానికి అవసరమైన ప్రణాళికను పార్టీ అంతటా రూపొందించుకోవడం అనేది పార్టీ పని విధానంలో మార్పు తీసుకురావడానికి మౌలికమైన అంకెగా ఉపయోగపడుతుంది.

2. గత వంద సంవత్సరాల చైనా చరిత్రకు సంబంధించినంత వరకు అర్హులైన వ్యక్తులందరినీ సమావేశపరచాలి. వాళ్ల పని విభజన చేసుకుని పరస్పరం సహకరించుకుంటూ దాన్ని అధ్యయనం చేయాలి. ఇలా చేయడం ద్వారా మాత్రమే ప్రస్తుతం వున్న అస్తవ్యస్థ పరిస్థితి నుండి బయటపడగలం. ముందుగా ఆర్థిక చరిత్ర, రాజకీయ చరిత్ర, సైనిక చరిత్ర, సాంస్కృతిక చరిత్ర వంటి వివిధ రంగాలలో విశ్లేషణాత్మకంగా అధ్యయనం చేయాలి. అప్పుడు మాత్రమే సమన్వయ పూరితమైన అధ్యయనం సాధ్యపడుతుంది.

3. ఆచరణలో నిమగ్నులైన కార్యకర్తలకు, లేదా కార్యకర్తల కోసం నిర్వహించే పాఠశాలల్లోను విద్యకు సంబంధించి, పార్టీ ఈ కింది సూత్రీకరణను ఏర్పాటు చేసుకోవాలి. అదేమంటే, చైనా విప్లవంలోని ఆచరణకు సంబంధించిన సమస్యలను మార్క్సిజం–లెనినిజం వెలుగులో అధ్యయనం చేయడానికి వుపయోగపడే విద్యను అందించాలి. మార్క్సిజం–లెనినిజాన్ని ఒక జడ పదార్థంగా, ఒంటరి ధోరణిగా అధ్యయనం చేసే పద్ధతిని విడనాడాలి. అంతేగాక, మార్క్సిజం–లెనినిజాన్ని అధ్యయనం చేయడానికి "సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ చరిత్ర (బోల్షివిక్) సంక్షిప్త పాఠం"ను ప్రధానమైన పాఠ్యాంశంగా తీసుకోవాలి. అది అన్నిటికన్నా మెరుగైన సమన్వయం; అది గత వంద సంవత్సరాల ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమ సారాంశం. సిద్ధాంతాన్ని ఆచరణతో సమైక్యం చేయడంలో ప్రపంచంలో ఇంతవరకు ఎన్నడూలేని సమగ్రమైన నమూనా. లెనిన్, స్టాలిన్‌లు మార్క్సిస్టు విశ్వజనీన సత్యాన్ని రష్యా విప్లవ నిర్దిష్ట ఆచరణతో ఎలా సమన్వయం చేశారో, అలా చేయడం ద్వారా మార్క్సిజాన్ని మరింతగా ఎలా అభివృద్ధి చేయగలిగారో చూడటం ద్వారా మనం చైనాలో ఎలా పని చేయాలో తెలుసుకోగలుగుతాం.

ఇప్పటికే ఆ విషయాలను పదే పదే చెప్పుకున్నాం. కానీ సాధారణంగా తప్పులు చేయకుండా సత్యాన్ని గ్రహించడం సాధ్యంకాదు. మనం మన అధ్యయన పద్ధతుల్ని సంస్కరించుకోవడంవల్ల సజీవమైన, సుసంపన్నమైన చైనా, ప్రపంచ విప్లవాలకు సంబంధించి సత్ఫలితాలను పొందగలమని నేను గాఢంగా నమ్ముతున్నాను. ★

**మొబైల్ యుద్ధతంత్రం ద్వారా శత్రువు బలగాలను ఒకదాని తర్వాత మరొకటిగా ధ్వంసం చేయడానికిగానూ అధికంగా బలగాలను కేంద్రీకరించాలి, శత్రువుకు బలహీనమైన స్థానాలను ఎంచుకోవాలి, శత్రువును మొత్తంగా లేదా ప్రధానమైన భాగాన్ని ఖాయంగా తుడిచిపెట్టేయగలమని అనుకున్నప్పుడే పోరాటానికి దిగాలి.**

# చారిత్రాత్మక లాల్‌గఢ్ ఉద్యమాన్ని ఎత్తిపడుదాం!

## సామ్రాజ్యవాద అభివృద్ధి నమూనాను తిప్పికొడుతూ

## ప్రజారాజ్యాధికార సాధనే ఏకైక లక్ష్యంగా మరెన్నో 'లాల్‌గఢ్'లను సృష్టిద్దాం!!

భారత నూతన ప్రజాస్వామిక విప్లవంలో 'లాల్‌గఢ్' అనే మరో విలువైన అధ్యాయం చోటుచేసుకుంది. భారత విప్లవానికి సరైన దిశను నిర్దేశించిన నక్సల్బరీకి జన్మనిచ్చిన పశ్చిమ బెంగాల్ రాష్ట్రమే లాల్‌గఢ్‌కూ జన్మనిచ్చింది. నక్సల్బరీ వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న పశ్చిమ బెంగాల్ ప్రజానీకం వీరోచితంగా పోరాడి ఇటీవల సింగూర్ నుంచి టాటాను తరిమికొట్టారు. అదేవిధంగా నందిగ్రామ్‌లో ఇండోనేషియా కంపెనీ తలపెట్టిన రసాయనాల హబ్‌కు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడిన ఫలితంగా అక్కడ సెజ్ నిర్మాణం ఆగిపోయింది. ఈ ఒరవడిని కొనసాగిస్తూ లాల్‌గఢ్ పోరాటం మరింత ఉన్నత స్థాయిలో నాటి నక్సల్బరీని గుర్తుకు తెచ్చింది.



### లాల్‌గఢ్ పోరు నేపథ్యం

లాల్‌గఢ్ పశ్చిమ మేదినీపూర్ జిల్లాలోని సంతాలీ ఆదివాసీ ప్రజలు నివసించే ఒక ప్రాంతం. అభివృద్ధికి సుదూరంగా వున్న ఈ ప్రాంతం మూడు దశాబ్దాలకుపైగా నిరంతరాయంగా సాగుతున్న సి.పి.ఎం. పాలనలోని అభివృద్ధి నిరోధకతను ఎత్తిచూపుతుంది. భూసంస్కరణలను అమలు చేశామని సి.పి.ఎం. చెప్పుకునే గొప్పలు ఎంత వాస్తవ దూరమో కూడా స్పష్టం చేస్తుంది. దేశంలో అత్యంత నిరాదరణకు గురవుతున్న అన్ని ఆదివాసీ ప్రాంతాల కోవలోనే లాల్‌గఢ్ చేరుతుంది. ఇన్నాళ్లు ఈ ప్రాంత అభివృద్ధిని ఎంతమాత్రం పట్టించుకోని వామపక్ష ప్రభుతం ఈనాడు ఈ ప్రాంతాన్ని 'అభివృద్ధి' చేయాలని కంకణం కట్టుకుంది. అయితే ప్రభుత్వం తలపెట్టిన ఈ 'అభివృద్ధి' లక్ష్యం ఇక్కడ మెజారిటీగా వున్న ఆదివాసీ ప్రజల బతుకులను మెరుగుపర్చడంకాదు వీరి బతుకులను బలిపెట్టి దోపిడీ వర్గాలకు ప్రయోజనాలు చేకూర్చడం. ఇదే జిల్లాలోని లాల్‌గఢ్‌కు సమీపంలో వుండే సాల్బోని ప్రాంతంలో ఉక్కు ఫ్యాక్టరీని నిర్మించడానికి జిందాల్ కంపెనీకి అనుమతినిచ్చింది. దీనికోసం ప్రభుత్వం నాలుగున్నర వేల ఎకరాల భూమిని జిందాల్‌కు కట్టబెట్టింది. ఈ భూమిలో కొంత భాగం అటవీ శాఖకు చెందినది. అత్యధిక భాగం భూసంస్కరణల కార్యక్రమం కింద భూమిలేని ఆదివాసీ జనానికి ఇవ్వడం పేరుతో సేకరించినది. ప్రభుత్వం కట్టబెట్టిన భూమికితోడు జిందాల్ కంపెనీ మరో ఐదు వందల ఎకరాల భూమిని ప్రజల నుంచి బలవంతంగా సేకరించింది.

మొదట ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం కోసమని ఈ భూములను పొందింది. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వ మద్దతుతో దీనికి సెజ్ హోదా లభించింది. సెజ్ హోదా ఇచ్చేప్పుడు ఏ నియమ నిబంధనలను ప్రభుత్వం పట్టించుకోలేదు, పర్యావరణాన్నీ దృష్టిలో పెట్టుకోలేదు. దానికోసం ఆదివాసీలను భూముల నుండి తరిమివేసింది. నిజానికి ఆదివాసీల భూములనూ, అటవీ భూములను కొనడమూ, అమ్మడం చట్ట వ్యతిరేకం. కానీ ప్రభుత్వం ఏ విషయంలోనూ చట్టాలను పట్టించుకోకపోగా, అడుగడుగునా అతిక్రమించింది.

ఇలా ప్రజలను నిర్వాసితులను చేయడం పట్ల వస్తున్న నిరసనను చల్లార్చడానికి ప్రభుత్వమూ, జిందాల్ కంపెనీ కలిసి అనేక వాగ్దానాలు చేసాయి. 2020 నాటికి 37 వేల ప్రత్యక్ష ఉద్యోగాలనూ, దీనికి రెట్టింపు సంఖ్యలో పరోక్ష ఉద్యోగాలను కల్పిస్తామని చెప్తున్నారు. భూములు కోల్పోయిన ప్రతి కుటుంబం నుంచి ఒకరికి శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామనీ అలా తగిన నష్టపరిహారం ఇస్తామనీ ప్రకటించారు. ఇలా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఊదరగొడుతున్నారు.

పశ్చిమ బెంగాల్‌లోనే కాదు దేశవ్యాప్తంగా నేడు ప్రభుత్వాలు ఊదరగొడుతున్న, బలవంతంగా అమలుచేయ పూనుకుంటున్న అభివృద్ధి నమూనా తీవ్ర ఆందోళనాకరమైనది. ప్రజలను తమ భూముల నుండి, అడవుల నుండి, వనరుల నుండి బేదఖలు చేసి

వాళ్ల చేతుల్లో ఇన్ని డబ్బులనో, చిరు ఉద్యోగాలనో పెట్టడంలో ప్రజలకు ఒనగూరే ప్రయోజనం ఏమీ లేదనీ దోపిడీవర్గాల ప్రయోజనాలకే ఇది దోహదపడుతుందనీ, ఇప్పటికే దేశంలో నిర్వాసితులయిన లక్షలాది ప్రజల బతుకులు చాటుతున్నాయి. ప్రజలకు తమ భూములపై, అడవులపై, సంపదపై హక్కును కల్పించడం ద్వారానే నిజమైన అభివృద్ధి సాధ్యం అవుతుందని ప్రజా ఉద్యమాలు చాటుతున్నాయి. భారతదేశం వంటి వ్యవసాయ ప్రధాన దేశంలో వ్యవసాయ రంగంపై ఆధారపడే పారిశ్రామిక అభివృద్ధి మాత్రమే దేశ ప్రగతికి దారితీస్తుంది. వ్యవసాయరంగాన్ని దెబ్బతీసే, వ్యవసాయ భూములను మింగివేసే పారిశ్రామిక అభివృద్ధి వినాశనానికే దారితీస్తుంది. కనుక ఐదు వేల ఎకరాల భూమిని మింగుతున్న, ఎందరో ప్రజలను నిర్వాసితులను చేస్తున్న జిందాల్ కంపెనీ వల్ల ఈ ప్రాంత ప్రజలు అభివృద్ధి చెందుతారనే వాదన పచ్చి బూటకం.

జిందాల్ కంపెనీ కల్పించే ఉద్యోగాలు, చెల్లించే నష్టపరిహారం నిజంగా ప్రజల బతుకులను అభివృద్ధిపరుస్తాయని అనుకున్నా, ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంక్షోభం అన్ని రంగాలను పట్టి కుదిపేస్తున్న నేటి పరిస్థితిలో ఇన్ని వేల ఎకరాల భూమిని మింగిన జిందాల్ కంపెనీ పూర్తిస్థాయి ఉత్పత్తిని ప్రారంభిస్తుందా? మధ్యలోనే ఆగిపోతుందా? ఈ సంక్షోభం వల్ల ప్రపంచ వ్యాప్తంగా ఉపాధిరంగం కుంచించుకుపోతుంటే నూతన ఉపాధి అవకాశాల మీద ఆశలు పెట్టుకొని ఉన్న ఉపాధిని (భూములను) కోల్పోవడం సహేతుకమేనా అనే ప్రశ్నలు తప్పక ముందుకు వస్తాయి.

నష్టపరిహారం వ్యవహారం కూడా ఎంతో మోసపూరితంగా వుంది. ఎకరం భూమికి మూడు లక్షలు చెల్లిస్తామని జిందాల్ కంపెనీ చెబుతోంది. కానీ ఈ మూడు లక్షల్లో లక్షన్నర నగదు రూపంలో చెల్లించి, మిగితా లక్షన్నర షేర్ల రూపంలో ఇస్తున్నారు. ప్లాంట్ వాణిజ్యపరంగా ఉత్పత్తిని ప్రారంభించిన తర్వాత మాత్రమే ఈ షేర్లను అమ్ముకునే వీలుంటుంది. మరి ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో ఈ కంపెనీ పూర్తిస్థాయి ఉత్పత్తి ప్రారంభిస్తుందో, ముడి ఇనుమును ప్రాసెస్‌చేసే ప్లాంట్‌గానే మిగిలిపోతుందో తెలియని పరిస్థితి. కంపెనీ ఉత్పత్తి మొదలుపెట్టకపోతే ఆ షేర్లు ఎందుకూ పనికిరావు. ఒకవేళ ఉత్పత్తిని ప్రారంభించినా కంపెనీకి లాభాలు వస్తేనే ఆ షేర్లు వుపయోగం. కానీ సంక్షోభ నేపథ్యంలో, ఉక్కు మార్కెట్ కుప్పకూలిపోయి ఉన్న సమయంలో జిందాల్ కంపెనీకి లాభాలు వస్తాయని ఎలా చెప్పగలం?

ఇక్కడ సెజ్‌ను నెలకొల్పడం అనేది పర్యావరణాన్ని కూడా తీవ్రంగా దెబ్బతీస్తుంది. బంకూర, పురూలియ, మేదినీపూర్ జిల్లాలలో ప్రవహించే సువర్ణ రేఖ నది కాలుష్యంతో నిండిపోయి, దాని పరీవాహక అటవీ ప్రాంతమంతా ఈ కాలుష్యం బారిన పడుతుంది. ప్రజలకు ఇన్ని రకాలుగా నష్టదాయకం కనుక ఈ సెజ్‌ను ఇక్కడి ప్రజానీకం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. తమ భూములను గుంజుకోవడాన్నీ వ్యతిరేకిస్తున్నారు.

ప్రజలను ఇంతగా నష్టపరుస్తున్న, ప్రజావ్యతిరేకతను ఎదుర్కొంటున్న సెజ్ వల్ల ప్రయోజనాలు పొందేది మాత్రం సామ్రాజ్యవాద దేశాలు. ఇక్కడ ఉత్పత్తి అయ్యే ఉక్కు ఎగుమతుల కోసమే ఉద్దేశించబడినది. ఎక్కడైనా సెజ్‌లల్లో ఉత్పత్తి అయ్యేది ఎగుమతి ప్రధానమైన సరుకులే.

ప్రజల ఉపాధిని దెబ్బతీస్తూ, వారిని నిర్వాసితులను చేస్తూ, సామ్రాజ్యవాద దేశాల ప్రయోజనం కోసం ఇక్కడ సెజ్‌ను ఏర్పాటుచేయ పూనుకోవడంలో ఇక్కడేకాదు దేశవ్యాప్తంగా ఎక్కడైనా సెజ్‌ల ఏర్పాటుకు పూనుకోవడంలో పాలకవర్గాల దళారీతనం స్పష్టంగా అర్థమవుతుంది. పాలక పార్టీలన్నీ ఈ విషయంలో ఏకతాటిపై నడుస్తున్నాయి. తాము అధికారంలో లేనిచోట సెజ్‌ల వంటి విధానాలను వ్యతిరేకిస్తూ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నటిస్తున్న వామపక్షాలు తాము అధికారంలో వున్నచోట ఈ విధానాలను మరింత దూకుడుగా అమలుచేస్తూ తమ అసలు స్వభావాన్ని బహిర్గతపర్చుకుంటున్నాయి. పాశవిక హింసను ప్రయోగించయినా సింగూర్, నందిగ్రామ్‌లలో సామ్రాజ్యవాదుల, దళారీ పెట్టుబడిదారుల ప్రయోజనాలను నెరవేర్చాలని తీవ్రంగా ప్రయత్నించి ఓడిపోయిన బుద్ధదేవ్ సర్కార్ లాల్‌గఢ్‌లోనైనా తన ఎజెండాను అమలు చేయాలనుకుంది. అందుకే ప్రజల నుండి వచ్చే తీవ్ర నిరసనను లక్ష్యపెట్టకుండా 2008 నవంబర్ 2న ఈ సెజ్ శంకుస్థాపనకు సిద్ధపడింది. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో బుద్ధదేవ్, పశ్చిమ బెంగాల్ పరిశ్రమల మంత్రి నిరుపమసేన్‌లు తమ ప్రసంగాల్లో తన ప్రయోజనాలకోసం కాకుండా సామాజిక ప్రయోజనంకోసమే ఈ సెజ్‌ను స్థాపిస్తున్నట్టుగా జిందాల్‌ను పొగిడారు.

దోపిడీని సామాజిక సేవగా అభివర్ణించేంతగా దిగజారిన వామపక్ష ప్రభుత్వంపై దాని నేత బుద్ధదేవ్‌పై ప్రజలు తీవ్రంగా మండిపడ్డారు. ఒక్క ఈ విషయంలోనే కాదు గత మూడు దశాబ్దాల పాలనలో తమను అభివృద్ధికి దూరంగా వుంచిన వామపక్ష ప్రభుత్వంపై ఈ ప్రజానీకంలో తీవ్రమైన అసంతృప్తి పేరుకొని వుంది. ఈ ప్రాంతంలో బలంగా వున్న మావోయిస్టు పార్టీ ఈ అసంతృప్తిని రాజ్యాధికార లక్ష్యం దిశగా మళ్లించింది. ప్రజల్లో అనేక సంవత్సరాలుగా పేరుకుపోయిన రాజ్యాధికార లక్ష్యం దిశగా మళ్లించింది. ప్రజల్లో అనేక సంవత్సరాలుగా పేరుకుపోయిన

ప్రజాగ్రహానికి భౌతిక రూపం ఇవ్వడం కోసం శంకుస్థాపనచేసి తిరిగి వస్తున్న బుద్ధదేవ్ కాన్వాయ్‌పై సల్బనీ–మేదినీపూర్ రోడ్డు మీద కలయ్‌చండీ వద్ద పి.ఎల్.జి.ఎ. మందుపాతర పేల్చింది. అందులో తృటిలో ప్రాణాపాయాన్ని తప్పించుకున్న బుద్ధదేవ్ ఈ దాడిని సాకుగా చేసుకొని సెజ్‌కు వ్యతిరేకంగా ఉద్యమిస్తోన్న లాల్‌గఢ్ ప్రజలపై విచక్షణారహితమైన దాడులకు ఆదేశించాడు.

## లాల్‌గఢ్‌పై విరుచుకువడ్డ సోషల్ ఫాసిస్టు ప్రభుత్వం

ప్రభుత్వ ఆదేశానుసారం పోలీసులు లాల్‌గఢ్ ప్రాంతంలోని 35 గ్రామాలపై విచక్షణారహితంగా దాడులు చేసి బీభత్సం సృష్టించారు. లాల్‌గఢ్‌లోని ఛోటోపేలియ అనే గ్రామం మీద 2008 నవంబర్ 5న దాడిచేసి ప్రజలను విచక్షణారహితంగా కొట్టారు. తన భర్తను పోలీసులు గుంజుకుపోతున్నందుకు అడ్డం వచ్చిన చితాముని ముర్ము అనే మహిళను తుపాకీ మడమతో మొహం మీద దారుణంగా కొట్టడం వల్ల ఆమె ఎడమ కన్ను చితికిపోయి శాశ్వతంగా చూపును కోల్పోయింది. అలాగే గర్భవతి అయిన లక్ష్మి ప్రొతిహార్‌ను కూడా ఆమె భర్తను గుంజుకుపోతుంటే అడ్డం వచ్చిందనే నెపంతో విచక్షణారహితంగా ఈడ్చుకుపోయి రోడ్డుమీద పడేసి దారుణంగా కొట్టారు. ఇంకా ఇటువంటి దారుణాలు ఎనెన్నో చేశారు. ఎంతోమంది ప్రజలను ఈడ్చుకుపోయి లాకప్‌లలో బంధించారు. మహిళలనూ, వృద్ధులను కూడా విచక్షణారహితంగా ఈడ్చుకువెళ్ళి లాకప్‌లలో బంధించారు. పి.ఎల్.జి.ఎ. బుద్ధదేవ్‌పై చేసిన దాడిలో సంబంధం వుందని చాలా మందిపై కేసులు పెట్టారు. లాల్‌గఢ్ పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జ్ సుదీప్ సిన్హారాయ్ పశ్చిమ మేదినీపూర్ జిల్లా ఎస్.పి.ల నాయకత్వంలో ఈ దాడి జరిగింది. నిజానికి బుద్ధదేవ్‌పై పి.ఎల్.జి.ఎ. దాడి చేసిన ప్రదేశానికి లాల్‌గఢ్ ప్రాంతం చాలా దూరంలో వుంది. అంత దూరంలో వున్న ప్రజలు ఈ దాడికి కారకులని ప్రభుత్వం కుట్రపూరితంగా చెపుతున్నది. లాల్‌గఢ్ ప్రజలు చైతన్యవంతమవడం ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడటం వల్ల ప్రభుత్వానికి లక్ష్యంగా ఈ ప్రాంతం మారింది. కనుక దీనిపై పెద్ద ఎత్తున దాడి చేయడానికి బుద్ధదేవ్‌పై జరిగిన చర్యను సాకుగా ఎంచుకున్నారు.

ప్రజలపై విచక్షణారహితంగా చేసిన ఈ దాడుల్లో రాష్ట్ర పోలీసులతో పాటు సి.పి.ఎం. ప్రయివేట్ గూండాసేన హర్మద్ వాహిని కూడా పాల్గొంది. పశ్చిమ బెంగాల్‌లో మొదటి నుండి ప్రయోగిస్తున్న రాజ్యహింసలో హర్మద్ వాహినికి తగిన భాగస్వామ్యం వుంది. ప్రజలపై దౌర్జన్యాలు చేయడం, అత్యాధునిక ఆయుధాలను విచక్షణారహితంగా ప్రయోగించి హత్యలు చేయడం, స్త్రీలపై అత్యాచారాలు చేయడం వంటి దారుణాలతో హర్మద్‌వాహిని కుఖ్యాతిగాంచింది. ఈ తరహా చర్యలతో నందిగ్రామ్ పోరాటాన్ని అణచడానికి హర్మద్ వాహిని ఎన్నో అకృత్యాలకు పాల్పడినట్టుగానే, లాల్‌గఢ్ పోరాటాన్ని అణచడానికి ఇది దారుణమైన ఆకృత్యాలకు పాల్పడింది.

## ఎగిసిన ప్రజాపోరు కెరటం

ప్రభుత్వం తమపై తలపెట్టిన దాడికి వ్యతిరేకంగా లాల్‌గఢ్ ప్రజలు వీరోచితంగా తిరగబడ్డారు. 2008 నవంబర్ 7న వేల సంఖ్యలో స్త్రీలూ, పురుషులు, పిల్లలూ, వృద్ధులు సాంప్రదాయక ఆయుధాలతో కదిలి రోడ్లను తవ్విపోశారు. రోడ్లపై చెట్లను నరికి అడ్డం వేశారు. టెలిఫోన్ వైర్లనూ, విద్యుత్ వైర్లను తెంచేశారు. ఆవిధంగా వారు మేదినీపూర్, బంకురాలకు మిగతా ప్రపంచంతో సంబంధంలేకుండా చేశారు. ఈ ప్రతిఘటన నందిగ్రామ్ తరహాలో జరిగింది. నవంబర్ 6న 12 వేల మంది సాంప్రదాయక ఆయుధాలు ధరించి లాల్‌గఢ్ పోలీస్ స్టేషన్‌ను ఘెరావ్ చేశారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో వున్న పలు వాహనాలను ధ్వంసం చేశారు. ఆదివాసుల రక్తాన్ని పోలీసులు ఎందుకు కళ్ళచూసారో చెప్పాలనీ, లేకుండా పరిస్థితి విషమిస్తుందని మైకుల ద్వారా ప్రజలు డిమాండ్ చేశారు. ప్రజల ఆగ్రహం ఏస్థాయిలో వుందంటే స్త్రీలూ, పురుషులు, పిల్లలు ప్రతి ఒక్కరు తమమీద అన్యాయంగా దాడి చేసిన పోలీసు అధికారులు రక్తానికి రక్తం చిందించాల్సిందే అని నినదించారు. సంతాల్‌లకు చెందిన వివిధ సంస్థలూ, 'భారత్ జకత్ మాఝి మద్వా జువన్ గావోంట' ఈ పోరాటానికి నాయకత్వం వహించాయి.

## పోలీసు అత్యాచారాల వ్యతిరేక కమిటీ ఆవిర్భావం

లాల్‌గఢ్ ప్రజలు తమ ఉద్యమానికి నిర్మాణాత్మక స్వరూపం ఇవ్వడం కోసం నవంబర్ 8న పీపుల్స్ కమిటీ ఎగెనెస్ట్ పోలీస్ అట్రాసిటీస్ (పి.సి.ఎ.పి.ఎ.–పోలీసు అత్యాచారాల వ్యతిరేక కమిటీ) ఏర్పడింది. భారత్ జకత్ మాఝి మద్వా వంటి సాంప్రదాయక ఆదివాసీ సంస్థలేవీ అప్పటి పోరాట అవసరాలను తీర్చలేవని ప్రజలు భావించారు. అందుకే పోరాటాన్ని సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్ళగలిగే నూతన సంస్థను ఏర్పాటు చేసుకున్నారు. ఉద్యమం విస్తరిస్తున్న కొద్దీ ఈ కమిటీలో 200 గ్రామాలు చేరాయి. ఇదొక పెద్ద ఆదివాసీ తిరుగుబాటుగా ముందుకు వచ్చింది. సి.పి.ఎం. అభిమానులూ, కిందిస్థాయి కార్యకర్తలు కూడా ఈ తిరుగుబాటులో చేరారు. ఈ పి.సి.ఎ.పి.ఎ. ఏర్పడిన వెంటనే 13 డిమాండ్లను రూపొందించింది. పోలీసులపై విచక్షణారహితంగా దాడులకు పాల్పడ్డందుకు పశ్చిమ మేదినీపూర్ ఎస్.పి. చెవులు పట్టుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలనీ, నవంబర్ 5న ఛోటోపేలియ

గ్రామంపై దాడిచేసిన పోలీసులు ముక్కు నేలకు రాస్తూ దలీల్‌పూర్ చౌక్ నుండి ఛోటోపేలియ గ్రామం వరకు రోడ్డు మీద పాకాలనీ, పోలీసు దాడులను ఆపేయాలనీ, పోలీసు క్యాంపులు ఎత్తేయాలనీ, రాత్రుళ్లు పోలీస్ పెట్రోలింగ్స్ ఆపేయాలనీ, ప్రభుత్వ కార్యాలయాల్లో పోలీసు క్యాంపులను ఏర్పాటు చేయడం నిలిపివేయాలనీ దాడులకు గురైనవారికి నష్టపరిహారం చెల్లించాలనీ, ధ్వంసమైన ఆస్తులకూ నష్టపరిహారం చెల్లించాలనేది ఈ డిమాండ్ల సారాంశం. పోలీసులకూ, రాజ్యహింసకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడిన ఈ డిమాండ్లకు 2009 జనవరి 25న మరికొన్ని డిమాండ్లను చేర్చారు. ఈ కొత్త డిమాండ్లు ప్రజల జీవనాధారానికీ, స్వయం పాలనకూ, ఉపాధి అవకాశాలకు కొత్త నమూనాను అభివృద్ధిపర్చడం, ప్రభుత్వ నమూనాను తిరస్కరించడం, సంతాల్ భాషనూ, సంస్కృతిని అభివృద్ధి పర్చడం ఇంకా ఆరోగ్యం, విద్య, వ్యవసాయం మొదలైనవాటికి సంబంధించినవి. 2008 నవంబర్‌లో మొదలై 2009 జూన్‌లో పారామిలటరీ బలగాలు ప్రవేశించేవరకు సాగిన ఈ ఆదివాసీ తిరుగుబాటుకు పి.సి.ఎ.పి.ఎ. నేతృత్వం వహించింది. దాదాపు 8 నెలల కాలంపాటు ఉత్తేజకరంగా జరిగిన ఈ పోరాటాన్ని నాలుగు దశలుగా చెప్పుకోవచ్చు. 2008 నవంబర్ నుండి మొదటి దశ. ఎన్నికల ప్రకటన వెలువడినప్పటి నుంచి రెండవ దశ. 2009 జూన్ నుంచి మూడవ దశ కాగా ప్రభుత్వం పారామిలటరీ బలగాలను ప్రయోగించడం నాలుగవ దశ.

ఈ ఎనిమిది నెలల కాలంలో అనేక పోరాట రూపాలు ముందుకు వచ్చాయి. వాటిలో పోలీసులను సామాజిక బహిష్కరణ చేయటం ఒకటి. తాము పాల్పడ్డ దౌర్జన్యాలకు క్షమాపణలు చెప్పడానికి నిరాకరించినందుకు జంగల్‌ఖండ్ ప్రాంతంలో ఇలా పోలీసులు సామాజిక బహిష్కరణకు గురయ్యారు. పి.సి.ఎ.పి.ఎ. పిలుపుమేరకు దుకాణదారులూ, చెప్పులు కుట్టేవాళ్లు, మంగలివాళ్లు అందరూ పోలీసులకు సేవలు అందించడం మానేసారు. చివరికి నీటి సరఫరా కూడా నిలిచిపోయింది. పోలీసులకు సరుకులు అమ్మినందుకు ఒక వ్యాపారస్తుడిచేత ప్రజలు గుంజీలు తీయించారు. ఇలా సామాజిక బహిష్కరణకు గురైన పోలీసులు పోలీస్ స్టేషన్లలో దాదాపు బందీలుగా వున్నారు. పోలీసుగానీ, సి.పి.ఎం. గూండాలు (హర్మద్ వాహిని)గానీ గ్రామాల్లోకి అడుగుపెట్టకూడదని రోడ్ల మీద ప్రకటనలు వేళాడదీశారు. ఈ కాలమంతా అనేక గ్రామాల్లోకి పోలీసులుగానీ, సి.పి.ఎం. గూండాలుగానీ అడుగుపెట్టలేకపోయారు.

ఎన్నికల ప్రకటన తర్వాత మొదలైన రెండవ దశ పోరాటంలో ఎన్నికల నిర్వహణ కోసం పోలీసులనుగానీ, కేంద్ర బలగాలనుగానీ తమ ప్రాంతంలోకి అడుగుపెట్టనీయకుండా బహిష్కరించాలని పి.సి.ఎ.పి.ఎ. నిర్ణయించింది. ఎన్నికల ప్రచారం కోసం తమ ప్రాంతంలోకి ఎవరైనా రావచ్చనీ, వాళ్లకు ఎటువంటి హాని కల్గించమనీ, అయితే వారివెంట పోలీసు బలగాలను తెచ్చుకోకూడదని ప్రకటించింది. ఎన్నికల నిర్వహణకు ప్రజలు సహకరిస్తారనీ, ఏ బలగాలు అవసరం లేదని ప్రకటించింది. తాము ఎన్నికలను బహిష్కరించడంలేదనీ, ఎన్నికల్లో సి.పి.ఎం.ను ఓడించాలనేది తమ నినాదమని పి.సి.ఎ.పి.ఎ. చెప్పింది. అయినప్పటికి ప్రభుత్వం బలగాలను పంపాలని నిశ్చయించుకుంది. ఉద్యమం ఎంత బలంగా వుందో పరీక్షించేందుకు 2009 మార్చి 21న ఈ ప్రాంతానికి ఐ.ఆర్.బి. బలగాలను పంపింది. ఈ బలగాలను ప్రజలు, పి.ఎల్.జి.ఎ. కలిసి లాల్‌గఢ్‌లోని పేలియాచౌక్ వద్ద ఆపివేశారు. వాళ్ల తుపాకులను స్వాధీనం చేసుకొని వారిని దిగ్బంధించారు. ఈ పోలీసులను మహిళలు పెద్ద ఎత్తున చుట్టుముట్టారు. ఐ.ఆర్.బి. బలగాలను కాపాడటానికి వచ్చిన పోలీసు బలగాలను కూడా అడ్డుకున్నారు. చివరికి నవంబర్ 5న ఛోటాపేలియాపై దాడి చేసి ఆదివాసీ ప్రజలను ముఖ్యంగా మహిళలను చిత్రహింసలు పెట్టడం తప్పనీ, ఖాస్ జంగల్‌లో ఫిబ్రవరి 2న ముగ్గురు పి.సి.ఎ.పి.ఎ. కార్యకర్తల్ని చంపడం తప్పని ఐ.ఆర్.బి. అసిస్టెంట్ కమాండెంట్ లిఖితపూర్వకంగా ఒప్పుకున్నాకే పోలీసులను వదిలేసారు. ఎన్నికల నిర్వహణకు పోలీసు బలగాలను పంపిస్తే పి.సి.ఎ.పి.ఎ. ఎన్నికల బహిష్కరణ పిలుపునిస్తుందని హెచ్చరించారు. అయినప్పటికీ ప్రభుత్వం బలగాలను పంపాలనే మొండిగా నిశ్చయించుకొని ఆ ప్రయత్నాలను కొనసాగిస్తుంటే దానిని నిరోధించడానికి పి.సి.ఎ.పి.ఎ. లాల్‌గఢ్–బరోపేలియా, రామ్‌గఢ్ అనే రెండు ప్రవేశ మార్గాలలో చెక్ పోస్టులను ఏర్పాటు చేసింది. ఇలా ప్రజలు చెక్ పోస్టులను ఏర్పాటు చేయడం అనేది ప్రజాఉద్యమాల చరిత్రలో నూతనమైనది. ప్రజల్లోని రాజ్యాధికార స్పృహను స్పష్టం చేస్తుందిది. చివరికి ఎన్నికల కమీషన్ ఈ ప్రాంతాల పరిధి నుంచి పోలింగ్ బూతులను తరలించడానికి అంగీకరించింది.

మూడవ దశ పోరాటం జూన్‌లో మొదలయింది. 2009 జూన్ 5న కావో (కమిటీ ఆన్ వయొలెన్స్ ఎగెనెస్ట్ విమెన్) పి.సి.ఎ.పి.ఎ. మహిళా విభాగం వాళ్లు కలిసి సాంప్రదాయక ఆయుధాలతో ర్యాలీని తలపెట్టారు. కానీ ప్రభుత్వం అనుమతివ్వలేదు. అంతేగాక ఈ ర్యాలీ గురించి ప్రచారం చేయడానికి ఝార్ఖండ్‌కు వెళ్లిన కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. ఎంతోమంది మహిళలను వేధించారు. చకూలియ పోలీస్ స్టేషన్‌లో ఒక మహిళపై అత్యాచారం చేశారు. ఇదే సమయంలో సి.పి.ఎం. గూండాలు తాము కోల్పోయిన ప్రాంతాలను తిరిగి తమ చేతుల్లోకి తీసుకోవడానికి తీవ్రంగా ప్రయత్నించారు. పలువురు పి.సి.ఎ.పి.ఎ. సభ్యులపై కాల్పులు జరిపారు. వీటన్నింటినీ వ్యతిరేకిస్తూ ఉద్యమం ఉధృతం అయింది.

మరెన్నో ప్రాంతాలకు వ్యాపించింది. లాల్‌గఢ్‌తోపాటు 11 కిలోమీటర్లమేర 49 గ్రామాలు పి.సి.ఎ.పి.ఎ. అధీనంలోకి వచ్చాయి. సి.పి.ఎం.కు పెట్టనికోటగా వున్న ధరంపూర్‌లోని సి.పి.ఎం. కార్యాలయాన్ని కూడా స్వాధీనం చేసుకుంది. ఈ క్రమంలో సి.పి.ఎం. గూండాలకూ, గెరిల్లాలకు నడుమ కొన్ని ప్రాంతాల్లో ఐదు రోజులపాటు కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో 14 మంది సి.పి.ఎం. గూండాలు చనిపోయారు. క్రమంగా ధరంపూర్ ప్రాంతం పి.సి.ఎ.పి.ఎ. చేతుల్లోకి వచ్చింది. సి.పి.ఎం. జోనల్ సెక్రటరీ అనుజ్‌పాండే ప్రాణాలు అరచేత పట్టుకొని ఊరు విడిచి పారిపోయాడు. అనేక పోలీసు క్యాంపులనూ, సి.పి.ఎం. కార్యాలయాలనూ, నాయకుల ఇండ్లను తగులబెట్టారు లేదా కూలగొట్టారు. పరమ క్రూరుడైన అనుజ్‌పాండే విలాసవంతమైన భవనం కూడా ప్రజల క్రోధాగ్నిలో దగ్ధమైంది. అనుజ్‌పాండే ఇల్లు తగులబెట్టడాన్ని ఆదివాసీ మహిళలు దసరా పండుగతో పోల్చారు. పాండే వల్ల తాము ఎన్ని దారుణాలకు గురయ్యారో వారు ఈ సందర్భంగా తలుచుకున్నారు. ఇక్కడ సి.పి.ఎం. కార్యాలయాలే ప్రభుత్వ యంత్రాంగాన్ని శాసిస్తాయి. ఏ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవర్ని అరెస్టు చేయాలో, ఏ కోర్టు ఎవరికి బెయిల్ ఇవ్వాలో, ఎవరికి ఇవ్వకూడదో కూడా పార్టీ కార్యాలయాలు నిర్ణయిస్తాయి. అణచివేత చిహ్నాలయిన ఈ పార్టీ కార్యాలయాలను ప్రజలు కసిగా కూలగొట్టారు. ప్రజల తిరుగుబాటుకు తట్టుకోలేక సి.పి.ఎం. నాయకులూ, పోలీసులు ఈ ప్రాంతాన్ని వదిలి వెళ్లిపోవడమేకాదు అనేక పోలీసు క్యాంపులను ప్రభుత్వం అక్కడి నుంచి తరలించింది. కొన్ని క్యాంపులు, స్టేషన్లు దిగ్బంధానికి గురయ్యాయి.

## నూతన అభివృద్ధి నమూన

ఇలా పోరాటాన్ని అప్రతిహతంగా ముందుకు తీసుకువెళు తూనే మరోవైపు పి.సి.ఎ.పి.ఎ. ప్రజల ప్రాథమిక అవసరాలను దృష్టిలో పెట్టుకొని కొన్ని అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించింది. ఈ అభివృద్ధి నమూనా పశ్చిమ బెంగాల్‌లోని వామపక్షాల ప్రభుత్వం ఆమాటకొస్తే దేశవ్యాప్తంగా 1947 నుంచి సామ్రాజ్యవాద కనుసన్నల్లో జరుగుతున్న అభివృద్ధి నమూనావంటివి కాదు. సరిగ్గా ఈ 'అభివృద్ధి' నమూనాకు వ్యతిరేకమైనవి. ఈ 'అభివృద్ధి' నమూనాతో తలపడేది. స్వావలంబనకూ, సంపదను సమానంగా పంపిణీ చేయడానికీ, అట్టడుగు ప్రజల ప్రయోజనానికీ కట్టుపడినది. వివిధ సామ్రాజ్యవాద, దోపిడి వర్గాల నియంత్రణనూ, దోపిడీని సవాల్ చేసేది. ఈ విప్లవకర అభివృద్ధి నమూనా ఇప్పటికే విప్లవోద్యమం బలంగా వున్న దండకారణ్యం, బీహార్–జార్ఖండ్ వంటి ప్రాంతాల్లో ప్రారంభమై దోపిడీ వర్గాల అభివృద్ధి నమూనాను సవాల్ చేస్తోంది. లాల్‌గఢ్ ప్రాంతంలో కూడా ఇటువంటి విప్లవకర అభివృద్ధి నమూన ప్రారంభమైంది. తాగునీరు, సాగునీరు, రోడ్లు, ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ కార్యక్రమాల ద్వారా ఈ ప్రాంతంలోని రెండు లక్షల ప్రజలు గత మూడు దశాబ్దాలకు పైగా వామపక్షాల పాలనలో ఎన్నడూ చవిచూడని అభివృద్ధిని చూస్తున్నారు. ఇలా లాల్‌గఢ్ ప్రాంతం ప్రజల పరిపాలనతో విముక్తి ప్రాంతాన్ని తలపించింది.

## పోరులో సగమైన మహిళలు

లాల్‌గఢ్ పోరాటంలో మహిళలు చాలా చురుకైన పాత్రను పోషిస్తున్నారు. వాళ్లు గురవుతున్న రెట్టింపు అణచివేత వాళ్లను మరింతగా పోరాటాల్లోకి నడిపిస్తోంది. ఎక్కడైనా ఉద్యమాలను అణచివేయడానికి మహిళలపై హింసను ఒక పథకం ప్రకారం అమలు చేస్తుంది రాజ్యం. ఈ కారణంగా సి.పి.ఎం. పార్టీ, పోలీసులు చేస్తున్న దాడుల్లో ఇక్కడి మహిళలు తరచుగా బాధితులవుతున్నారు. మహిళలు మరింత ప్రతిఘటించడం ద్వారానే ఈ నిర్బంధాన్ని ఎదుర్కోదల్చారు. పీడిత వర్గంగా వాళ్లు గురయ్యే అణచివేతకు పితృస్వామ్యం కూడా తోడయింది. ఈ ప్రాంతంలో పురుషులకు మద్యపాన అలవాటు బాగా వుంది. ఇది మహిళలపై హింసను మరింత పెంచుతుంది. కనుక ఈ మహిళలు సామాజిక మార్పుకోసం పోరాడుతూనే రాజ్యహింసతో పాటు గృహ హింస మొదలైన పితృస్వామ్య హింసకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. 2009 మార్చి 8న పి.సి.ఎ.పి.ఎ.కు అనుబంధంగా మహిళా కమిటీ ఏర్పడింది. పి.సి.ఎ.పి.ఎ. ఏర్పాటు చేస్తోన్న ప్రతి గ్రామ కమిటీలోనూ సగం మంది మహిళలు తప్పకుండా వుంటారు. దీని కేంద్ర కమిటీలో 35 మంది వుంటే వారిలో 12 మంది మహిళలు వున్నారు. ఇలా కమిటీల్లో చురుకైన పాత్ర వహిస్తున్న మహిళలు పోరాటాల్లోను చురుగ్గా పాల్గొంటున్నారు. ఛాట్‌రాజేరా గ్రామంలో మావోయిస్టులు వున్నారనే సమాచారంతో పోలీసులు వెళ్లారు. అక్కడ ఒక బాలున్ని విచక్షణారహితంగా కొట్టారు. దీంతో గ్రామస్తులంతా ఒక్కటయి మొత్తం పోలీసు బలగాలను చుట్టుముట్టారు. దీంట్లో మహిళలు ముందువరసలో నిలబడ్డారు. ఈ ప్రతిఘటనకు పోలీసులు తలవంచకతప్పలేదు. ఇలా మహిళలు కీలకపాత్ర పోషించిన ఘటనలు అనేకం.

## ఫాసిస్టు అణచివేత

ఇలా రాష్ట్ర సోషల్ ఫాసిస్టు ప్రభుత్వానికీ, కేంద్ర ప్రభుత్వానికే గాక సామ్రాజ్యవాదులకూ కలవరం కలిగిస్తున్న ఈ పోరాటాన్ని అణచడానికి పాలకవర్గాలు తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించాయి. రాష్ట్ర ప్రభుత్వం అడిగిందే తడవుగా కేంద్ర ప్రభుత్వం జూన్ 18న ఐదు కంపెనీల బి.ఎస్.ఎఫ్., ఎనిమిది కంపెనీల సి.ఆర్.పి.ఎఫ్.

బలగాలను పంపింది. ఆ తర్వాత బలగాలను మరింత పెంచుతూపోయింది. కోబ్రా, గ్రేహౌండ్స్ బలగాలను కూడా పంపింది. ఈ బలగాలకుతోడు రాష్ట్ర పోలీసులూ, సి.పి.ఎం. గూండా మూకలు ఎలానూ వున్నాయి. సల్వాజుడుం తరహాలోనూ కొన్ని ముఠాలను తయారుచేసి ప్రయోగించింది. ఇంత పెద్దఎత్తున బలగాలను మోహరించడానికి సాధికారతను కల్పించుకోవడంకోసం మావోయిస్టులూ, ప్రజలు పెద్దఎత్తున సాయుధంగా తిరగబడుతున్నారనీ, మావోయిస్టు పార్టీ దీన్ని విముక్తి ప్రాంతంగా ప్రకటించిందని పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. ప్రజలు పెద్ద ఎత్తున తిరగబడింది నిజమే కానీ వాళ్లు తిరగబడింది సాంప్రదాయక ఆయుధాలతోనే. చాలా మంది నిరాయుధంగానే ప్రతిఘటించారు. ఇలా సాంప్రదాయక ఆయుధాలతో పోరాడుతున్న ప్రజలపైకి అత్యాధునిక ఆయుధాలతో వేల సంఖ్యలో అర్ధ సైనిక బలగాలను పంపడం ప్రభుత్వ పాశవిక అణచివేత వైఖరికి నిదర్శనం. ఇంత పెద్ద ఎత్తున బలగాలు తరలివచ్చినప్పటికీ ప్రజలు వెరవకుండా సాయుధ బలగాలను తమ గడ్డమీద అడుగుపెట్టకుండా అడ్డుకోవడానికి వీరోచితంగా ప్రతిఘటించారు. అయితే భాష్పవాయు గోళాలు ప్రయోగించి, విచక్షణారహితంగా లాఠీ ఛార్జ్ చేసి నిరాయుధ ప్రజలపై విరుచుకుపడి వారిని చెల్లాచెదురుచేస్తూ పట్టుకొని బంధించి శిబిరాల్లోకి తరలిస్తూ నెమ్మదిగా ముందుకుసాగారు. జూన్ 20న పోలీసులు జరిపిన కాల్పుల్లో ముగ్గురు మరణించారు. ఇలా ఒక్కో ప్రాంతాన్ని పాశవిక బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఈ బలగాలు లాల్‌గఢ్‌లో అడుగుపెట్టేంతవరకూ లాల్‌గఢ్ పోలీసులు పోలీస్ స్టేషన్‌లో తాళాలు వేసుకొని లోపల కూర్చొని వున్నారు. ప్రభుత్వ బలగాలు వచ్చిన తర్వాత మాత్రమే వాళ్లు తాళాలు తీసుకొని బయటకు వచ్చారంటే ప్రజల తిరుగుబాటు ఏ స్థాయిలో వుందో అర్థం చేసుకోవచ్చు. ఫాసిస్టు సాయుధ బలగాలను ప్రయోగించడంతోపాటు పోరాటాన్ని పక్కదారి పట్టించడానికి ప్రభుత్వం కొన్ని సంస్థలను కూడా ఏర్పాటు చేసింది.

ఇలా ఒకవైపు పాశవిక అణచివేతకు పాల్పడుతూనే మరోవైపు చర్చలకు సిద్ధమని బుద్ధదేవ్ కుట్రపూరితంగా ప్రకటన చేశాడు. దీనికి సమాధానంగా ప్రభుత్వ బలగాలను ఉపసంహరించుకుంటే చర్చలకు సిద్ధమని పార్టీ చేసిన ప్రకటనకు బుద్ధదేవ్ ప్రభుత్వం నుండి ఎటువంటి ప్రతిస్పందన లేకపోవడం చర్చల పట్ల దాని చిత్తశుద్ధిని వ్యక్తం చేసింది.

ఈ పోరాటంపై అణచివేతకు పరాకాష్టగా కేంద్ర హోంమంత్రి చిదంబరం 2009 జూన్ 22న ఈ పోరాటానికి నాయకత్వం వహిస్తున్న మావోయిస్టు పార్టీని దేశవ్యాప్తంగా నిషేధిస్తూ ప్రకటన చేశాడు. ఒక న్యాయమైన, సహేతుకమైన, దేశ ప్రయోజనాలకు కట్టుబడి జరుగుతున్న ప్రజా ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న పార్టీని నిషేధించడమంటే ప్రభుత్వాలు తమ అప్రజాస్వామికతను ఎంత బహిరంగంగా చాటుకుంటున్నాయో, ఇది ప్రజలకు ఎంత ప్రమాదకరమైన హెచ్చరికనో అర్థం చేసుకోవచ్చు.

## చరిత్రను ప్రభావితం చేసే 'లాల్‌గఢ్'

పలు భారీ ప్రాజెక్టులనూ, సెజ్‌లనూ, బహుళజాతి కంపెనీలను దేశవ్యాప్తంగా నిర్మించడానికి దోపిడీ వర్గాల తొత్తులయిన ప్రభుత్వాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఇది నేడు దేశవ్యాప్తంగా ఆందోళనాకరమైన పెద్ద సమస్యగా పరిణమించింది. ఇవి ఒకవైపు ప్రజలను పెద్ద ఎత్తున నిర్వాసితులనుచేస్తూ, ఉపాధిని దెబ్బతీస్తూ వారి భవిష్యత్‌ను అంధకారం చేస్తున్నాయి. మరోవైపు దేశ సంపదను సామ్రాజ్యవాద దేశాలూ, బహుళజాతి కంపెనీలూ, దళారీ పెట్టుబడిదారీ వర్గాలు కొల్లగొట్టడానికి సాధనాలుగా వుపయోగపడుతూ దేశ భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. వీటి నిర్మాణం, ఏర్పాటును సులభతరం చేయడానికి వీటిని అడ్డగిస్తోన్న విప్లవోద్యమంపై, ఉద్యమకారులపై తీవ్రమైన అణచివేతను ప్రయోగిస్తున్నాయి. సల్వాజుడుం వంటి ఊచకోతకు పాల్పడుతున్నాయి. ఇటువంటి పరిస్థితిలో పశ్చిమ బెంగాల్‌లో ముందుకు వచ్చిన సింగూర్, నందిగ్రాం వంటి పోరాటాలు దళారీ ప్రభుత్వాల దోపిడీ ఎజెండాను అడ్డగించాయి. లాల్‌గఢ్ పోరాటం ఆకోవలో మరింత ఉన్నత స్థాయిలో జరిగి కొద్ది కాలమే అయినా "విముక్తి ప్రాంతం" స్థాయిలో మనగలిగి ప్రజల్ని పెద్ద ఎత్తున పోరాటోన్ముఖులను చేసి దేశవ్యాప్తంగా నిర్వాసిత ప్రజలకూ, సామ్రాజ్యవాద వ్యతిరేకులకూ, ప్రజాస్వామ్యవాదులకూ స్వావలంబనను ఆకాంక్షించేవారికీ ఒక ఆచరణీయమైన నమూనాగా నిలిచింది. ప్రజలు పెద్ద ఎత్తున తిరగబడినా ఆ స్థాయిలో పార్టీ, ప్రజా సైన్యం అభివృద్ధి చెందకపోవడంవలన అక్కడి ఉద్యమాన్ని ఎత్తుగడలపరంగా రిట్రీట్ చేసుకోవాల్సి వచ్చింది. ఈ సందర్భంగా దండకారణ్య విప్లవోద్యమాన్ని గుర్తు తెచ్చుకోవడం సముచితం. దండకారణ్యంలోని విలువైన ఖనిజ, అటవీ సంపదను సామ్రాజ్యవాదులకు కట్టబెట్టడంకోసం ఇక్కడి భారత పాలకవర్గాలు సామ్రాజ్యవాద అండదండలతో సల్వాజుడుం అనే ఫాసిస్టు హత్యాకాండను ప్రారంభించింది. అయితే ఇక్కడ పాతికేళ్లుగా కొనసాగుతున్న విప్లవోద్యమం, బలమైన పార్టీ, ప్రజాసైన్యం సల్వాజుడుంను తిప్పికొట్టి ప్రభుత్వ దోపిడి ఎజెండాను అడ్డగించింది. కాబట్టి దేశవ్యాప్తంగా బలమైన పార్టీనీ, ప్రజాసైన్యాన్ని నిర్మించుకోవాల్సిన ఒక చారిత్రక ఆవశ్యకతను లాల్‌గఢ్ పోరాటం ప్రజలకు స్పష్టం చేసింది. కనుక దేశవ్యాప్తంగా పార్టీనీ, ప్రజాసైన్యాన్నీ, ఐక్య సంఘటనను బలోపేతంచేసి విముక్తి ప్రాంతాలను నిర్మిద్దాం.

★

# అమరులకు వినమ్ర నివాళి

## అర్బన్ గెరిల్లా, ఇంటలిజెన్స్ నిపుణుడు కామ్రేడ్ ప్రసన్న అమర్ రహే!

విప్లవోద్యమ నిఘా వ్యవస్థ అధిపతి కామ్రేడ్ పటేల్ సుధాకర్‌తో పాటు ఈ రంగంలో విశేషమైన కృషి చేసి ఉద్యమానికి అనేక అనుభవాలనందించిన నవ, యువ, ఔత్సాహిక కామ్రేడ్ వెంకటయ్య (ప్రసన్న, రాజేష్, రాకేష్)ను కోల్పోవడం మొత్తం ఉద్యమానికీ, ప్రత్యేకించి ఈ విభాగానికి ఎనలేని నష్టం.

అనేక ఇతర పేర్లు ఉన్నప్పటికీ కామ్రేడ్ వెంకటయ్య ప్రసన్నగా ప్రజలకూ, పార్టీ శ్రేణులకూ సుపరిచితుడు. ఎందరో పోరువీరులను చరిత్రకు అందించిన ఉత్తర తెలంగాణా పోరుగడ్డ ప్రసన్నను కూడా ఈ చరిత్రకు సగర్వంగా అందించింది. వరంగల్ జిల్లా చేర్యాల మండలం ఐనాపురం కామ్రేడ్ ప్రసన్న (30) స్వగ్రామం. మధ్య తరగతి వ్యవసాయ కుటుంబంలో పుట్టిన ప్రసన్నకు ఒక తమ్ముడు వున్నాడు. ఐనాపురం వరంగల్ జిల్లాలో భాగంగా ఉన్నప్పటికీ మెదక్ సరిహద్దులో వుండడం వల్ల ఈ గ్రామంపై ఉత్తర, దక్షిణ తెలంగాణ ఉద్యమాల ప్రభావం బలంగా వుంటుంది. ఈ గ్రామం మెదక్ జిల్లా గిరాయిపల్లి దళ పరిధిలోకి వస్తుంది. ఉద్యమ ప్రభావం బలంగా వుండడం వల్ల కామ్రేడ్ ప్రసన్న బాల్యంలోనే విప్లవాల బాటపట్టాడు. ఉన్నత పాఠశాలలో చదువుతున్నప్పుడే రాడికల్ విద్యార్థి సంఘంలో చురుగ్గా పని చేసి, 1996 నాటికి పూర్తికాలం కార్యకర్త అయ్యాడు. ఆ తర్వాత పార్టీ ఆదేశం మేరకు మెదక్ జిల్లా సిద్ధిపేట పట్టణంలో ఇంటర్ మీడియట్‌లో చేరి విద్యార్థులను చురుగ్గా సంఘటితం చేశాడు. దానితో ఆయనపై శత్రు నిర్బంధం పెరిగింది. బయట వుంటే తన ప్రాణానికే ముప్పు అని భావించిన పార్టీ కామ్రేడ్ ప్రసన్నను దళ జీవితంలోకి పంపాలని నిర్ణయించింది. పార్టీ నిర్ణయం ప్రకారం గిరాయిపల్లి దళంలో రక్షణ తీసుకుంటూ అప్పుడప్పుడూ బయటకు వెళ్లి వస్తూ పట్టణ విద్యార్థి ఉద్యమానికి నేతృత్వం వహించాడు. అదే సమయంలో దళ ఏరియా గ్రామాల్లోని పాఠశాలలూ, హాస్టళ్లలోని విద్యార్థులను సంఘటితం చేశాడు. క్రమంగా తన కార్యాచరణను పెంచుకుంటూ జిల్లాలోని గ్రామీణ, పట్టణ విద్యార్థి రంగాల్లో విశేషమైన కృషి చేసి జిల్లా విద్యార్థి నాయకుడయ్యాడు. అదే సమయంలో శత్రువుకు ముఖ్యమైన లక్ష్యంగా మారాడు. తన కోసం శత్రువు వేట తీవ్రమైంది. తనతోపాటు పని చేసే ఇద్దరు కామ్రేడ్స్‌ను పోలీసులు పట్టుకొని బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చిచంపారు.

ఈ నేపథ్యంలో కామ్రేడ్ ప్రసన్నను జిల్లాలో కొనసాగించడం ప్రమాదకరం అని భావించిన పార్టీ 2000లో నల్గొండ జిల్లాకు మార్చింది. నల్లగొండ జిల్లా వ్యాప్తంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కళాశాలలూ, పాఠశాలల్లో విద్యార్థి యూనిట్లను నిర్మించి అనేక పోరాటాలకు నాయకత్వం వహించి జిల్లా ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో చురుకైన పాత్ర వహించాడు. తన చురుకైన కార్యాచరణ ద్వారా క్రమంగా రాష్ట్ర విద్యార్థి సంఘ నాయకుడయ్యాడు. రాష్ట్ర విద్యార్థి సంఘ నాయకుడైన కామ్రేడ్ ప్రవీణ్ (భుజంగ రెడ్డి) అమరుడైన తర్వాత ఆ బాధ్యతలను కామ్రేడ్ ప్రసన్న చేపట్టాడు. ఎ.ఐ.ఆర్.ఎస్.ఎఫ్. కార్యవర్గంలోనూ సభ్యుడయ్యాడు.

ఆర్.ఎస్.యు.పై నిర్బంధం రోజు రోజుకూ తీవ్రమై ఎందరో విద్యార్థి నాయకులు అమరులై రాష్ట్ర కార్యవర్గం పని చేయని స్థితిలో రాష్ట్ర విద్యార్థి ఉద్యమాన్ని సమన్వయం చేయడానికి 2001 ప్రారంభంలో అయిదుగురితో ఏర్పడిన కో-ఆర్డినేషన్ కమిటీలో కా. ప్రసన్న సభ్యుడయ్యాడు. 2002లో ఈ కమిటీ రద్దయ్యేంతవరకూ అందులో కొనసాగాడు.

తన సమర్థతలనూ, విద్యార్థి రంగంలో తన చురుకైన పాత్రనూ పరిగణనలోకి తీసుకొని కామ్రేడ్ ప్రసన్నను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ జంటనగరాల ఉద్యమంలోకి పంపింది. అక్కడ ఆయన విద్యార్థి యూనిట్‌కు బాధ్యుడిగా పని చేశాడు. ఆనాటికి జంటనగరాల ఉద్యమంపై నిర్బంధం నిప్పులు చెరుగుతోంది. ఆ సమయంలో దీర్ఘకాలిక దృష్టితో, శత్రువు దృష్టిలో పడకుండా పలు విద్యార్థి కవర్ సంఘాలను నిర్మించాడు. ఆనాడు జంటనగరాల కార్యదర్శిగా వున్న అమరుడు కామ్రేడ్ నోముల రమణా రెడ్డి (మహేందర్) నాయకత్వంలో పట్టణోద్యమ మెళకువలను వంటపట్టించుకొని తన పనిలో సృజనాత్మకతను పెంచుకొని అర్బన్ గెరిల్లాగా పరిణితి సాధించాడు. ఎంత నిర్బంధంలోనైనా పట్టణోద్యమాన్ని నిర్మించగలమనే ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకున్నాడు.

కామ్రేడ్ నోముల రమణారెడ్డి అమరుడైన తర్వాత కామ్రేడ్ ప్రసన్నపై శత్రువు నిఘా తీవ్రమైంది. దానితో రాష్ట్ర కమిటీ తనను 2003 మధ్యలో జంటనగరాల ఉద్యమం నుండి మార్చింది.

ఆనాటికి మెదక్ జిల్లా ఉద్యమం బాగా దెబ్బతిని రిట్రీట్‌కు

గురయి వుంది. ఉద్యమాన్ని కొనసాగించడానికి అక్కడ కొన్ని శక్తులను కొనసాగించాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. 2003 మధ్యలో ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్నతను పార్టీని విడిచి వెళ్లాడు. దానితో ఆ జిల్లా ఉద్యమ బాధ్యుడిగా కామ్రేడ్ ప్రసన్నను పంపాలని 2003 జూలైలో రాష్ట్ర కమిటీ తీర్మానం చేసింది. నిర్బంధంలో తీవ్రంగా దెబ్బతిని, నాయకత్వాన్ని కోల్పోయి వున్న ఉద్యమాన్ని నిలబెట్టగలిగిన దక్షత తనకున్నదని భావించినందువల్లే పార్టీ ఈ నిర్ణయం చేయగల్గింది. అయితే ఆ సమయంలో కామ్రేడ్ ప్రసన్న అనారోగ్యానికి గురికావడం వల్లా, మరికొన్ని ఇతర కారణాల వల్ల ఆ తీర్మానం అమలులోకి రాలేదు. అదే సమయంలో ఎ.పి.ఎస్.సి. ఇంటెలిజెన్స్ విభాగాన్ని ఏర్పాటు చేయాలని తీవ్రంగా ప్రయత్నిస్తూండింది. దానికోసం ఎవర్ని కేటాయించాలనే చర్చలు జరుగుతుండినాయి. పట్టణోద్యమంలో తర్ఫీదు పొందిన కామ్రేడ్ ప్రసన్నను అందుకు అనుగుణంగా మలచుకోవచ్చని ఎ.పి.ఎస్.సి. భావించింది. ఫలితంగా 2004 డిసెంబర్‌లో ఎ.పి.లో మొదటిసారి ఒక విభాగంగా ఏర్పడిన ఇంటలిజెన్స్ యూనిట్‌కి కామ్రేడ్ ప్రసన్న బాధ్యుడయ్యాడు. ఈ బాధ్యతలను అతనికి ఇచ్చే సమయంలోనే పార్టీ తనను డీసీ స్థాయికి ప్రమోట్ చేసింది. ఆనాటికి ఇంటలిజెన్స్ అవసరాలను తీర్చడం కోసం విడి వ్యక్తులను కేటాయించుకున్న అనుభవమే రాష్ట్ర పార్టీకి వుంది. కానీ దానిని రాష్ట్ర స్థాయి విభాగంగా అభివృద్ధి చేయడంలో కామ్రేడ్ ప్రసన్న పాత్ర విశేషంగా ఎన్నదగినది. దీని కోసం లోతైన అధ్యయనం చేశాడు. విస్తృతమైన ప్రజా సంబంధాలను ఏర్పరుచుకొన్నాడు. ఆవిధంగా శత్రువుకు అతి సమీపంలోకి వెళ్లి విలువైన సమాచారాన్ని సేకరించడంలో కీలకమైన పాత్ర వహించాడు. మొదట ఎ.పి.ఎస్.ఎం.సి. గైడెన్స్‌లో పని చేసిన కామ్రేడ్ ప్రసన్న ఆ తర్వాతి కాలంలో సి.ఎం.సి. గైడెన్స్‌లో ప్రత్యేకించి కామ్రేడ్స్ ప్రసాద్, బి.కె.ల గైడెన్స్‌లో పని చేశాడు. సి.ఎం.సి. నేతృత్వంలోనే పని చేసినప్పటికీ 2006 చివరి వరకూ రాష్ట్రాన్నే తన కార్యరంగంగా చేసుకున్నాడు.

ఈ రంగంలో కామ్రేడ్ ప్రసన్న చేసిన విశేషమైన కృషిని దృష్టిలో పెట్టుకొని పార్టీ 2007 ప్రారంభంలో తనను కేంద్ర స్థాయి నిఘా విభాగానికి బదిలీ చేసింది. కామ్రేడ్ పటేల్ సుధాకర్ నేతృత్వంలో అమరత్వం చెందేవరకూ ఈ విభాగంలో పని చేసి పార్టీకి విలువైన సేవలందించాడు. విలువైన ఎంతో సమాచారాన్ని సేకరించాడు. శత్రు విధానాలూ, పథకాలూ, కదలికలకు సంబంధించి పలు నివేదికలను తయారుచేసి పార్టీ ముందుంచాడు. మొత్తంగా ముఖ్యమైన పాత్రను పోషించి ఈ రంగంపై బలమైన ముద్రను వేశాడు. అది విద్యార్థి రంగమైనా, ఇంటలిజెన్స్ అయినా తనకు పార్టీ అప్పగించిన బాధ్యతలను నెరవేర్చడంలో కామ్రేడ్ ప్రసన్న తీవ్రమైన కృషి చేసేవాడు. టెక్నికల్‌గా ఎల్లప్పుడూ అప్రమత్తంగా వుండేవాడు. ఈ జాగ్రత్తవల్లే శత్రు గర్భంలోనే వుంటూ విద్యార్థి రంగంలోనూ, శత్రు గర్భాన్ని శోధిస్తూ ఇంటెలిజెన్సీ రంగంలోనూ చురుకైన పాత్ర వహించాడు. అంతేకాదు తన కార్యాచరణంతా తీవ్ర శత్రువేట నడుమనే సాగింది. తనను యాక్షన్ టీం సభ్యుడని పత్రికల్లో పలుసార్లు ఫోటోలు ప్రచురించి పెద్ద ఎత్తున శత్రువు ప్రచారం చేశాడు. ఈ నేపథ్యంలో అనేక జాగ్రత్తలు తీసుకుంటూ శత్రు వేట నుండి తప్పించుకుంటూ వచ్చాడు. కామ్రేడ్ ప్రసన్న నాయకత్వ రక్షణ పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా వుంటూ అందుకవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకునేవాడు.

కామ్రేడ్ ప్రసన్న రాజకీయ అధ్యయనంపై చాలా శ్రద్ధ పెట్టేవాడు. ఉద్యమావసరాలకు అనుగుణంగా తనను తాను తీర్చి దిద్దుకునేవాడు. 2006 చివర్లో జరిగిన ఎ.ఒ.బి. జోనల్ కాన్ఫరెన్స్‌లో ప్రతినిధిగా పాల్గొని ఆ ఉద్యమంపై అవగాహనను పెంచుకున్నాడు.

కామ్రేడ్ ప్రసన్న ఉన్నత చదువులు చదవకపోయినా, వివిధ భాషల్లో పాండిత్యం లేకపోయినా ఉద్యమావసరాలకు అనుగుణంగా వివిధ రాష్ట్రాల్లో వుంటూ విద్యార్థి, ఇంటలిజెన్స్ వంటి మేధో రంగాల్లో కృషి చేసి విశేషంగా రాణించడం విప్లవోద్యమం గర్వించదగిన విషయం. వీరులు చరిత్రను సృష్టించరనీ చరిత్ర సామాన్యులను అసమాన్యులుగా, వీరులుగా తీర్చిదిద్దుతుందనడానికి కామ్రేడ్ ప్రసన్న ఒకానొక నిదర్శనం.

తను మొదటి నుంచీ మేధో రంగానికే పరిమితమైనప్పటికీ ఎన్నడూ కార్మికవర్గ తత్వాన్ని వీడలేదు. విద్యార్థి ఆర్గనైజర్‌గా వుంటూ రక్షణ కోసం దళాల దగ్గరికి వచ్చినప్పుడు, దళం సమిష్టి పనిలో పాల్గొంటూ, కఠిన శ్రమకు వెరవకుండా ఆదర్శంగా వుండేవాడు. తన బాధ్యతల్లో భాగంగా మహా నగరాల్లో నివసించినప్పటికీ వినిమయ సంస్కృతికి లోనుకాలేదు, జీవన విధానంలో క్రమశిక్షణ తప్పలేదు. మిలటరీ పరంగానూ చురుగ్గా వుండేవాడు. తాను మెదక్, నల్గొండ దళాలతో వున్నప్పుడు జరిగిన పలు ఎన్‌కౌంటర్లలో సమర్థవంతంగా ప్రతిఘటించాడు. 2002 చివర్లో రాష్ట్ర స్థాయిలో జరిగిన అర్బన్ మిలటరీ క్యాంపులో తను పాల్గొన్నాడు. లావుగా వుండే తనకు మొదట్లో దాంట్లో పాల్గొనడం చాలా కష్టమైంది. అయితే ఎంతో కఠిన శ్రమతో తన శరీరాన్ని మలుచుకున్నాడతను. ఫలితంగా క్యాంపు ముగిసేనాటికి మెరుగ్గా రాణించిన వారిలో తనూ ఒకడయ్యాడు.

కామ్రేడ్ ప్రసన్న స్నేహశీలి. ఎల్లప్పుడూ ఉల్లాసంగా పెద్దా, చిన్నా, స్త్రీలూ, పురుషులూ చదువుకున్నవారూ, చదువులేనివారూ

***(మిగతాది 7వ పేజీలో...)***

# ప్రజాయుద్ధం ప్రసవించిన వీరుడు కామ్రేడ్ చందూ అమర్ రహే!

దండకారణ్యంలో ఉర్పల్‌మెట్ట వంటి చారిత్రక దాడి, తాడిమెట్ల వంటి మరెన్నో సాహసోపేత దాడులు భారీ ఎత్తున శత్రు నిర్మూలనను గావించి, పి.ఎల్.జి.ఎ.కు అత్యాధునిక ఆయుధాలను అందించి ప్రజాయుద్ధానికి అపూర్వమైన, విలువైన విజయాలనూ, అనుభవాలనూ అందించాయి. ఈ దాడుల్లో వీరోచితంగా పోరాడి ఈ విజయాల సాధనలో ముఖ్యమైన పాత్రను పోషించిన కామ్రేడ్ చందుని ప్రజాయుద్ధం కోల్పోయింది. 2009 ఏప్రిల్ 10న దక్షిణ బస్తర్ డివిజన్ జేగురుగొండ ఏరియా 'మినుప' గ్రామం వద్ద సి.ఆర్.పి.ఎఫ్.తో హోరాహోరీగా జరిగిన పోరాటంలో ప్రజాయుద్ధ చరిత్రకు మరొక సాహసిక అధ్యాయాన్ని కా. చందు తన రక్తంతోనే రచించి జోడించాడు. ఈ హోరా హోరీ పోరులో కా. చందుతోపాటు కామ్రేడ్స్ బాబు, దస్రు, రింకులు సైతం వీరమరణం పొందారు.

15వ లోక్‌సభ ఎన్నికల్ని బహిష్కరించాలని దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ పిలుపునిచ్చింది. ఆ పిలుపునందుకున్న దక్షిణ్ సబ్ జోనల్ బ్యూరో తన పరిధిలోని మూడు కంబాట్ గెరిల్లా కంపెనీలను కలిపి ఎన్నికల బందోబస్తుకు వచ్చే అర్థసైనిక బలగాలనుగానీ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర స్పెషల్ బలగాలనుగానీ గట్టి దెబ్బకొట్టాలనే నిర్ణయం చేసింది. ఈ నిర్ణయాన్ని అమలుచేయడం కోసం దక్షిణ బస్తర్ ప్రాంతాన్ని ఎంచుకుంది. చింతగుప్ప-చింతల్‌నార్‌ల మధ్య బెటాలియన్ స్థాయి గెరిల్లా బలగాలు అంబుష్ కోసం ఏర్పాట్లు చేసుకున్నారు.

2009 ఏప్రిల్ 10న చింతగుప్ప పోలీస్ స్టేషన్ నుండి 45 మంది సి.ఆర్.పి.ఎఫ్., ఆరుగురు జిల్లా పోలీసులు- మొత్తం 51 మందితో మినుప గ్రామ పోలింగ్ కేంద్రంకు బయలుదేరారు. చింతగుప్ప పోలీస్ స్టేషన్ నుండి 4 కిలో మీటర్ల దూరంలో గల మినుప గ్రామం రెండు పారలు (గూడాలు)గా వుంటుంది. ముందు పోలీసులు పద్దంగూడెం చేరుకొని అక్కడ ఇప్పపువ్వు ఏరుతున్న ఇద్దరు రైతులను అదుపులోకి తీసుకున్నారు. ఆ గూడెంలో అంటే పద్దంగూడెంలో కోళ్లను తరిమి పదింటిని పట్టుకున్నారు. ఆ ఇద్దరు రైతులను అకారణంగా కొట్టుకుంటూ మినుప ప్రధాన గూడెంకు తీసుకెళ్లాలంటూ బెదిరించారు. అప్పటికే పోలీసులు పద్దంగూడెంకు వచ్చిన వార్త పి.ఎల్.జి.ఎ.కు చేరింది. వెంటనే అలర్టయి పోలీసులను చుట్టుముట్టి దాడి చేయడం కోసం సిద్ధమయింది.

పోలీసులు ప్రధాన గూడెంకు చేరకుండానే వెనుతిరిగారు. అప్పటికే వెనుకా, ముందు పి.ఎల్.జి.ఎ. బలగాలు చుట్టుముట్టాయి. అంతే మధ్యాహ్నం దాదాపు 12 గంటలకు దాడి ప్రారంభం అయి 3.30 గంటల వరకు భీకరమైన సమరం జరిగింది. ఈ సమరంలో సి.ఆర్.పి.ఎఫ్. పోలీసులు 10 మంది చచ్చారు. మరో 13 మందికి తీవ్ర, స్వల్ప గాయాలయ్యాయి. ఆరు అత్యాధునిక ఆయుధాలనూ, బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లనూ, గ్రెనేడ్లను పి.ఎల్.జిఎ. స్వాధీనం చేసుకుంది. ఇదే సమరంలో పి.ఎల్.జి.ఎ. బలగాలకు చెందిన నలుగురు వీర కిశోరాలు (పి.ఎల్.జి.ఎ. కమాండర్లు) అమరులైనారు. వీరిలో కామ్రేడ్ చందు ఒకరు.

కామ్రేడ్ చందు ఒక మధ్యతరగతి ఆదివాసీ కోయ కుటుంబంలో దాదాపు 35 ఏళ్ల క్రితం పుట్టాడు. తన తల్లిపేరు జోగీ, తండ్రిపేరు అడమాల్. వాళ్ల ఇంటిపేరు ముచ్చాకీ. వాళ్లిద్దరి రెండవ సంతానం కామ్రేడ్ చందు. తల్లిదండ్రులు ఆయనకు దేవా అని పేరు పెట్టుకున్నారు. పసికందుగా ఉన్నప్పుడే కామ్రేడ్ చందు తల్లి అనారోగ్యంతో మరణించింది. సంవత్సరం పసికందుగా వున్న సమయంలో వారి కుటుంబం దండకారణ్యంలోని దక్షిణ బస్తర్ డివిజన్ కోంట ఏరియా నుండి ఇదే జిల్లాకు చెందిన కిష్టారం ఏరియా బుర్గులంకకు వచ్చి స్థిరపడ్డారు. పసిప్రాయంలోనే తల్లిప్రేమను కోల్పోయిన చందు పినతల్లి గంగి - పినతండ్రి సుక్కాల్‌ల వద్ద పెరిగి పెద్దయ్యాడు.

కామ్రేడ్ చందు బాల్యంలో ఉండగా ఈ ప్రాంతంలోకి ప్రవేశించిన విప్లవోద్యమం అనతికాలంలోనే ఇక్కడ బలంగా వేళ్లూనికొని ఆదివాసీల విశ్వాసాన్ని చూరగొని వారిని పోరాటోన్ముఖులను చేసింది. ఈ క్రమంలో కామ్రేడ్ చందు కూడా విప్లవోద్యమం పట్ల ఆకర్షితుడయ్యాడు. 1990లో వీరి గ్రామంలో ఏర్పడిన మొదటి గ్రామ రక్షక దళంలో కామ్రేడ్ చందు చేరి తన విప్లవ కార్యాచరణను ప్రారంభించాడు. అప్పటికి తన వయసు 16-17 సంవత్సరాలు. అదే సంవత్సరం గెరిల్లా దళంలో చేరాడు. ఆ వెంటనే పార్టీ అతన్ని ఉత్తర బస్తర్‌లోని కొండగావ్ దళంలో పని చేయడానికి పంపింది. అప్పుడే కొత్తగా చేరినప్పటికీ కామ్రేడ్ చందు తనకు పరిచయంలేని, ఉద్యమ ప్రభావం బలహీనంగా వున్న ప్రాంతానికి చైతన్యవంతంగా వెళ్లాడు.

ఉద్యమం దక్షిణం నుండి ఉత్తరం వైపుకు విస్తరించకుండా అడ్డుకోవాలని బి.జె.పి. ప్రభుత్వం తీవ్రమైన నిర్బంధం పెంచింది. అనేక కొత్త క్యాంపులు వేసి కూంబింగ్‌లు చేపట్టింది. నిత్య నిర్బంధంలో అనేక పోలీసు దాడుల మధ్య కూడా మొక్కవోని ధైర్యంతో అక్కడ వుండి పనిచేస్తూ ఆదివాసీ పీడిత ప్రజల్ని కూడగట్టడంలో దళంతోపాటు చందూ నిరంతరం శ్రమించాడు.

1993 జనవరిలో దండకారణ్య ఫారెస్టు కమిటీ (ఇప్పటి స్పెషల్ జోనల్ కమిటీ) ప్రథమ ప్లీనం జరిగింది. ఆ ప్లీనంలో సైనిక చర్యల కోసం విడిగానే స్పెషల్ దళాలను (మిలటరీ దళాలు) నిర్మించి సైనిక చర్యలను ఉధృతం చేయాలని తీర్మానించింది. అప్పటికి ఈస్ట్, ఆదిలాబాద్ డివిజన్ ఉద్యమాలు దండకారణ్యంలో భాగంగానే వున్నాయి. అందుకని ఈస్ట్, ఆదిలాబాద్, గడ్చిరోలీ, బస్తర్‌లలో డివిజన్‌కు ఒకటి చొప్పున మొత్తం నాలుగు దళాల నిర్మాణం జరిగింది. ఆ నిర్ణయం ప్రకారం బస్తర్ డివిజన్ (ఇప్పటి ఐదు డివిజన్ల) కమిటీ పరిధిలో 1993 జూలైలో ఏర్పడ్డ మొట్ట మొదటి స్పెషల్ గెరిల్లా దళంలో కా. చందు సభ్యుడయ్యాడు. అప్పటి నుండి మినుప దాడి వరకు గత 16 సంవత్సరాలుగా సైనిక రంగంలోనే అతని విప్లవ కార్యాచరణ కొనసాగింది.

2001 సంవత్సరంలో దండకారణ్యంలో మొట్టమొదటి ప్లాటూన్ ఏర్పడింది. ఆ ప్లాటూన్‌లో చందు సెక్షన్ డిప్యూటీ కమాండర్‌గా బాధ్యతలు చేపట్టి అనేక ఆంబుష్‌ల్లో పాల్గొన్నాడు. దండకారణ్యంలో విజయవంతమైన మొట్ట మొదటి (మాన్‌పూర్) రెయిడ్‌లో పాల్గొని విజయం సాధించడంలో తనవంతు పాత్రను పోషించాడు. గడ్చిరోలి, భామ్రాగఢ్ వద్ద కోర్చి ఆంబుష్‌లో పాల్గొని మహారాష్ట్ర కమాండో బలగాల దూకుడును అడ్డుకట్టవేసిన దాడిలో వున్నాడు.

పార్టీ అవసరాలరీత్యా దక్షిణ బస్తర్ స్పెషల్ దళాలకు బదిలీ చేయగా, పార్టీ నిర్ణయానుసారం బదిలీ అయి స్పెషల్ దళంలో చేరాడు. ఆ వెంటనే 2వ ప్లటూన్ ఏర్పడగా అందులోకి బదిలీయై బీజాపూర్ జిల్లా తర్రెం, నారాయణపూర్ జిల్లా బాకుల్‌వాహి ఆంబుష్‌ల్లో పాల్గొని పదుల సంఖ్యలో పోలీసు మూకలను మట్టుబెట్టడంలో పి.ఎల్.జి.ఎ.కు ఆయుధాలను అందించడంలో తనవంతు పాత్రను నిర్వహించాడు.

సంవత్సరకాలం కా. చందు ఆర్గనైజేషనల్ అనుభవం కోసం దక్షిణ బస్తర్ కిష్టారం ఏరియాలో ఆర్గనైజేషన్ దళంలో డిప్యూటి కమాండర్‌గానూ, ఏసీఎంగానూ వున్నాడు. అక్కడ ప్రజాసంఘాలను, పార్ట్‌టైం పార్టీ నిర్మాణాలను నిర్మించడం, ఫంక్షనింగ్ చేయించడంలో అనుభవం గడించాడు. అప్పుడే పార్టీ బస్తర్ ఆందోళన (2000 నవంబర్‌లో) చేపట్టింది. ఇందులో భాగంగా భారీ స్థాయిలో కోంట, కిష్టారం ప్రాంతాల నుండి వేలాది మందిని కదిలించి కోంటలో ర్యాలీ, సభ జరిపారు. దీనిలో కా. చందూ పాత్ర ముఖ్యమైనది.

సి.పి.ఐ.(ఎం.ఎల్.)(పీపుల్స్‌వార్) 9వ కాంగ్రెస్ పి.ఎల్.జి.ఎ.ను విస్తృతం చేయాలనే పిలుపునిచ్చింది. ఆ పిలుపునందుకొని డీకే ఎస్.జడ్.సి. అప్పటికి వున్న రెండు ప్లటూన్‌లను ఐదు ప్లాటూన్లకు పెంచాలని నిర్ణయించింది. అందుకని కా. చందూను 4వ ప్లటూన్‌లోకి మార్చారు. 2004లో ప్లాటూన్ కమాండర్‌గా, 2005లో ప్లాటూన్ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టాడు. తను ప్లాటూన్ కమాండర్‌గా వుండగానే సల్వాజుడుం గూండాలను దర్భగూడెం వద్ద మట్టుబెట్టిన దాడికి ప్రత్యక్ష నాయకత్వం వహించాడు. ఈ దాడి సల్వాజుడుంకూ, దాన్ని నడుపుతున్న బి.జె.పి. ప్రభుత్వానికీ పిడుగుపాటు అయింది. దేశవ్యాప్త చర్చకు దారితీసింది. ఈ ఘటన తర్వాత భారీ బహిరంగ సభలకు సల్వాజుడుం స్వస్థి పలికింది. ఇదే సమయంలో వింజరం బేస్ క్యాంపులో వుంటున్న ఎస్.పి.ఒ.లనూ, గూండాలను హతమార్చిన దాడిలో సాహసవంతంగా పాల్గొన్నాడు. ఎర్రబోర్ రహత్ శిబిరంపై దాడిచేసి 33 మంది ఎస్.పి.ఒ.లను నిర్మూలించిన ఘటనలో కూడా సాహసోపేతంగా పాల్గొన్నాడు.

2006 ఆగస్టులో దక్షిణ బస్తర్ డివిజన్ 4వ మహాసభ జరిగింది. అందులో తను ప్రతినిధిగా ఎన్నికయ్యాడు. గత ఐదు సంవత్సరాల సమీక్షపై, పార్టీ కార్యక్రమాలపై ఉద్యమం తీసుకున్న కర్తవ్యాలను పరిపూర్తి చేయడంలో, డివిజన్‌లో విజయాలు–అపజయాలపై జరిగిన సవివరమైన చర్చల్లో పాల్గొన్నాడు. అనంతరం నూతన డివిజనల్ కమిటీలోకి ఎన్నియ్యాడు. సభ అనంతరం జరిగిన మొదటి మీటింగ్‌లో కా. చందూను కంపెనీ–3కు బదిలీ చేయాలని తీర్మానించారు. అందులో ప్లటూన్ కమాండర్‌గా, కంపెనీ పార్టీ కమిటీ సభ్యుడిగా బాధ్యతలు చేపట్టాడు. అమరత్వం వరకూ అదే బాధ్యతల్లో కొనసాగాడు.

26 మంది పోలీసులను మట్టుపెట్టిన చారిత్రాత్మక, వీరోచిత ఉర్పల్‌మెట్ట దాడికి కామ్రేడ్ చందు డిప్యూటీ కమాండర్‌గా బాధ్యతలు నిర్వర్తించాడు. అదే విధంగా తాడిమెట్ల, పామేడ్, తోంగూడెం, గొల్లపల్లి బట్టిగూడెం, బందా, ముర్లిగూడెం తదితర అనేక ఆంబుష్‌ల్లో పాల్గొని పెద్ద ఎత్తున శత్రువును నిర్మూలించడంలో ఆధునిక ఆయుధాలను పి.ఎల్.జి.ఎ.కు అందించడంలో చురుకైన పాత్ర వహించాడు. ప్రజాయుద్ధంలో ఎన్నో విలువైన అనుభవాలను గడించిన, సాహసోపేతమైన కమాండర్‌గా ఎదిగిన కామ్రేడ్ చందూను కోల్పోవడం ప్రస్తుత పరిస్థితిలో ఎనలేని నష్టం.

కామ్రేడ్ చందూ అందించిన అనుభవాలను పాఠాలుగా తీసుకొని, అతని సాహసోపేత పోరాట పఠిమను అలవర్చుకొని ప్రజాయుద్ధాన్ని ముందుకు తీసికెళ్లడమే కామ్రేడ్ చందూకి ఇవ్వగలిగిన నిజమైన నివాళి. ★

**వ్యూహంలో పది మందికి వ్యతిరేకంగా ఒకరు, ఎత్తుగడల్లో ఒకరికి వ్యతిరేకంగా పది మంది...**

# శత్రు నిర్మూలన, ఆయుధాల స్వాధీనంలో నూతన మలుపుగా నిలిచిన సాహసోపేత 'ఆపరేషన్ వికాస్'కు జేజేలు

పి.ఎల్.జి.ఎ. చరిత్రలో మరొక అపూర్వ విజయం చోటుచేసుకుంది. ఇటీవల కాలంలో మహత్తర విజయాలను నమోదు చేస్తూ విప్లవ ప్రజానీకాన్నీ, పార్టీ శ్రేణులనూ ఉత్తేజపరుస్తోన్న పి.ఎల్.జి.ఎ. మరోసారి విజయహాసం చేసి పార్టీ శ్రేణుల, విప్లవ ప్రజల జేజేలనందుకుంది.

దండకారణ్యంలోని ఉత్తర్ బస్తర్ డివిజన్ రాజ్‌నంద్‌గావ్ జిల్లా మాన్‌పూర్ ఏరియాలో 2009 జూలై 12న విజయవంతమైన ఈ సాహసోపేత ఏరియా ఆంబుష్, పి.ఎల్.జి.ఎ. చరిత్రలో మైలురాయి వంటిది. ఈ ఆంబుష్‌లో పరమక్రూరుడైన రాజ్‌నంద్‌గావ్ జిల్లా ఎస్పీ వినోద్ కుమార్ చౌబే, మాన్‌పూర్, మొహల్లలకు చెందిన ఇద్దరు టి.ఐ.లు (టౌన్ ఇనిస్పెక్టర్లు) చౌకీ, ఔంధీ పోలీసు స్టేషన్లకు చెందిన ఇద్దరు ఎస్.ఐ.లు, ఎనిమిది మంది హెడ్ కానిస్టేబుల్లు సహా మొత్తం 30 మంది పోలీసులు హతమయ్యారు.

కాగా 25 తుపాకులు (ఏకేలు-7, ఇన్సాస్‌లు-14, ఎస్.ఎల్.ఆర్.-3, టు ఇంచ్ మోర్టార్-1) తూటాలు మొత్తం 923 (ఏకే-208, ఎస్.ఎల్.ఆర్.-47, ఇన్సాస్-668) అదనపు మాగజైన్లు ఏకే-12, ఎస్.ఎల్.ఆర్.-4, ఇన్సాస్-31, టు ఇంచ్ మోర్టార్ షెల్స్-3, బులెట్ ప్రూఫ్ జాకెట్లు-22, హెల్మెట్స్-14, వాకీటాకీలు-3, సెల్‌ఫోన్స్-11, నగదు-8 వేల 732 రూపాయలు పి.ఎల్.జి.ఎ. స్వాధీనమయ్యాయి.

డీకేలో అంకురించి, విస్తరిస్తోన్న నూతన రాజ్యాధికారాన్ని చిదిమివేయడానికి సామ్రాజ్యవాదుల కనుసన్నలలో భారత పాలకవర్గాలు తీవ్ర నిర్బంధానికి పాల్పడుతున్నాయి. అందులో భాగంగా బలగాలను రోజు రోజుకు పెంచుతూ కార్పెట్ సెక్యూరిటీని విస్తరింపజేస్తున్నారు. ఈ క్రమంలో మిగతా అన్ని చోట్లలాగే మాన్‌పూర్ ఏరియాలోనూ ఇటీవల కొత్తగా పోలీస్ స్టేషన్లు/క్యాంపులు వేసి బలగాలను పెంచుకొని నిర్బంధాన్ని తీవ్రతరం చేశారు. ఈ నిర్బంధాన్ని తిప్పికొట్టడానికీ, శత్రు నిర్మూలనకూ ఏరియా ఆంబుష్ చేయాలని పి.ఎల్.జి.ఎ. పథకరచన చేసింది. జోన్ వ్యాప్తంగా తీసుకున్న టి.సి.ఒ.సి.లో భాగమిది. ఆ పథకం ప్రకారం పోలీసు బలగాలను రప్పించడానికి జూలై 12వ తేదీ ఉదయం 6 గంటల సమయంలో మదన్‌వేడ క్యాంపుకు చెందిన ఇద్దరు పోలీసులను క్యాంపు పక్కనే పి.ఎల్.జి.ఎ.కు చెందిన ఒక టీం హతమార్చింది. ఇందులో ఒకరిని క్యాంపు ఫెన్సింగ్ దాకా తరిమి తరిమి చంపింది. ఈ చర్యకు షాక్ తిన్న పోలీసులు ఒక్క తూటా కూడా ఫైర్ చేయకుండా వుండిపోయారు. ఈ వార్త తెలియగానే రాజ్‌నంద్‌గావ్ ఎస్పీ వినోద్‌కుమార్ చౌబే హుటా హుటిన మాన్‌పూర్‌కు చేరుకున్నాడు. అక్కడి నుండి మదన్‌వేడకు బయల్దేరాడు. వాళ్ళ ప్రయాణిస్తున్న మెయిన్ రోడ్డు మీద మాన్‌పూర్‌కు 7 కిలో మీటర్ల దూరంలో, మదన్‌వేడకు 20 కిలోమీటర్ల దూరంలో వుండే కొర్‌కొట్టి గ్రామం దగ్గర ప్రధాన ఆంబుష్ చేయాలని పి.ఎల్.జి.ఎ. బలగాలు నిర్ణయించుకున్నాయి. ఉదయం 9.45 ని.లకు రెండు సుమో వాహనాలతో కూడిన ఎస్పీ కాన్వాయ్ ఆంబుష్ స్థలంలోకి వచ్చింది. వాటిని చూడగానే ఆంబుష్ టీం ఫైర్ చేసింది. అయితే ఆ జీపులు ఆగకుండా వేగంగా దాటిపోయాయి. ఈ కాన్వాయ్ వెనుక మరికొందరు పోలీసులు 13 మోటార్ సైకిళ్ళలో, మైన్‌ప్రూఫ్ వాహనంలో మాన్‌పూర్ నుంచి బయల్దేరారు. వీరు దాదాపు 10 గంటలకు ఆంబుష్ స్థలంలోకి చేరుకున్నారు. వెంటనే ఆంబుష్ టీం వీరిపై కాల్పులు జరిపింది. మైన్‌ప్రూఫ్ వాహనం (ఎం.పి.వి.)లో వున్న పోలీసులు ప్రతిఘటించారు. ఆ వాహనాన్ని ముందుకూ వెనక్కూ నడిపిస్తూ చాలాసేపు అందులోని పోలీసులు ప్రతిఘటించారు. అది మైన్ మీదికి రాకపోవడంతో దాన్ని పేల్చేసే అవకాశం గెరిల్లా బలగాలకు దొరకలేదు. అలా గంటకు పైగా ఇరువైపుల నుంచి హోరాహోరీగా జరిగిన కాల్పుల్లో 11 మంది పోలీసులు చనిపోయారు. మైన్‌ప్రూఫ్ వాహనాన్ని అదుపు చేస్తూనే చనిపోయిన వారి నుంచి గెరిల్లా బలగాలు తుపాకులు స్వాధీనం చేసుకున్నాయి.

ఈలోగా ఆంబుష్ స్థలం మీదుగా వెళ్ళిన ఎస్పీ రెండు సుమోలను, ఒక ఎం.పి.వి.ని తీసుకొని వేగంగా కిల్లింగ్ జోన్‌లోంచి సీతగాం నుండి మాన్‌పూర్ వైపుకు వెళ్ళిపోయాడు. అప్పటికి ఇంకా ఫైరింగ్

**పత్రికకు మీ ప్రాంతంలోని పోరాట, ప్రతిఘటన, నిర్బంధ, సభలూ - సమావేశాల నివేదికలు, అమరుల చరిత్రలను ఎప్పటికప్పుడు పంపుతూ వుండండి.**

నడుస్తున్నది. స్కాట్ నుండి ఈ వాహనాలు వస్తున్నాయనే సమాచారం ఉన్నప్పటికీ ఎటువైపు నుండి వస్తున్నాయనే స్పష్టత లేకపోవడం వల్ల ఈ వాహనాలను పేల్చే అవకాశం దొరకలేదు. ఈ వాహనాలు వెళ్లి అప్పటికి ఇటువైపుగా వస్తోన్న ఐ.జి. కాన్వాయ్‌ను కల్సాయి. ఆంబుష్ స్థలం నుంచి కాల్పుల శబ్ధం ఆగిపోయిన కొంత సేపటికి ఐ.జి., ఎస్పీలు బహుశా ఆంబుష్ పూర్తయిందనే అంచనాకు వచ్చి ఎం.పి.వి. మద్దతుతో కాలినడకన ఆంబుష్ స్థలంకు చేరుకున్నారు దీనికి ఎస్పీ నాయకత్వం వహించాడు. చనిపోయిన పోలీసుల శవాలను ఏరుకొని ఎం.పి.వి.లో వేసుకోవడం మొదలుపెట్టారు. ఆంబుష్ ముగించుకొని రిట్రీట్ అవుతున్న గెరిల్లా బలగాలకు పోలీసులు తిరిగి వస్తున్నారనే సమాచారం తెల్సింది. అప్పటికే బాగా అలసిపోయి వున్నప్పటికీ లెక్కచెయ్యకుండా సమరోత్సాహంతో గెరిల్లాలలు మూడవసారి ఆంబుష్ సైట్‌కు చేరుకుని శవాలను ఏరుతున్న పోలీసుల పైకి కాల్పులు జరిపారు. ఇందులో ఎస్పీ సహా 14 మంది పోలీసులు చనిపోయారు. 14 ఆయుధాలు పి.ఎల్.జి.ఎ. స్వాధీనమయ్యాయి. అప్పటికి ఇంకా ఆంబుష్ స్థలానికి కొంచెం దూరంలో వున్న ఐ.జి., ఊహించని విధంగా గెరిల్లాలు చేసిన ఈ దాడికి భయాందోళనలకు గురయి కొన్ని మీటర్ల దూరం క్రాలింగ్ చేస్తూ ఎం.పి.వి.లోకి దూరిపోయి ప్రాణాలు కాపాడుకున్నాడు.

ఇదేకాక ఈ ఏరియా ఆంబుష్‌లో భాగంగా మదన్‌వేడకు 5-7 కిలోమీటర్ల దూరంలో కారెకట్ట అనే గ్రామం వద్ద మరొక చిన్న టీంతో ఆంబుష్‌కు పథకం వేశారు. ఈ టీం కామ్రేడ్స్ ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఓపికగా ఎదురుచూసి సాయంత్రం నాలుగు గంటలకు కాలినడక వస్తున్న పోలీస్ బ్యాచ్‌పై మైన్ పేల్చి ఆంబుష్ చేశారు. ఇందులో ఒక ఎస్.ఐ. సహా ఇద్దరు పోలీసులు చనిపోయారు. వెనుక పెద్ద సంఖ్యలో వున్న పోలీసు బలగాలు పిచ్చిగా గంటల కొలదీ కాల్పులు జరుపుతూ ఉండిపోయినారు.

ఈ ఏరియా ఆంబుష్‌కు 'ఆపరేషన్ వికాస్' అని పేరు పెట్టారు. ఈ పేరును అక్కడి కామ్రేడ్స్ ప్రతీకాత్మకంగా (సింబాలిక్‌గా) ఎంచుకున్నారు. ఇటీవల అమరుడైన మన ప్రియతమ నాయకుడు కామ్రేడ్ వికాస్ (పటేల్ సుధాకర్ రెడ్డి), మాన్‌పూర్ ప్రాంతంలో 2006లో బూటకపు ఎన్‌కౌంటర్‌లో అసువులుబాసి ఈ ప్రాంతంలో మొదటి అమరుడిగా నిలిచిపోయిన గడ్చిరోలి ఉద్యమనేత కామ్రేడ్ వికాస్ (శ్రీనివాస్)ల హత్యలకు ప్రతీకారం తీర్చుకోవడం, ఈ ఆపరేషన్ ద్వారా లభించే అనుకూలతపై ఆధారపడి ఈ ప్రాంత ఉద్యమ వికాసంలో వేగం సాధించడం... ఇవి ఈ పేరును ఎన్నుకోవడంలో గల ఉద్దేశ్యాలు.

'ఆపరేషన్ వికాస్' పలు నూతన, విలువైన అనుభవాలనందించి పి.ఎల్.జి.ఎ. చరిత్రను మరింతగా సంపద్వంతం చేసింది. డీకేలో ఇంత స్థాయిలో శత్రు నిర్మూలనను చేసిన మొదటి ఏరియా ఆంబుష్ ఇది. మొదట ఎస్పీ కాన్వాయ్‌పై, స్వల్పంగా కాల్పులు జరిపిన సంఘటనతో కలుపుకుంటే ఒకే ఆంబుష్ స్థలంలో మూడుసార్లు పి.ఎల్.జి.ఎ. బలగాలు దాడి చేయడం కూడా అపూర్వమైన విషయమే. పి.ఎల్.జి.ఎ.కు ఎటువంటి నష్టాలు లేకపోవడం కూడా గొప్ప ఊరటను కల్గించే, విజయోత్సాహాన్ని వెయ్యిరెట్లు పెంచే అంశం. మాడ్ ప్రాంతం మీద ప్రభుత్వం దాడికి సిద్ధమవుతున్న పరిస్థితిలో జరిగిన ఎదురుదాడిగా కూడా దీనికి ప్రాధాన్యత వుంది.

పైనుండి కింది వరకూ పార్టీ శ్రేణులు పొందిన రాజకీయ ప్రేరణ, మెరుగైన పథక రచన, సీ4ఐ (కమాండ్, కంట్రోల్, కమ్యూనికేషన్, కోఆర్డినేషన్, ఇంటెలిజెన్స్)ను సరిగా సమన్వయించడం, విజయం సాధించి తీరాలనే దృఢ సంకల్పం... చారిత్రాత్మకమైన 'ఆపరేషన్ వికాస్'ను విజయవంతం చేసిన అంశాలు. నిర్ణయించుకున్న విధంగా రహస్యాన్ని కాపాడడంలో సఫలం కావడం, సరైన నిద్ర, తిండి, ఇతర సదుపాయాలు లేని మూలంగా ఎదురైన కష్టాలను తట్టుకోవడం, ప్రజల, ప్రజా నిర్మాణాల నుండి అపారమైన మద్దతు, సహకారం, క్రియాశీల భాగస్వామ్యం వుండడం, అననుకూలమైన టెర్రెయిన్‌నూ, నీళ్లు-నీడ సరిగా లేని అననుకూలమైన కాలం కల్గించే అసౌకర్యాలను అధిగమించే చైతన్యం, ఎన్నోరోజులు ప్రయత్నించినప్పటికీ శత్రువు వలలో చిక్కనప్పుడు నిరాశకు గురికాకుండా, తన కింది కామ్రేడ్స్‌ను గురికానివ్వకుండా కోర్ గ్రూప్ రాజకీయంగా, మిలటరీపరంగా పరిపక్వతను ప్రదర్శించడం, ఎదురయిన కొన్ని క్లిష్ట సమస్యలను పరిష్కరించుకుంటూ ముందుకు సాగడం, ఆర్గనైజేషన్ - మిలటరీ కర్తవ్యాలను ఏక కాలంలో సమన్వయించడం... ఇవన్నీ 'ఆపరేషన్ వికాస్' విజయానికి తోడ్పడ్డ మరికొన్ని అంశాలు.

ఈ ఘటన రాష్ట్ర రాజకీయ రంగాన్ని కుదిపివేసింది. రాష్ట్రపతి పాలన పెట్టాలనే డిమాండ్ ప్రతిపక్షాల నుండి వచ్చింది. ఈ దెబ్బతో పిచ్చెక్కిన పోలీసులు కూబింగ్‌లను ఉధృతం చేస్తున్నామని ప్రగల్భాలు పలికారు. కానీ నిజానికి పోలీసులు గ్రామాల్లోకి కూంబింగ్‌కు వచ్చే ధైర్యం చేయలేకపోయారు. మెయిన్ రోడ్ల మీదనే అటు ఇటు తిరిగి తమ కూంబింగ్‌లు 'ముగించుకొని' తిరిగి వెళ్లారు.

'ఆపరేషన్ వికాస్'ను విజయవంతం చేసిన పి.ఎల్.జి.ఎ.నూ, ఈ విజయంతో చురుకైన భాగస్వామ్యం వహించిన విప్లవ ప్రజానీకాన్నీ మనస్ఫూర్తిగా అభినందిద్దాం. ఈ అనుభవాల బాటలో పి.ఎల్.జి.ఎ. ప్రయాణం మరింత వేగంగా ముందుకు సాగుతుందని ఆశిద్దాం. ★

# ప్రతిఘటనా - పోరాటాలూ - సభలు

## దండకారణ్యం

### ఎన్నికల బహిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పశ్చిమ బస్తర్ ప్రజా మిలీషియా

2009 ఏప్రిల్ 16న జరిగిన బూటకపు పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరించాలని పార్టీ ఇచ్చిన పిలుపునందుకొని డివిజన్‌లో వున్న మిలీషియా ప్లాటూన్లు, జి.ఆర్.డి.లు, భూంకాల్ మిలీషియా సాంప్రదాయక ఆయుధాలతో శత్రువుపై దాడులకు సిద్ధమయ్యాయి. పోలీసులు గ్రామాలలోకి చొరబడి దాడులు చేసే అవకాశాలు వున్నచోటా, గ్రామాలకు వచ్చి క్యాంపు వేసే అవకాశాలు వున్న ప్రతిచోటా, శత్రువు వచ్చే అవకాశాలు వున్న దారులలో మిలీషియా డివిజన్ వ్యాప్తంగా 12 వందల ట్రాప్‌లను ఏర్పర్చింది. ఇందులో మహిళలు 250 ఏర్పర్చగా, పిల్లలు 68 ఏర్పర్చారు. ప్రజలను ముందే అడవిలోకి (సురక్షిత ప్రాంతంకు) పంపించి ప్రతి ట్రాపు వద్ద మహిళలు, భూంకాల్ మిలీషియా, బాలల సంఘాల పిల్లలు సెంట్రీలు నిర్వహించారు. మొత్తం ఏరియాలో మూడు వలయాలుగా ప్రతిఘటనకు ఏర్పాట్లు చేసుకున్నారు. మిలీషియా ప్లాటూన్, జి.ఆర్.డి.ల సభ్యులు కలిసి ప్రధాన దారుల్లో ఆంబుష్‌లు ఏర్పర్చుకొని ముందువరసలో వుండగా, భూంకాల్ మిలీషియా శత్రువు వచ్చే వైపు సెంట్రీలు వుంటూ రెండవ వరసలో వుండగా, బాల బాలికలు గ్రామాల దగ్గర్లో సెంట్రీలు చేశారు. ఏరియాలో వున్న మిలీషియా ఒక గొలుసు పద్ధతిలో మంచి సమన్వయంతో ప్రతిఘటనకు సిద్ధమయ్యారు. ఇలా మొత్తం ప్రతిఘటనలో పాల్గొన్న మిలీషియా దాదాపు ఆరువేల మంది. ఇందులో మహిళలు మూడు వేలు, పిల్లలు 284 మంది ఉన్నారు. ఎన్నికల రోజున పోలీసులు వాళ్ల క్యాంపులకు దగ్గరలో వున్న కొన్ని గ్రామాలకు వచ్చి వాళ్లే ఓట్లు వేసుకోని వెళ్లారు. కొన్నిచోట్ల పి.ఎల్.జి.ఎ. ప్రతిఘటనతో తిరిగి వెళ్లారు. ఒకచోట మిలీషియా రెండు కార్డెక్స్ బాంబు వేయడంతో పోలీసులు పరుగులు తీశారు. కోర్మ గ్రామానికి వచ్చిన శత్రువును మిలీషియా నాలుగు పక్కల నుండి చుట్టుముట్టి బర్మార్లతో, కార్డెక్స్ బాంబులతో ఫైరింగ్ చేస్తూ శత్రువును గందరగోళపర్చడం కోసం ఉర్పల్‌మెట్ట, తాడిమెట్ల, తోంగూడలను గుర్తుచేసుకోండి అనే నినాదాలు చేస్తూ, ఇంకా చాలా మంది వున్నట్టుగా అడ్వాన్స్ కాషన్స్ ఇస్తూ తరిమికొట్టారు. పోలీసులు ఉరుకుతూ ఉరుకుతూ గ్రామంలో

## విజ్ఞప్తి

ప్రియమైన కామ్రేడ్స్,

'క్రాంతి'కి పంపుతున్న అమరవీరుల చరిత్రలు చాలా అసమగ్రంగా ఉంటున్నాయి. కనుక మీరు అమరవీరుల చరిత్రలు రాసేటప్పుడు కింది అంశాలు దృష్టిలో పెట్టుకోగలరు.

అమరుల సొంత పేరు, పార్టీ పేరు; వయసు; జిల్లా, గ్రామం; గ్రామ, ప్రాంత రాజకీయ నేపథ్యం; కుటుంబ ఆర్థిక, రాజకీయ, సామాజిక నేపథ్యం; చదువు, వృత్తి; పార్టీకి పరిచయమైన, రిక్రూట్ అయిన సంవత్సరం, రిక్రూట్ అయిన రంగం; ఉద్యమంలోకి రావడానికి దోహదం చేసిన నేపథ్యం; పార్టీ సభ్యత్వం పొందిన సంవత్సరం; ఏయే సంవత్సరం, ఏయే దళాల్లో, ప్రాంతంలో, బాధ్యతల్లో, స్థాయిల్లో పని చేసినది; పోరాటాలూ, ప్రతిఘటన, ఎన్‌కౌంటర్లలో నిర్వహించిన పాత్ర; రాజకీయ రంగంలో కృషి; అధ్యయనం, బోధన వంటి అంశాల్లో వున్న సామర్థ్యాలు; కళా, సాహితీ, టెక్నికల్ వంటి రంగాల్లో అభిరుచి, కృషి; వ్యక్తిగత జీవితం, స్వభావం; అమరత్వపు తేదీ, నెల, సంవత్సరం; అమరత్వపు ఘటన వివరాలు వంటి అంశాలు వచ్చే విధంగా క్లుప్తంగా రాయగలరు.

అమరుల చరిత్రతో పాటు ఫోటో (వుంటే) తప్పక జత చేయండి. ఫోటో వెనుక పేరు రాయాలి.

**గమనిక:** ఈ విజ్ఞప్తిని ఎల్లప్పుడూ మీ వద్ద భద్రపరుచుకోగలరు.

ఆఖరుగా వున్న 15 ఇళ్లకు అగ్గిపెట్టి పోయారు.

ఇలా డివిజన్లో ఎన్నికల ప్రతిఘటన కార్యక్రమం విజయవంతం చేయడంలో మిలీషియా మంచి పాత్రను పోషించింది.

## నిర్బంధానికి వ్యతిరేకంగా బంద్ విజయవంతం

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రెండూ కలిసి 2005 నుండి సల్వాజుడుం పేరుతో అమాయక ఆదివాసీ ప్రజలపై క్రూర నిర్బంధకాండను ప్రయోగిస్తూ అనేక మంది ప్రజలను బూటకపు ఎన్‌కౌంటర్లలో హత్య చేస్తున్నాయి. ప్రజల పోరాడే మానసిక స్థైర్యాన్ని దెబ్బతీయడంలో భాగంగా ప్రజల్లో భయాందోళనలు సృష్టించేందుకు సింగారంవంటి క్రూరమైన సామూహిక హత్యాకాండకు పాల్పడుతూ, ప్రజల ఇండ్లపై, ఆస్తులపై దాడులు చేస్తూ సర్వం విధ్వంసం చేస్తున్నారు. దొరికిన మహిళలపై అత్యాచారం చేయడం, ప్రజలను పోలీస్ స్టేషన్లకు పట్టుకెళ్లి తీవ్ర చిత్రహింసలు పెట్టి, భయపెట్టి ఇన్‌ఫార్మర్లుగా మార్చడం, లొంగనివారిపై తప్పుడు కేసులు బనాయించి జైల్లో పెట్టడం, జైళ్లలో వున్న ఖైదీల సమస్యలను పట్టించుకోకపోవడం, కేసులు కొట్టివేసినా కూడా వారిని విడుదల చేయకపోవడం లాంటి క్రూరమైన ప్రభుత్వ నిర్బంధానికి వ్యతిరేకంగా మే 20, 21న ఆంధ్ర, దండకారణ్యం, మహారాష్ట్ర, ఒడిస్సా రాష్ట్రాల్లో బంద్‌ను పాటించాలని పార్టీ ఇచ్చిన పిలుపును విజయవంతం చేయడం కోసం గంగులూర్ ఏరియా వ్యాప్తంగా మే 15 నుండి ప్రచార కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా పోస్టర్లు వేశారు, బ్యానర్లు కట్టారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించారు. మే 20న ప్రజాసంఘాల నాయకత్వంలో ఆర్.పి.సి. పరిధిలో 17 సభలు జరిగాయి. ఈ మీటింగ్‌లకు ముందు ప్రజలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా 'బూటకపు ఎన్‌కౌంటర్లలో అమాయక ఆదివాసీ ప్రజలను హత్య చేయడం బంద్ చేయాలి', 'అమాయక ఆదివాసీ ప్రజలను జైలు నుండి విడుదల చేయాలి', 'పి.యు.సి.ఎల్. నాయకుడు వినాయక్‌సేన్‌ను విడుదల చేయాలి', 'ఛత్తీస్‌గఢ్ రమణ్‌సింగ్ ప్రభుత్వం సామూహిక హత్యాకాండను బంద్ చేయాలి', 'కేసులు కొట్టివేయబడ్డ ఖైదీలను విడుదల చేయాలి', 'భూస్వామ్య, సామ్రాజ్యవాద దళారీ నిరంకుశ పెట్టుబడిదారులు నశించాలి' అంటూ నినాదాలు చేస్తూ కాగడాల ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సభల్లో అమరవీరుల కుటుంబాలు, జైళ్లలో వున్న వారి కుటుంబాలు పాల్గొన్నాయి.

## ఖమ్మం జిల్లా

### శబరి ఏరియా

చింతూరు మండలంలో తునికాకు ధర కట్టకు 1-50 పైసలకు పెంచాలని డిమాండ్ చేస్తూ దాదాపు 20 గ్రామాలలో పోస్టర్లు

## విజ్ఞప్తి

ప్రియమైన కామ్రేడ్స్,

'క్రాంతి'కి పంపుతున్న పోరాట/ప్రతిఘటన/ఆందోళన/సభలూ-సమావేశాల నివేదికలు చాలా అసమగ్రంగా వుంటున్నాయి. కనుక ఒక్కోసారి అవి ప్రచురణ సాధ్యం కావడం లేదు.

కనుక నివేదికలలో పోరాటం/ప్రతిఘటన/ఆందోళన/సభలూ-సమావేశాలు జరిగిన తేదీ, నెల, సంవత్సరం; జిల్లా, గ్రామాల పేర్లు; ఏ దళ ఆధ్వర్యంలో జరిగినదీ రాయాలి (దళ, ప్రాంతాల పేర్లు పొడి అక్షరాల్లో రాయవద్దు). ఈ పోరాటాల సందర్భంగా చేపట్టిన కరపత్రాలూ, పోస్టర్లూ, పత్రికా ప్రకటనలు వంటి ప్రచార రూపాలను కూడా పేర్కొనాలి. వీటిల్లో పాల్గొన్న ప్రజల సంఖ్యనూ, వారిలోనూ మహిళల సంఖ్యను ప్రత్యేకంగా పేర్కొనాలి. ప్రజల పాత్రను నిర్దిష్టంగా పేర్కొనాలి. ప్రజా వ్యతిరేకులపై భౌతిక చర్యలు తీసుకున్న నివేదికలు రాస్తున్నప్పుడు, ఆ చర్యలకంటే ముందు వారిపై చేసిన హెచ్చరికల వంటి పోరాట రూపాలను పేర్కొనాలి. వీటిలోనూ ప్రజల పాత్రను పేర్కొనాలి.

నివేదికలతో పాటు ఫోటోలు (వుంటే) తప్పక జత చేయగలరు. ఫోటో వెనుక వివరాలు రాయగలరు.

**గమనిక:** ఈ విజ్ఞప్తిని ఎల్లప్పుడూ మీ వద్ద భద్రపరుచుకోగలరు.

వేశారు. ఎన్నికలను బహిష్కరించాలని ప్రజలకు పిలుపునిస్తూ వివిధ గ్రామాలలో ప్రచారం చేశారు. పోస్టర్లు, వాయిస్‌లు వేసి బ్యానర్లు కట్టారు.

వివిధ జైళ్లల్లో వున్న కామ్రేడ్స్‌ను విడుదల చేయాలని విప్లవకారులను రాజకీయ ఖైదీలుగా గుర్తించాలని, ఇంకా వివిధ డిమాండ్లపైన చింతూరు, కూనవరం మండలాలలో వున్న గ్రామాలలో, ప్రధాన రోడ్లపైనా, పోస్టర్లు వేసి బ్యానర్లు కట్టారు.

ఇదే డిమాండ్‌పై పార్టీ దేశవ్యాప్తంగా మే 21, 22లలో ఇచ్చిన బంద్ పిలుపులో భాగంగా ఆంధ్ర, ఛత్తీసగఢ్‌కు పోయే ప్రధాన రహదారికి అడ్డంగా చెట్లు నరికి పడేసి, గోతులు తవ్వడంతో వుదయం నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొత్తం వాహనాలు ఆగిపోయాయి. ఈ బంద్ ప్రభావం భద్రాచలం డివిజన్‌లో బాగావుంది. ఈ ప్రభావంతో భద్రాచలంలో వున్న వాజేడు, వెంకటాపూర్, చర్ల, దుమ్ముగూడెం, చింతూరు, కూనవరం, వి.ఆర్.పురం మండలాలలో పూర్తిగా కిరణాషాపులు, సినిమా హాళ్లు , బ్యాంకులు, ఆర్.టి.సి. బస్సులు, పాఠశాలలు, కాలేజీలు ప్రభుత్వ కార్యాలయాలు రెండు రోజులు బంద్ అయ్యాయి. ఈ సమస్యపైన జిల్లా కమిటీ పత్రికలకు ప్రకటనలు ఇచ్చింది.

పోలీసు కూంబింగులు, పెట్రోలింగ్‌ల మధ్యనే బంద్ విజయవంతం కావడం వలన ప్రజలు మంచి ఉత్సాహాన్ని పొందారు.

★

---

*(21వ పేజీ తరువాయి...)*

టి.డి.పి.కి పవర్‌ఫ్లూ జబ్బులు వచ్చినట్లు అసెంబ్లీలో మీడియా సాక్షిగా పరస్పరం ఆరోపించుకున్నారు. అవినీతికీ, ప్రపంచ బ్యాంకు సేవకు అందరూ సమానులేనని మార్కెట్ ధరలు చెబుతున్నాయి. 70 శాతం చమురుకోసం విదేశాలపై ఆధారపడుతున్నాం. ఒక సంవత్సరంలో ప్రపంచ మార్కెట్‌లో 21 సార్లు చమురు ధరలు పెరిగాయి. మన రవాణా రంగం ధరలు పెంచి, నిత్యావసరాలపై పరోక్షంగా ప్రభావం వేసింది. ఆర్.టి.సి. బస్సు ఛార్జీలు పెరిగాయి. ఇంకా పెంచాలని చూస్తున్నారు. ఎన్నికల్లో తొక్కి పెట్టిన ధరలు ఎన్నికల తర్వాత అంచెలంచెలుగా పెంచుతూనే ఉన్నారు. విద్యనమ్ముకోవచ్చని కేంద్ర సంస్థ (ఎ.ఐ.సి.టి.ఐ.) తేల్చి చెప్పింది. మందుల ధరలు పెరిగాయి. రోగాలు కూడా పెరగడమేకాదు అవి స్వైన్‌ఫ్లూ, ఆంత్రాక్స్, మెదడువాపు, విషజ్వరాలు రూపాల్లోకి మారి ప్రజల్ని భయపెడుతున్నాయి. మరణాలు పెరిగిపోతున్నాయి. వ్యాట్ తరహాలో చెల్లించే పన్నులన్నీ ప్రజలు కొనుక్కునే సరుకుల అమ్మకాల్లోనే జొప్పించి వ్యాపారులు గుంజుకుంటారు. ఈ ప్రభుత్వానికి నీతి, విలువలు రెండూ లేవు. సారా ఎందుకు అమ్మడం అంటే బియ్యం రేషన్ ఖర్చుకని చెబుతారు. సారా చెడుకుతోడు రేషన్ అవినీతి రెండూ పాలకులకు లాభాలే. పెట్రోల్ మున్నగువాటిపై అధిక పన్నులెందుకు అంటే ఉపాధి పథకాలకు, సర్వశిక్షా అభియాన్‌ల కోసం అంటారు. ఉపాధికీ, సర్వశిక్షా అభియాన్‌కు ఖర్చుపెట్టేది తక్కువ. దారి మళ్లించి పంచుకునేదే ప్రధానం. చెప్పేదొకటి చేసేదొకటి. సమాజానికి ఏది కావాలి. దానిని ఎలా చేయాలి అనేది లేదు. సామాజిక విలువలు మంటగలిసినా ఫరవాలేదు, తాత్కాలిక ప్రయోజనాలే ముఖ్యం.

ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని, అవినీతిని, సంస్కరణల పేరుతో చేసే మోసాన్ని, సంక్షేమానికి, సబ్సిడీలకు తూట్లు పొడవడాన్ని ఇలాంటి ఎన్నింటినో ప్రజలు ఎక్కడికక్కడ ప్రత్యక్షంగా పోరాటాల ద్వారా ఎదుర్కొంటున్నారు. రోజూ ఆందోళన జరగని ప్రాంతం, రంగం లేవని చెప్పాలి. మదనపల్లిలో అక్రమ నిల్వలను వెలికి తీయడానికి సి.పి.ఐ. నాయకత్వంలో ప్రజలు ఉద్యమిస్తే పోలీసులు వ్యాపారుల అక్రమ నిల్వలను కాపాడి ఉద్యమకారుల్ని అరెస్టు చేశారు. వ్యాపారులు దాడి చేసి చితక్కొట్టారు. ఇదీ ప్రభుత్వ నిర్వాకం.

ధరలకు వ్యతిరేకంగానూ, పెరుగుతున్న కరువుకు వ్యతిరేకంగాను ప్రజలు మిలిటెంట్ పోరాటాల్లోకి కదలకుండా, ఈ దోపిడీ ప్రభుత్వాలను సాయుధంగా కూల్చకుండా, ధరలను నియంత్రించే మార్కెట్‌ను ప్రజల అవసరాలకు అనుగుణంగా మార్చే ప్రజారాజ్యం రాకుండా అధిక ధరల సమస్య పరిష్కారం సాధ్యంకాదు.

ఈ సంవత్సరం మన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి హయాంలో ప్రకృతి కరుణించక, వరుణుడు ప్రసన్నంకాక, వర్షాలు పడక ప్రజలు పంటలు వేయలేదు. ఇప్పుడే కరువు వుంది. సంవత్సరం పొడవునా కరువు పరిస్థితుల్లో ఎలా బతికేది? అధిక ధరలతో ఎలా కాపురం చేసేది?

ధరలు తగ్గాలన్నా, ఆకలి చావులు లేకుండా చేయాలన్నా పోరాటమే మార్గం. ఈ వ్యవస్థను కూకటివేళ్లతో పెకలిద్దాం. తక్షణ సమస్యపై ఐక్య పోరాటాలతో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా విస్తృతంగా పోరాడుదాం. కరువు దాడులకు ప్రజలను సన్నద్ధం చేద్దాం. కరువుకు, దరిద్రానికి, అధిక ధరలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే ప్రధాన బాధ్యత అని చాటిచెబుదాం. ★

*(44వ పేజీ తరువాయి...)*

వెల్లువెత్తడంతో ప్రభుత్వాలు మరింతగా కేంద్రీకృతమవుతూ ప్రజలపై ప్రత్యక్ష యుద్ధానికి పూనుకుంటాయి. ప్రజల పక్షాన నిలబడి వుద్యమించే పార్టీలను ప్రజల నుండి దూరం చేయడానికి విశ్వప్రయత్నం చేస్తాయి. లాల్‌గఢ్ అనుభవం తర్వాత జూన్ 15న "నక్సల్స్‌ను తక్కువ అంచనా వేశాం" అని ప్రకటించిన చిదంబరం, ముందుగానే జూలైలో నిర్ణయించుకున్న విధంగా దిశా నిర్దేశాలకోసం ఆగస్టు 17న ప్రధాని మన్‌మోహన్ సింగ్ నాయకత్వాన అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం జరిపాడు. "దేశ అంతరంగిక భద్రతకు ఒకే ఒక ప్రమాదం వామపక్ష తీవ్రవాదం, వామపక్ష తీవ్రవాదం వైరస్ లాంటిది, దేశానికి పట్టిన కేన్సర్ లాంటిదని" అన్న ప్రధాని ఈజిప్టులో నామ్ వేదిక (అలీన దేశాల సమావేశం) సందర్భంగా, ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లోను నక్సల్స్ ప్రమాదం గురించి తలుచుకుని తలుచుకుని తమ వర్గాన్ని హెచ్చరిస్తూనే వున్నాడు. కాకుంటే ఆగస్టు 17న సమావేశంలో చాలా జాగరూకతతో వ్యవహరించాలని నిభాలించుకుని సూచిస్తున్నాడు. ఇదే సందర్భంగా చిదంబరం మాట్లాడుతూ "నక్సల్స్‌ను ద్విముఖ వ్యూహంతో ఎదుర్కోవాలన్న పాత విధానాన్నే చెప్పి, అణచివేతకు ప్రథమ ప్రాధాన్యతనిచ్చి పథకాలు ప్రవేశపెట్టాడు. వాషింగ్టన్‌లో శిక్షణ పొందిన ఎం.కె.నారాయణన్ లాంటి ఇంటిలిజెన్స్ కింగ్‌లతో అనేకసార్లు చర్చించి గతంలోనే రూపొందించిన ఆపరేషనల్ ప్లానుకు రాజకీయ మద్దతు కూడగట్టిన ఈ సమావేశానికి చాలా ప్రాధాన్యత వుంది. ఆధునిక ఆయుధాలతో, బలమైన కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌తో, సమర్థవంతమైన సమన్వయంతో, పెద్ద సంఖ్యలో బలగాలను తర్ఫీదు చేసి జిల్లా కేంద్రాలకు తరలించారు. కాశ్మీర్‌లోని బలగాలను కూడా ఈ దాడుల కోసం కదిలిస్తున్నారు. లాల్‌గఢ్ అణచివేత దాడుల్ని సమీక్షించి, ఆంధ్రలో నల్లమలలో ఉన్నత సాంకేతికతతో సాధించిన విజయాన్ని మదింపు చేసుకుని మరోచోట (అది జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, ఒడిస్సా ఎక్కడైనా కావచ్చు. అది రహస్యంగా అమలు చేస్తారు) దాడికి ముహూర్తాన్ని నిర్ణయించారు. అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు పార్టీలకు అతీతంగా ఐక్యమై ప్రజాపీడనకు, అణచివేత దాడులకు, సల్వాజుడుం తరహా మారణహోమాలకు పచ్చజెండా ఊపాయి. ఇలా చేయడానికి నక్సలైట్లపై ఉగ్రవాదుల ముద్రవేయాలి. మావోయిస్టు పార్టీని నిషేధించాలి. అలా చేస్తే ప్రజల నుండి పోరాటకారుల్ని విడదీయవచ్చు. ఏరివేయవచ్చు. ఒకవేళ అలా సాధ్యంకాకపోతే వారికి సహకరించిన వారిని కూడా హింసించవచ్చు, జైళ్లల్లో పెట్టవచ్చు. అయినా ఉద్యమాలు ఆగకపోతే అందరిని టెర్రరిస్టులుగా ప్రకటించేసి ఏరియానే క్లియర్ చేసేయవచ్చు. ఇదీ పాలకుల మాస్టర్ ప్లాన్. లోతైన కుట్రతో వుందీ పథక రచన. సంయుక్త కార్యాచరణ ప్రణాళికతోపాటు, సైనికాధికారిని సలహాదారుగా నియమించారు. ఇంతకన్నా ముందే జాతీయ పరిశోధనా సంస్థ (ఎన్.ఐ.ఎ.) ఏర్పడింది.

ఎందుకీ క్లియరెన్స్ అంటే ప్రజల గుండెల్లో గూడుకట్టుకున్న నక్సల్ ప్రభావిత ప్రాంతాలన్నీ ఆదివాసీ ప్రాంతాలు, అటవీ ప్రాంతాలు. లక్షల కోట్ల రూపాయల విలువైన ఖనిజ నిక్షేపాలున్న ప్రాంతాలు. సామ్రాజ్యవాదుల కళ్లు పచ్చటి భూముల మీద, ఖనిజ సంపదల మీదపడ్డాయి. వారి కోరికలు తీరాలంటే ప్రజల్ని ఖాళీ చేయించాలి. భూముల్ని దురాక్రమించి కార్పోరేటు సంస్థలకు అప్పగించాలి. ఎస్.ఇ.జడ్.లను, రస్-అల్‌ఖైమా, టాటా, మిట్టల్, జిందాల్, ఎస్సార్ లాంటి దళారీలను, కార్పోరేషన్లను బలంగా ఎదుర్కుంటున్న కాశీపూర్, కళింగనగర్, నందిగ్రాం, సింగూరు, లాల్‌గఢ్, విశాఖ మన్యం లాంటి మిలిటెంట్ పోరాటాలను అణచివేయడానికి, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, ఒడిస్సా రాష్ట్రాలలో బలంగా పెంపొందుతున్న ప్రజా గెరిల్లా సైన్యాన్ని దెబ్బతీసి, ప్రజా రాజ్యాధికారాన్ని కాలరాచి వేయడానికి, ఒక్కమాటలో ప్రజల విజయాలను ధ్వంసం చేసి ప్రజల నుండి విప్లవకారుల్ని ఏరివేసి ప్రజలను నిర్వాసితులను చేసి ఆ భూముల్ని, ఖనిజాలను కొల్లగొట్టే 'గొప్ప' దూరాలోచన ఇది. అందుకే ఉగ్రవాద ముద్ర, నిషేధ చట్టం, దాడికి రాజకీయ ఆమోదం పొందడం.

సరిహద్దుల్లో సమర్థవంతమైన వ్యూహాన్ని అమలుచేస్తున్నారు. ట్రోపోగ్రాఫీ ఆధారంగా ఉద్యమ ప్రాంతాలపై దాడులకు హోంశాఖ కసరత్తును తీవ్రం చేసింది. శాంతి భద్రతలు రాష్ట్రాల బాధ్యత అంటూ రాష్ట్రాలను ప్రత్యేకంగా గైడ్ చేస్తున్నారు. 5-10 సంవత్సరాలకు అవసరమైన ఆధునీకరణ ఖర్చులు ఇస్తామని హామీ ఇచ్చారు. సమాచార సమన్వయం ఉన్నత ప్రమాణాల్లో జరుగుతుందన్నారు. పశ్చిమ బెంగాల్‌లో నక్సల్స్‌ను ఏరివేయాలంటే ఝార్ఖండ్‌లో దాడులు అవసరం అనీ, ఛత్తీస్‌గఢ్‌లో నూతన సాంకేతికత అవసరమని గుర్తించారు.

ఆగస్టు 17 సమావేశంలో నక్సల్స్ అణచివేతకు బలగాలు, ఆధునిక ఆయుధాలు, నిధులు, సమన్వయాన్ని అందరు ముఖ్యమంత్రులు కోరారు. గుజరాత్‌కు కూడా నక్సల్స్ ప్రమాదం ఏర్పడిందని సరిహద్దుల రక్షణ, సమన్వయం పెంచాలని బి.జె.పి. నాయకుడు, ముఖ్యమంత్రి నరేంద్రమోడి వేడుకున్నాడు. అణచివేతకు రాజకీయ మద్దతు, నైతిక మద్దతు చేకూర్చుకోవడానికి మీడియాలో లాల్‌గఢ్ దాడి సందర్భంగా అబద్ధాలను ప్రచారం చేసినట్లే, విస్తృత స్థాయిలో జరుగుతున్న ప్రజా ఉద్యమాన్ని అభివృద్ధికి ఆటంకం అని ప్రకటిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో సి.పి.ఐ.(మావోయిస్టు)ను పూర్తిగా తుడిచేసామని ప్రభుత్వం ప్రకటించింది. మరోపక్కన హైదరాబాద్‌లో ఎన్.ఎస్.జి. శిక్షణా సంస్థను ఏర్పర్చడానికి, అక్టోపస్‌ను పటిష్టం చేయడానికి కృషి జరుగుతుంది. ఇప్పటికే ఎన్.ఎస్.జి. హబ్‌ను ఏర్పరిచారు. నేషనల్ కౌంటర్ టెర్రరిజం సెంటర్‌ను కూడా ఇక్కడే ఏర్పరచాలని ఆలోచిస్తున్నారు. ఇక్కడున్న గ్రేహౌండ్స్, స్పెషల్ బలగాలకుతోడు నాలుగు కోబ్రా బెటాలియన్లను కేటాయించారు. పోలీసు శిక్షణలో మార్పు తెచ్చి ఐ.పి.ఎస్.లకు జాతీయ పోలీసు అకాడమిలో శిక్షణ ఇవ్వాలని కేంద్రం సిఫార్స్ చేసింది.

కేంద్ర ప్రభుత్వం, దేశంలోని పలు రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటివరకు రూపొందించిన ఏ చట్టంలోను 'తీవ్రవాదులు', 'తీవ్రవాదం' పదాలను వినియోగించలేదు. ఆ పదాలను వాడలేదు. చట్టంలోను, న్యాయపరంగాను ఆ పదాలకు అర్థాలు లేవు. ఉగ్రవాద చర్యల నిరోధానికి 1967లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు (నిషేధం) చట్టం, 1987 టాడా, ఆ తర్వాత పోటా వచ్చాయి. 2004లో 1967 నాటి చట్టాన్నే సవరించి నేటి వరకు అమలు చేశారు. మావోయిస్టులను ఉగ్రవాదులనడం పౌర హక్కులను హరించడమే. ఇది అప్రజాస్వామికం అని ప్రజల పక్షాన నిలిచిన మేధావులు ఖచ్చితంగా చెబుతున్నారు.

సామ్రాజ్యవాదాన్నీ, భారత దళారీ పాలకులను, భూస్వామ్యాన్ని తుదకంటా అంతమొందించే క్రమంలో మావోయిస్టు పార్టీ దేశభక్త జాతీయోద్యమ నాయకులు అల్లూరి, భగత్‌సింగ్‌ల వారసత్వాన్ని, ప్రపంచ సోషలిస్టు విప్లవ చైతన్యాన్ని కలిగి పీడిత ప్రజలపక్షాన నిలిచి పోరాడి విజయం సాధిస్తుంది. విప్లవ ప్రజల, ప్రజాస్వామికవాదుల సంపూర్ణ మద్దతు ఉద్యమానికి ఎల్లప్పుడు వుంటుంది. నిషేధాలు, నిర్బంధ దాడులు విప్లవోద్యమానికి కొత్తకాదు. అనేక విడతల నిర్బంధం అనేక విప్లవ వెల్లువలను సృష్టిస్తుంది. దృఢంగా నిలిచి ప్రజాపంథాలో నిత్య కార్యాచరణను కొనసాగిద్దాం. పాలకులకు గోరీ కడదాం. ఉద్యమం–నిర్బంధం – వుద్యమం–నిర్బంధం–ఉద్యమం–స్వేచ్ఛ, అంతిమ విజయం ప్రజారాశులదే.

★

---

*(16వ పేజీ తరువాయి...)*

నయాగఢ్, దామన్‌జోడి దాడులుపెరుగుతున్న పి.ఎల్.జి.ఎ. శక్తి సమర్థతలకు తార్కాణంగా నిలుస్తున్నాయి. ఈ విజయాలతో పాటు ఐక్య కాంగ్రెస్ తర్వాత దేశవ్యాప్తంగా పార్టీకి పలు నష్టాలు కూడా సంభవించాయి.

## పార్టీపై నిషేధం

1992 మే 21న ఆంధ్రప్రదేశ్‌లో జనార్ధన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పార్టీపై నిషేధం విధించాడు. ఆ తర్వాత విప్లవోద్యమం బలంగా వున్న మరో నాలుగైదు రాష్ట్రాల్లో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు నిషేధం విధించాయి. తాజాగా లాల్‌గఢ్ ఉద్యమాన్ని సాకుగా తీసుకొని 2009 జూన్ 22న కేంద్ర ప్రభుత్వం పార్టీని నిషేధించింది. ప్రజల ఆకాంక్షల మేరకు ఉద్యమిస్తోన్న ఒక విప్లవ రాజకీయ పార్టీని నిషేధించడమంటే ప్రజల రాజకీయాలనూ, ఆకాంక్షలనూ నిరంకుశంగా కాలరాయడమే.

## ముగింపు

ఈ విధంగా 1967లో నక్సల్బరీ అనే ఒక చిన్న ప్రాంతంలో పుట్టిన విప్లవోద్యమం, ఆనాడు దేశం నలుమూలలా ప్రభావాన్ని వేస్తే, నక్సల్బరీ వారసురాలైన మావోయిస్టు పార్టీ నేడు దేశంలోని మెజారిటీ ప్రాంతాల్లో నిర్మాణాలను సైతం ఏర్పాటు చేసుకొని నక్సల్బరీ రాజకీయాలను ముందుకు తీసుకుపోతోంది. దండకారణ్యం, బీహార్, ఝార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఆంధ్ర ప్రదేశ్, ఒడిస్సా, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో ఉద్యమం వివిధ రూపాల్లో రోజూ ప్రతిఫలిస్తూనే వుంది. ఇది నక్సల్బరీ ఉద్యమం సాధించిన పురోగతి.

యు.పి.ఎ. ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చి రాజకీయంగా బలపడింది. మిలటరీ రీత్యా మరింతగా కమాండ్, కంట్రోల్ సాధించింది. గ్రేహౌండ్స్ తరహాలో కోబ్రా బెటాలియన్‌ను తయారు చేసి ఉద్యమం బలంగా వున్న ప్రాంతాల్లోకి పంపింది. ఐ.ఎం.ఎఫ్.కు చెందిన ముగ్గురు 'సి.ఇ.ఒ.'లు( మన్ మోహన్, చిదంబరం, అహ్లూవాలియాలు) సామ్రాజ్యవాదానికి నమ్మిన బంట్లుగా పాదసేవ చేస్తూ రాజ్యాన్ని మరింత ఫాసిస్టుగా మార్చి వేస్తున్నారు. తాజాగా ఉద్యమం బలంగా వున్న నాలుగు రాష్ట్రాలకు అయిదు వేల బలగాలను పంపాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఈ విధంగా రోజు రోజుకూ పెరుగుతున్న నిర్బంధంలో కొన్ని చోట్ల ఉద్యమాలు వెనుకడుగు వేయవచ్చు. మరి కొన్ని చోట్ల ఎత్తుగడలరీత్యా పథకం ప్రకారం రిట్రీట్ కావొచ్చు. కానీ కొన్ని చోట్ల ఉద్యమం అప్రతిహతంగా ముందుకు సాగుతోంది. ఉద్యమం వెనుకడుగు వేసిన ప్రాంతాల్లోనూ ఇన్నాళ్లూ ఉద్యమం వికసింప చేసిన ప్రజా చైతన్యం ఆరిపోదు. దాన్ని దావానలం చేసే లక్ష్యంతో పార్టీనీ, పి.ఎల్.జి.ఎ.నూ, రాజ్యాధికార అంగాలను సంఘటితం చేసుకునే లక్ష్యంతో ముందుకు సాగుదాం. ★

నీళ్లలో చేపల్లా ప్రజల్లో జీవిస్తూ, ప్రజల గుండెల కొండల్లో నిలిచి శత్రువుపై గురిచూసే గెరిల్లాలకు,

# ప్రజాయుద్ధానికి ఉగ్రవాదులనే ముద్ర, నిషేధ చట్టాలు ఆటంకాలు కాజాలవు

కేంద్ర ప్రభుత్వం సి.పి.ఐ.(మవోయిస్టు) సంస్థను చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (యు.ఎ.పి.ఎ.) కింద నిషేధించింది. మావోయిస్టు పార్టీని తీవ్రవాద సంస్థగా పరిగణిస్తూ లస్కరే తోయిబా, ఎల్.టి.టి.ఇ., ఉల్ఫా, సిమి లాంటి 34 నిషేధిత సంస్థల జాబితాలో చేర్చింది. అత్యున్నత స్థాయి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు జూన్ 22న హెూంశాఖ వర్గాలు ప్రకటించాయి.

సామ్రాజ్యవాదానికి నమ్మినబంటు, మాజీ ఆర్థిక మంత్రి చిదంబరం మొన్నటి ఎన్నికల్లో ఓడిపోయి కూడా సామ్రాజ్యవాదుల ఆశీస్సులతో నడిచిన హైడ్రామాలో గెలిచినట్లు ప్రకటించుకున్నవాడు, వారి సేవకే హెూంమంత్రిగా నియమించబడినవాడు కావడంతో వేగంగానే ప్రపంచ బ్యాంకు పథకాల అమలుకు చురుగ్గా కదులుతున్నాడు. ప్రజలపై పెద్ద దాడికి పూనుకునేముందు సాంకేతిక పరమైన, న్యాయమైన ఆటంకాలను తొలగించుకుంటున్నాడు. "అస్పష్టతను తొలగించేందుకే" ఉగ్రవాద సంస్థగా పరిగణిస్తూ సి.పి.ఐ.(మావోయిస్టు)పై నిషేధం విధించినట్లు దాపరికం లేకుండా ప్రకటించాడు. సి.పి.ఐ.(ఎం–ఎల్)(పీపుల్స్‌వార్), ఎం.సి.సి.ఐ. ఐక్యమై సి.పి.ఐ.(మావోయిస్టు) ఏర్పడిన 21 సెప్టెంబర్, 2004 నాటికే వాటిపై యు.ఎ.పి.ఎ. కింద నిషేధం ఉందని గుర్తు చేశాడు. ఎటువంటి సందిగ్ధతకు తావు లేకుండా తాజాగా కేంద్రం నిషేధం విధించినట్లు స్పష్టం చేశాడు.

సి.పి.ఐ.(మావోయిస్టు) పై ఆంధ్రప్రదేశ్, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు ఇప్పటికే నిషేధం విధించాయి. బీహార్, ఒడిస్సా, తమిళనాడు లాంటి రాష్ట్రాలు యు.ఎ.పి.ఎ. కింద చట్ట విరుద్ధమైనదిగా గుర్తించాయి. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం న్యాయపరమైన అంశాలు పరిశీలిస్తున్నది. ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య పూర్తి అనుకూలం అని తేలిపోయింది. మావోయిస్టులను రాజకీయంగా ఎదుర్కోవాలనీ, 34 నిషేధిత సంస్థల సరసన చేర్చడం సరైనదికాదని సి.పి.ఐ., సి.పి.ఎం., ఆర్.ఎస్.పి., ఫార్వర్డ్ బ్లాక్ పార్టీల కేంద్ర నాయకులు మాట్లాడారు. నిషేధంతో సంబంధం లేదని తృణముల్ కాంగ్రెస్ నేత మమతా బెనర్జీ ప్రకటించింది. టి.ఆర్.ఎస్. లాంటి పార్టీలు నిషేధాన్ని పూర్తిగా వ్యతిరేకించాయి. జనశక్తి నేత కూర రాజన్న, పౌరహక్కుల సంఘాలు, విప్లవ రచయితల సంఘం లాంటి ప్రజాసంఘాలు ఇది ప్రజలపై యుద్ధంగానే అభివర్ణించాయి. ఇది అసాధారణమేమీ కాదని లోక్‌సత్తా ప్రకటిస్తే కాంగ్రెస్, బి.జె.పి., టి.డి.పి. పార్టీలు పూర్తిగా సమర్థించాయి.

మావోయిస్టులపై ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధానం వుండడం వలన కలుగుతున్న అనేక అవరోధాలను ఈ నిషేధం తొలగించింది నక్సలైట్ల రెడ్ కారిడార్ కల ఇక నెరవేరదు; కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య మరింత సమన్వయం సాధించి సరిహద్దులో చొరబాట్లు అరికట్టవచ్చు; కేంద్ర నిధులు రాష్ట్రాలకు అందే అవకాశం వుంది; ఒడిస్సా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర రాష్ట్రాలలో మరికొన్ని జాయింట్ ఆపరేషన్లు జరుగుతాయి. ఈ నిషేధం నక్సలైట్లపై పోరు జరిపే పోలీసులకు కొత్త ఉత్సాహాన్నిచ్చిందంటూ ప్రజావ్యతిరేక, విప్లవ ప్రతీఘాతుక శక్తులు గొప్పగా వ్యాఖ్యానిస్తున్నారు.

ఒక స్పష్టమైన మార్క్సిస్టు సిద్ధాంతంతో చరిత్రలో రుజువైన దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాలో కోట్లాది ప్రజల పక్షాన నాలుగు దశాబ్దాలకు పైగా దేశంలోని అన్ని భూభాగాల్లో ప్రజల మధ్య నిస్వార్థంగా, అంకిత భావంతో పని చేస్తున్న ఒక విప్లవ పార్టీని ఉగ్రవాద సంస్థగా ప్రకటించి, ఆ సంస్థ కార్యకలాపాలను నిషేధించిన ఈ దేశ ప్రభుత్వం ఏ వర్గ ప్రయోజనాలకోసం పని చేస్తుందో, సామ్రాజ్యవాదుల పాద సేవలో ఎంతగా తరించిపోతుందో, దేశ అంతరంగిక భద్రత పేరిట 90 శాతం పీడిత ప్రజలపై ఉక్కుపాదం మోపి పాశవిక హింసాకాండను అమలు చేయడానికి ఎటువంటి పథకాలను రచిస్తుందో, రష్యా, చైనా, వియత్నాం లాంటి దేశాల విప్లవ చరిత్ర తెలిసిన విప్లవ ప్రజలు, ప్రజాస్వామికవాదులు సులభంగా అర్థం చేసుకుంటారు. దోపిడీ, పీడనల రేటు పెరిగినపుడు ప్రజల్లో నిరసన జ్వాలలు

***(మిగితాది 42వ పేజీలో...)***